ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-1-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 347 పేజీలు: 10+4 వెల: 8.00

గణతంత్ర వేడుకలకు ఉగ్రముప్పు!
నల్లకోటుకు ఇక చెల్లు చీటీ! 5లో

## పారిశ్రామిక పెట్టుబడులకు పూర్తి సహకారం



శనివారం గ్రీన్ అమోనియా ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్

### రాష్ట్రంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు శ్రీకారం

### కాకినాడలో గ్రీన్‌కో ఎనర్జీ ప్రాజెక్టు శంకుస్థాపనలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

### రూ.15,600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్ర అభివృద్ధిలో సహకరించిన పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించి అండగా ఉంటుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎక్కడ లేని గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసే గ్రీన్‌కో ఎనర్జీ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మా పివిఎన్ మాధవ్ శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్య రహిత గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయడానికి ముందుకు వచ్చిన గ్రీన్ కో సంస్థ వ్యవస్థాపకులు చలమల శెట్టి అనిల్ , మహేష్‌ను చంద్ర బాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రా మికవేత్తల్లో కూటమి ప్రభుత్వం విశ్వాసం నింపుతుందని, గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సంక్షోభంలో నెట్టిందని, కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపుతుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలనీ, రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కూటమి అండగా ఉంటుందని, పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతి అడుగులో పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతుందని హామీ ఇచ్చారు. మా ప్రభుత్వం నుంచి పెట్టుబడిదారులకు ఎలాంటి వేధింపులు ఉండవ్వని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం కల్పిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ని అగ్రగామిగా నిలిపే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రీన్ కో అమ్మోనియా సంస్థ చైర్మన్ లను పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. ఏఎం గ్రీన్ సంస్థ వారి గ్రీన్ అమ్మోనియా/గ్రీన్ హైడ్రోజన్ కాంప్లెక్స్,గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నమూనాని పరిశీలించి. యంత్ర పరికరాల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం అని గ్రీన్‌కో వ్యవస్థాపకులు చలమలశెట్టి అనిల్ నిరూపించారు. అనేక కష్టన ష్టాలను తట్టుకుని ఈ రోజున ఏఎం గ్రీన్ కంపెనీస్థాపించారు. కాకినాడలో 495 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టుఏర్పాటు కానుంది. ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్‌అమ్మోనియా ఉత్పత్తి >>2



## వందేభారత్ స్లీపర్ పట్టాలపైకి

### బెంగాల్‌లోని మాల్దా స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోడీ

### హౌరా-గువాహతి మధ్య ప్రయాణించే రైలు


**మాల్దా, జనవరి 17:** దేశంలోనే తొలివందే భారత్ స్లీపర్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం ప్రారంభించారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దా టౌన్ రైల్వేస్టేషన్ నుంచి హౌరా-గువాహటి(కామాఖ్య) మధ్యరాకపోకలు సాగించే స్లీపర్ రైలుకు పచ్చజెండా ఊపారు. >>2

## మమత ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చేసింది

### దయలేని ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పండి: మాల్దా బహిరంగసభలో ప్రధాని మోడీ ధ్వజం



**మాల్దా, జనవరి 17:** బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బిజెపికి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బిజెపి ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు. టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోందని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమ వుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బీహార్‌లలో బిజెపి వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బిజెపి ఇటీవల చారిత్రక విజయం సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. ఈసారి బెంగాల్లో మార్పు అవసర ముందని నేను చెబుతాను బిజెపి సర్కార్ కావాలి అని మీరు చెప్పండి అంటూ సభికులను మోదీఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూరమైన దయలేని ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు.



### మాజీ ఎంపి విజయసాయికి ఇడి నోటీసులు

### లిక్కర్ కుంభకోణం కేసు

**విజయవాడ,జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణకు హాజరై విజయసాయిరెడ్డి పలు అంశాలను వెల్లడించారు. ఈ కేసు విషయంలో రెండు సార్లు మీడియా ముందుకు వచ్చారు. గత ఏడాది ఏప్రిల్ 22న సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తాను ఈ >>2



### మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌కు నాన్ బెయిలబుల్ వారంట్లు

**విజయవాడ,జనవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై పోక్సో కోర్టు నాన్ బెయిలబుల్ వారంట్ జారీ అయింది. అత్యాచార బాధితురాలి పేరు బయటపెట్టారంటూ విజయవాడ సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసులో వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై విజయవాడ పోక్సో న్యాయస్థానం ఈ నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు మేరకు గోరంట్ల మాధవ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. శుక్రవారం విచారణకు హాజరుకాని మాధవ్‌పై న్యాయమూర్తి వారంట్ జారీ చేశారు. కేసు తదుపరి విచారణను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు.




### సిక్కోలు అభివృద్ధికి వినూత్న ప్రాజెక్టులు

### తిలారు రైల్వేస్టేషన్‌లో విశాఖ హాల్టును జెండా ఊపి ప్రారంభించిన మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

### ప్రజలు శ్రీకాకుళానికి వలస వచ్చేలా అభివృద్ధి చేస్తామని హామీ

**శ్రీకాకుళం, జనవరి 17 ప్రభాతవార్త:** కనెక్టివిటిను పెంచడం ద్వారానే శ్రీకాకుళం మరింతగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారంశ్రీకాకుళం జిల్లాలోని తిలారు రైల్వే స్టేషన్లో బ్రహ్మపూర్ విశాఖ బ్రహ్మపూర్ (18525/18526) ఎక్స్‌ప్రెస్ నూతన హాల్టును మంత్రి అచ్చెన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి, రైల్వే అధికారులతో కలసి రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. >>2

## ఆర్టీసీకి జాతీయ అవార్డు

### ప్రయాణికుల సేవల్లో డిజిటల్ టెక్నాలజీ సమర్థవంతంగా వినియోగం

### ఆ అవార్డు రాష్ట్రానికి గర్వకారణం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి


డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డును అందుకుంటున్న చీఫ్ ఇంజనీర్ (ఐటీ), వై. శ్రీనివాస రావు

**విజయవాడ,జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాణికుల సేవల్లో డిజిటల్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీకి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. గవర్నెన్స్ నౌ 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డును ఏపీఎస్‌ఆర్టీసీ దక్కించుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది అంకితభావంతో ప్రయాణికులకు సేవలు అందిస్తున్న తీరు అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ప్రయాణికులకు అవసరమైన సమాచారం ముందుగానే అందేలా చర్యలు తీసుకోవడం వల్ల సేవల నాణ్యతలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజాసేవలో డిజిటల్ సాంకేతికతను విజయవంతంగా అమలు చేసిన ఆర్టీసీ కృషికి జాతీయ వేదికపై గుర్తింపు రావడం ఆనందకరమన్నారు. ముఖ్యంగా ప్రధాన బస్టాండ్లలో అమలు చేస్తున్న ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆర్టీసీ ముందడుగు వేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత ఆధునికమైన, ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ పనిచేస్తోందన్నారు. 2025 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఏపీఎస్‌ఆర్టీసీని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన బస్ స్టేషన్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం అందిస్తున్నందుకు ఈ గౌరవం దక్కింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు అవార్డును స్వీకరించారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చీఫ్ ఇంజనీర్ (ఐటీ), వై. శ్రీనివాస రావు దిల్లీలో ఈ అవార్డును తీసుకున్నారు. అవార్డు రావడంపై ఆర్టీసీ ఎండీ హర్షం వ్యక్తం చేశారు. దీనికోసం కృషి చేసిన అధికారులను, సూపర్వైజర్లు, సిబ్బందిని అభినందించారు. సీఎం చంద్రబాబు విజన్ కు అనుగుణంగా సంస్థలోని సిబ్బంది అందరూ అంకిత భావంతో పని చేస్తున్నారని ఎండీ అన్నారు. సంస్థను అభివృద్ధి బాటలో నడిపించి, ప్రయాణికుల మన్ననలను పొందాలని ఎండీ ద్వారకా తిరుమలరావు సూచించారు.

## ఎపి నుంచి మళ్లీ తెలంగాణకు రిటర్న్..

### ముగిసిన సంక్రాంతి సందడి

### కిటకిటలాడుతున్న బస్, రైల్వే స్టేషన్లు


జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా దగ్గర వాహనాల రద్దీ

**విజయవాడ,జనవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండగ ముగియడంతో ఆంధ్రా నుంచి తెలంగాణకు మళ్లీ తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. పండగకు వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చిన ప్రజలు మళ్లీ తిరుగుముఖం పడుతున్నారు. ప్రయాణికుల తిరుగు ప్రయాణం రద్దీ కారణంగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కిటకిటలాడుతుంది. రైల్వే స్టేషన్ పరిస్థితి అలానే ఉంది. సాయంత్రం నుంచి రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. విజయవాడ బస్ స్టేషన్ లో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు మొదలైన ప్రాంతాలకు 1200 బస్సులు నడిపింది. ఏపీలోని విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, విజయవాడ, నెల్లూరు నుంచి 18న వచ్చే సాధారణ బస్సుల్లో దాదాపు సీట్లు లేవు. ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న బస్సుల్లో ప్రత్యేక ఛార్జీల మోత తప్పడం లేదు. రంగారెడ్డి రీజియన్ నుంచి విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ, ఒంగోలు, కందుకూరు, కనిగిరి, కర్నూలు ప్రాంతాలకు సాధారణ రోజుల్లో 300 బస్సులు నడుపుతుండగా సంక్రాంతి నేపథ్యంలో 200 అదనంగా నడిపినట్లు రంగారెడ్డి ఆర్టీసీ అధికారులు తెలిపారు. రైల్వే రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రత్యామ్నాయంగా బస్సుల వైపు చూస్తున్నారు. బస్సుల్లో కూడా అదే పరిస్థితి కనిపిస్తుంది. హైదరాబాద్ వంటి >>2

## నేడు దావోస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు



### ప్రపంచ ఆర్థిక సదస్సులో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీలు

### ఐబిఎం, గూగుల్ క్లౌడ్, ఎపి మోలర్ మేర్స్క్ సంస్థల సిఇలతో చర్చలు

### స్విట్జర్లాండ్, యుఎఇ సహా వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశాలు

### తొలిరోజు 20 దేశాలకు చెందిన ఎన్నారైలతో తెలుగు డయాస్పోరా కార్యక్రమం

### 23వ తేదీన భారత్‌కు తిరిగి రాక

**విజయవాడ జనవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం ఆదివారం దావోస్ బయల్దేరి వెళ్లనుంది. 4 రోజులపాటు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ముఖాముఖి భేటీలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆదివారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ వెళ్లనున్న సీఎం, అక్కడి నుంచి జ్యూరిచ్‌కు వెళ్తారు. ఢిల్లీలో 19 తేదీన రాత్రి 01.45గంటలకు బయల్దేరి ఉదయం జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. జ్యూరిచ్‌లోని >>2



శనివారం కాకినాడు గ్రీన్‌అమోనియా ప్రాజెక్టు ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

# పారిశ్రామిక పెట్టుబడులకు పూర్తి సహకారం

>> లక్ష్యంగా పెట్టుకునిరూ. 15, 600 కోట్లు పెట్టుబడితో ప్రారంభం అవుతున్న ఈ సంస్థలో 8 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పాదక ఇంధన పెట్టుబడులు రానున్న అన్నారు. 2027 ఏడాది చివరికి తొలి దశ కమిషనింగ్ లక్ష్యంగా, పునరుత్పాదక ఇంధన ఆధారిత శుద్ధ ఇంధన కేంద్రంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులో నిర్మాణ దశలో సుమారు 8,000 మందికి, ఆపరేషన్ దశలో సుమారు 1,500 మందికి ప్రత్యక్ష ఉపాధి, పరోక్షంగా కొన్ని వేల మందికి దీర్ఘకాల ఉపాధి అవకాశాలు సృష్టించే ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వ్యవస్థాపకులు అయిన చలమలశెట్టి అనిల్ మహేష్ కు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఇది భారత దేశం నుంచి యూరోపియన్ దేశాలకు జరుగుతున్న తొలి శుద్ధ ఇంధన ఎగుమతి ఒప్పందం. ఈ చారిత్రాత్మక ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా ఉండడం మనందరికీ గర్వకారణం అని ముఖ్యమంత్రి అన్నారు . గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు దేశ, రాష్ట్ర సుస్థిర అభివృద్ధి సాధనలో బలమైన అడుగు. వ్యవసాయం నుంచి రవాణా వరకు అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు ఉపయోగపడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం ఎంపీ హరీష్ మాధవ్ బాలయోగి, డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ పట్టణం, కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ,యనమల దివ్య,వి.సత్యప్రభ,ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఏఎం గ్రీన్ అమ్మోనియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సిహెచ్. అనిల్ కుమార్ ,ప్లాంట్ యాజమాన్యం ప్రతినిధులు, ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రోజెక్ట్ హెడ్ సీహెచ్.శ్రీనివాసరావు, కాకినాడ ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస నాయుడు, ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమం సమన్వయకర్త వి.నాగవర్ధన్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్.వర్మ, మాజీ జెడ్పీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్,కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ కాకినాడ జిల్లా ఉన్నత అధికారులు, ఏయం గ్రీన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 9 మందికి రిమాండ్ పొడిగింపు

**విజయవాడ.జనవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న తొమ్మిది మందికి విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ, అనిల్ చోక్రా, రోణక్ కుమార్‌ను శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారికి రిమాండ్‌ను 30వ తేదీ వరకు కోర్టు పొడిగించింది. బెయిల్‌పై ఉన్న పి.కృష్ణమోహన్ రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె. ధనంజయ్‌రెడ్డి మాత్రం వాయిదాకు హాజరుకాలేకపోతున్నామని ఆబ్‌సెంట్ పిటిషన్ దాఖలు చేశారు.

# ట్రంప్‌కు మోడీ దాసోహం సిగ్గుచేటు

## చంద్రబాబు, నితీశ్ అండతో కేంద్రంలో బిజెపి పాలన: సిపిఐ అగ్రనేత నారాయణ

**విజయవాడ, జనవరి 17 ప్రభాతవార్త :** విజయవాడలోని రాష్ట్ర సి పి ఐ కార్యాలయం దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ కే నారాయణ మాట్లాడు తూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా ఉన్న మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు దాసోహం అవ్వడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో జరుగనున్న పార్టీ శతాబ్ది ముగింపు వేడుకలను పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ ప్రపంచం నేడు ఉద్రిక్తత వాతావరణంలో ఉందని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడని, తన బాల్యాన్ని రాత్రికి రాత్రే కిడ్నాప్ చేయడం అత్యంత దురదృష్టకరమైన చర్యగా అభివర్ణించారు.అణ్వాయుధాలు, డ్రగ్స్ సరఫరా నెపంతో వివిధ దేశాలపై దాడులకు తెగపడటం మంచి పరిణామం కాదన్నారు. ఆయా దేశాల రాజకీయ, ఆర్థిక మూలలపై దెబ్బ కొట్టేందుకు ట్రంప్ బ్లాక్ మెయిల్ సింబల్ గా నిలిచాడని పేర్కొన్నారు. దేశంలో పాలన చేస్తున్న మోదీ పర్యటనలో పేరుతో ఇతర దేశాల్లో ఎక్కువగా ఉంటున్నాడని, ట్రంప్ తో స్నేహసంధాలు ఉన్నాయని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. సుంకాలు పేరు తో భారీగా భారాలు మోపుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు, నితిశ్ కుమార్ అండతో కేంద్రంలో బీజేపీ పాలన చేస్తోందని, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోదీ కి ఎందుకు వంతపాడుతున్నారని నిలదీశారు. స్వప్రయోజనాలు కోసం మోదీకి, ట్రంప్ కు దాసోహం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల జలవివాదాలు తారస్థాయికి చేరుకున్నాయని , ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. అమరావతి రాజధాని కోసం రెండవ సారి భూములు లాక్కోవడం మంచి పద్ధతి కాదని సీఎం చంద్రబాబుకు సూచన చేశారు.గత జగన్ మోహన్ రెడ్డి సమయంలో అమరావతి ప్రజలు పడిన కష్టాలు అన్ని ఇన్ని కావని మరలా అదే పరిస్థితులను కూటమి ప్రభుత్వం తీసుకురావడం సరికాదని హితవు పలికారు. అమరావతి ఉద్యమాల్లో అనేకమార్లు పాల్గొన్నానని ప్రజల కన్నీరు తెలుసని ఆ కన్నీళ్లు ఊరికేపోవని మరలా ఆ పరిస్థితి రాకుండా చంద్రబాబు చూడాలని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో తగ్గేది లేదంటూ 17 కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణకు పూనుకున్నారని మండిపడ్డారు. రాజధానిలో 53 వేల ఎకరాలు ఎక్కువ అనుకుంటే మరలా ల్యాండ్ పూలింగ్ కు ఆహ్వానించడం సరికాదన్నారు. దీంతో రైతాంగం తీవ్రంగా ఆందోళన చెందుతుందని అన్నారు. అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు అవుతున్న రాజధాని రైతులు సమస్యలు పరిష్కరించలేని రాబోయే రోజుల్లో రైతులు పక్షంగా సీపీఐ పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

# ఇండిగోపై డిజిసిఎ రూ.22 కోట్ల భారీ జరిమానా

**న్యూఢిల్లీ, జనవరి 17:** దేశీయ విమాన సర్వీసుల సంస్థ ఇండిగోపై పౌరవిమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ రూ.22కోట్ల పెనాల్టీ విధించింది. సీనియర్‌మేనేజ్‌మెంట్‌పైనా తీవ్రస్థాయిలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. నిర్వహణ తీరులో లోపాలను ఎత్తిచూపిన డిజిసిఎ నిబంధనలపరంగా పలు లోపాలున్నాయని, భారీ సంఖ్యలో విమానసర్వీసులకు తరచూ అంతరాయాలు రావడంలో మేనేజ్‌మెంట్ లోపాలే ఎక్కువ ఉన్నట్లు చూపించింది. గత ఏడాది డిసెంబరు మూడు నుంచి ఐదో తేదీ మధ్యలో ఇండిగో 2507 సర్వీసులను రద్దుచేసింది. 1852 విమానసర్వీసుల్లో విపరీత జాప్యం జరిగింది. దీనివల్ల సుమారు మూడు లక్షలమందికిపైగాప్రయాణీకులు ఎయిర్‌పోర్టుల్లోనే నిలిచిపోవాల్సివచ్చింది. డిజిసిఎ ఉత్తర్వులు మాకు అందాయని, తగిన కార్యాచరణ అమలుచేస్తామని ఇండిగో మేనేజ్‌మెంట్ స్పష్టంచేసింది. గత ఏడాది ఆటంకాలతర్వాత పూర్తిస్థాయిలో సమీక్షించి సర్వీసులను అప్పటికప్పుడు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామని, 19 ఏళ్ల తమ సంస్థ కార్యకలాపాల్లో ఇలాంటి సంఘటనలు జరగడం ఇదే మొదటిసారి అని అయితే కేవలం రెండుమూడురోజుల్లోనే పరిష్కరించుకున్నామని ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ స్పష్టంచేసింది. ప్రభుత్వం విడుదలచేసిన ఉత్తర్వుల్లో డిజిసిఎ రూ.1.80 కోట్లు వన్‌టైమ్ పెనాల్టీగా ఆరుసార్లు పౌరవిమానయాన శాఖ ఉల్లంఘనలకుగాను విధించింది. మరో రూ.20.40 కోట్లు ఎఫ్‌డిటిఎల్ నిబంధనలు 68 రోజులపాటు అమలు చేయక పోవడంపై విధించారు. డిసెంబరు ఐదో తేదీనుంచి ఫిబ్రవరి 10వ తేదీవరకూ రోజుకు రూ.30 లక్షల చొప్పున జరిమానా వేసారు. మొత్తం పెనాల్టీ రూ.22కోట్లుగా డిజిసిఎ వెల్లడించింది.



# మహిళా ప్రీమియర్‌లీగ్‌లో ఆర్సీబీదే హావా

## 8 వికెట్ల తేడాతో ఢిల్లీ కేపిటల్స్ ఓటమి

**నవీముంబయి, జనవరి 17:** మహిళల ప్రీమియర్ నాలుగో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తనహవా చూపిస్తోంది. హ్యాట్రిక్ విజయాలతో అగ్రస్థానంలో ఉన్న ఆ జట్టు నవీ ముంబైలో చివరి మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. భారీ ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన(96) విధ్వంసక అర్ధ శతకంతో విరుచుకు పడింది. జార్జియా వోల్(54 నాటౌట్)తో సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. విజయానికి 11 పరుగులు అవసరమనగా మంధాన ఔటైంది. ఆ తర్వాత రీచా ఘోష్7 పరుగులతో నాటౌట్ లాంఛనం పూర్తి చేసింది. 8 వికెట్ల తేడాతో పది బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబీ విక్టరీ సాధించింది. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌లో మాజీ ఛాంపియన్ ఆర్సీబీ అజేయంగా దూసుకెళ్తోంది. శనివారం జరిగిన రెండో డబుల్ హెడర్‌లో ఛాలెంజర్స్ ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లింది ఆర్సీబీ. 167 పరుగలు ఛేదనలో స్మృతి మంధాన(96) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడితే జార్జియా వోల్(54 నాటౌట్) సైతం దంచేసింది. వీరిద్దరూ సెంచరీ భాగస్వామ్యంతో బెంగళూరు విజయాన్ని మరింత సులభతరంచేసారు. టాస్ ఓడిన ఢిల్లీకి తొలి ఓవర్లోనే బిగ్ షాకిచ్చింది లారెన్ బెల్(3-26). తొలి ఓవర్లోనే డేంజరస్ ఓపెనర్ లిజినే లీ(4)ని ఔట్ చేసిన ఆ తర్వాతి బంతికే లారా వొల్వార్డ్(0)ను క్లీన్‌బౌల్డ్ చేసింది. రెండో ఓవర్లో సయాలీ సత్ఘరే(24) తన పేస్ మ్యాజిక్‌తో వరుస బంతుల్లో జెమీమా రోడ్రిగ్స్(4), మరినే కాప్(0)లను బౌల్డ్‌చేసి ఢిల్లీని కష్టాల్లోకి నెట్టింది. తొమ్మిది బంతుల్లో 10కే ఆ జట్టు నాలుగు వికెట్లు పడ్డాయి. వందలోపే కుప్పకూలేలా కనిపించిన ఢిల్లీని ఓపెనర్ షఫాలీ వర్మ(62) విధ్వంస అర్ధ శతకంతో ఆదుకుంది. స్నేహ్ రానా(22) తోడుగా ఇన్నింగ్స్ నిర్మించిన షఫాలీ ఆఖర్లో హామిల్టన్(36) జతగా స్కోర్ బోర్డును ఉరికించింది. శ్రేయాంక వేసిన 19వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదడంతో ఢిల్లీ స్కోర్ 160 దాటింది. వీరిద్దరి మెరుపులతో ఆర్సీబీకి 167 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది ఢిల్లీ.

# సిక్కోలు అభివృద్ధికి వినూత్న ప్రాజెక్టులు

>> అంతకుముందు ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో అతిథులతో కలసి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో రైల్వే విషయంలో అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న రామ్మోహన్ నాయుడును మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. ఇదే సందర్భంలో భవిష్యత్ అవసరాలను తీర్చే దిశగా నూతన ప్రాజెక్టులను తీసుకు రావాలని కోరారు. రైల్వేలు ఎంతగా అభివృద్ధి చెందుతున్న అండర్ పాసేజ్‌ల విషయంలో స్థానిక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వర్షాలు వస్తున్న సమయంలో ఈ ఇబ్బందులు రెట్టింపు స్థాయిలో ఉంటున్నాయని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా రైల్వే అధికారులు చొరవ చూపాలని కోరారు. శ్రీకాకుళంలో రైల్వే అభివృద్ధి కోసం ఆనాడు ఎర్రంనాయుడు విశేష కృషి చేసారని, అనేక నూతన సర్వీసుల ప్రారంభం, హాల్టుల కేటాయింపు జరిగాయని గుర్తు చేశారు. అదే పంథాను కొనసాగిస్తున్న రామ్మోహన్ నాయుడు ఇప్పటికే అనేక నూతన సర్వీసులను, హాల్టులను ఇటీవల కాలంలో ఏర్పాటు చేయించారని అన్నారు. కోటబొమ్మాలి, హరిశ్చంద్రపురం, తిలారు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చెయ్యాల్సిన ఆవశ్యకతను వివరించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్లో సమీప భవిష్యత్‌లో రెండు మూడైనా సర్వీసులు ఆగేలా చొరవ చూపాలని రామ్మోహన్ నాయుడును కోరారు.ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ తిలారు పరిసర ప్రాంత ప్రజలకు మరింత సౌకర్యవంతం అయ్యేలా మరో సర్వీసును ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైల్వే అంటేనే మొదట గుర్తుకు వచ్చే పేరు కింజరాపు ఎర్రంనాయుడు అని అన్నారు. శ్రీకాకుళం అభివృద్ధికి, తాను, బాబాయ్ అచ్చెన్నాయుడు కట్టుబడి ఉన్నామని తెలిపిన రామ్మోహన్ నాయుడు అనేక కీలక ప్రాజెక్టులు సమీప భవిష్యత్‌లో అందుబాటులోకి రానున్నాయని అన్నారు. మూలపేట పోర్టు ద్వారా సిక్కోలు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని, తన శాఖ తరపున శ్రీకాకుళం జిల్లాలో ఓ విమానాశ్రయం నిర్మాణం వైపు కూడా ఎగంగా అడుగులు వేస్తున్నామని రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. తిలారు రైల్వే స్టేషన్‌లో నూతనహాల్టు ప్రారంభోత్సవంలో కూటమిశ్రేణులతో కలసి కేంద్ర,రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం స్టేషన్‌అభివృద్ధికి సంబంధించి స్థానికుల నుండి వినతులను స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను రైల్వే అధికారులతో కలసి పరిశీలించి పలు సూచనలు చేశారు.



స్థానికుల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

# నేడు దావోస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు

>> హిల్టన్ హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్విట్జర్లాండ్ భారతీయ రాయబారి మృదుల్ కుమార్ మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిషోర్ లుల్లా, సహ అధ్యక్షులు రిథిమా లుల్లా, స్వనీత్ సింగ్‌లు కూడా ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. అనంతరం భారత ఎంబసీ ఆధ్వర్యంలో జ్యూరిచ్‌లోని హిల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. మొత్తం 20 దేశాల నుంచి వచ్చే ఎన్‌ఆర్‌టీలతో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని తెలుగు ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గాన దావోస్ వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో వివిధ దేశాల మధ్య జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం టాటాసన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కూడా దావోస్ వేదికగా సీఎంతో సమావేశం అవుతారు. విదేశీ మీడియా సంస్థ పొలిటికోకు ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ రెండో రోజు పర్యటనలో భాగంగా హోటల్ మోరోసాని ప్రోమెనేడ్‌లో ఇండియా ఎట్ సెంటర్ జియోగ్రఫీ గ్రోత్ ఏపీ అడ్వాంటేజ్ పేరిట సీఐఐ నిర్వహిస్తున్న బ్రేక్ ఫాస్ట్ సెషన్‌లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం ఛైర్మన్ సీఈఓ అరవింద్ కృష్ణతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. ఈ భేటీకి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా హాజరుకానున్నారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తోనూ సీఎం సమావేశం కానున్నారు. ముఖాముఖి భేటీల అనంతరం ఏపీ లాంజ్‌లో నిర్వహించనున్న వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ ప్యానల్ డిస్కషన్‌కు సీఎం హాజరుకానున్నారు. అనంతరం ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ బీసీ ఇంటర్నేషనల్‌కు కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్‌లో వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంక్, అనిల్ మూర్తిలతో సీఎం కొద్దిసేపు సమావేశం అవుతారు. ప్రపంచ ఆర్థిక సదస్సు సెషన్‌లో ఎనర్జీ ట్రాన్సిషన్ లీడర్స్ సమావేశంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు. స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల డిప్యూటీ మినిస్టర్ హెలెన్ బడ్లిజెర్ అర్టెడా, రాయబారి ఆండ్రియా రౌబర్‌తో సీఎం చర్చలు జరుపుతారు. అలాగే స్విట్జర్లాండ్ పార్లమెంటు సభ్యుడు, భారత స్విస్ ఫ్రెండ్ షిప్ గ్రూప్ అధ్యక్షుడు నిక్ గుగ్గర్ సహా ఇతరులతో సీఎం సమావేశం కానున్నారు. అనంతరం ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్మండ్‌తో సీఎం భేటీ అవుతారు. ఇజ్రాయెల్ ఆర్థిక పారిశ్రామిక విభాగం మంత్రి నిర్ బర్కత్, ఆ దేశ ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ఎకనామిక్ ట్రేడ్ మిన్ హెడ్ షిర్ స్లడ్కి తోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరపనున్నారు.

రెండో రోజు సాయంత్రం జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ ఎండీ సజ్జన్ జిందాల్, జెఎస్ డబ్ల్యూ సిమెంట్స్, పెయింట్స్ సంస్థల ఎండీ పార్థ్ జిందాల్‌తోనూ సీఎం భేటీ అవుతారు. అంతర్జాతీయ కంటైనర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్ మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్ తో సీఎం ముఖాముఖి సమావేశం అవుతారు.

# వందేభారత్ స్లీపర్ పట్టాలపైకి


>> గువాహటి(కామాఖ్య)హౌరా మధ్య నడిచే వందే భారత్ స్లీపర్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్‌రైలులోప్రయాణించే విద్యార్థులతోముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధానిపరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరా అస్సాం గువాహతి మధ్య ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది. గంటకు 180 కిలోమీటర్ల గరిష్టవేగంతో నడుస్తుంది. రైల్వే భద్రత కమిషనర్ సమక్షంలో కోటా రాజస్థాన్‌నుంచి నాగ్డా మధ్యప్రదేశ్‌మధ్య తుదిపరీక్షలునిర్వహించారు. గాజు గ్లాసుల్లో నీళ్లనింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజన్‌లో ఉంచినా రైలు గరిష్టవేగం చేరుకుంది. ఈరైలులో 16కోచ్‌లున్నాయి. ఆకర్షణీయమైన స్లీపర్ బెర్తులు, అదునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పునున గుర్తించే వ్యవస్థలు, సిసిటివినిగా వంటివి ఉన్నాయి. కనీస ఛార్జి రూ.960 నుంచేప్రారంభం అవుతుంది. ఆర్ఎసి, వెయిటింగ్ వంటివి వీటిలో కనిపించవు. పశ్చిమ బెంగాల్, అస్సాంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా పలు రైళ్లు, రోడ్డు ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేసారు. మాల్దా బహిరంగ సభలో రూ.3,250 కోట్ల విలువ చేసే రైల్, రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. మోడ్రన్ ఇండియాలో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక ఫీచర్లతో వందే భారత్ స్లీపర్ రైలును డిజైన్ చేశారు. మేక్‌ఇన్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా భారత్‌లోనే వీటి డిజైన్, తయారీ చేపడుతున్నారు. 16 బోగీలు, 823 మంది ప్రయాణికులతో సుమారు 180 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణిస్తుంది. ఇందులో అడ్వాన్స్‌డ్ సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. వేగం, సురక్షితం, మరిన్ని సదుపాయాలతో సుదూర ప్రయాణాలను సాగించనుంది. ఈ రైలుతో హౌరాగువాహటి(కామాఖ్య) మార్గంలో సుమారు 2.5 గంటల ప్రయాణ సమయం తగ్గుతుంది. ఈనెల 18న హుగ్లీ జిల్లాలోని సింగూరు వద్ద రూ.830 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభిస్తారు. మరికొన్నింటికి శంకుస్థాపనలు కూడా చేయనున్నారు.

# ఎపి నుంచి మళ్లీ తెలంగాణకు రిటర్న్..

>> ప్రాంతాలకు సరిపోయే బస్సులు లేక ప్యాసింజర్ సర్వీసులనే బోర్డులు మార్చి హైదరాబాద్ కు పంపుతున్నారు. తిరుగు ప్రయాణికులతో గొల్లపూడి బైపాస్ వద్ద కూడా పరిస్థితి రద్దీగా మారింది. వేలాది వాహనాలు హైదరబాద్ బాట పట్టాయి. రేపటికి వాహనాల తాకిడి ఇంకా పెరిగే అవకాశం ఉంది. పండగ సెలవుల అనంతరం హైదరాబాద్ వెళ్లేవారితో హైదరాబాద్‌విజయవాడ రహదారి రద్దీగా మారింది. ఉదయం నుంచి వాహనాల తాకిడి ప్రారంభం కాగా, మధ్యాహ్నానికి వాహనాల సంఖ్య మరింత ఎక్కువగా పెరిగింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద నెమ్మదిగా వాహనాలు కదులుతున్నాయి. హైదరాబాద్ నుంచి కోదాడ, సూర్యాపేట, నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, మహబూబ్‌నగర్, అచ్చంపేట, నారాయణపేట, బస్సు సర్వీసులు సాగుతున్నాయి. రంగారెడ్డి రీజియన్ నుంచి విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ, ఒంగోలు, కందుకూరు, కనిగిరి, కర్నూలు ప్రాంతాలకు సాధారణ రోజుల్లో 300 బస్సులు నడుపుతుండగా సంక్రాంతి నేపథ్యంలో 200 అదనంగా నడిపినట్టు రంగారెడ్డి ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# లుంగీకట్టి.. పొలంలోకి దిగి!

## రైతులతో కలిసి పని చేసిన మంత్రి నిమ్మల



పాలకొల్లు, జనవరి 17 ప్రభాతవార్త: మంత్రి అనేసరికి ఓడ లాంటి కారులో రైరైమంటూ వెళ్ళిపోతారని అనుకుంటాం. కానీ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడికి మాత్రం నిరంతరం శ్రమించడం అంటేనే ఇష్టం ఏమాత్రం ఖాళీ దొరికిన ఆయన ఒక్కసారిగా శ్రామికుడిగా మారిపోతారు. సైకిల్ మీద పేపర్ వేస్తారు, చెత్త చెదారం ఉంటే తొలగిస్తారు పేదవాడు ఇల్లు కట్టుకుంటుంటే కూలీగా మారిపోతారు. బడికో కాలేజీకి వెళితే గురువు అవతారం ఎత్తుతారు . వరదలు వచ్చి గట్లు తెగిపోతే అడ్డుకట్టగా నిలుస్తారు. అది తుఫాన్ అయినా వరదైన ఆయన లక్ష్యం ఒక్కటే ప్రజలు ఇబ్బంది పడకూడదు నష్టపోకూడదు అదే తత్వంతో ప్రతిపక్షంలో ఉన్న మంత్రిగా ఉన్న ఆయన నైజం మాత్రం ఒక్కటే . అయితే శ్రామికుడు లేకపోతే కర్షకుడు . సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అందుకే ఆయన తన స్వగ్రామం ఆగర్తి పాలెంలో రైతుగా మారిపోయారు నిక్కార్చైన రైతుగా లుంగీకట్టారు. ఆయన శరీరానికి పసుపు చొక్కా ఎప్పుడూ ఉండి పోతుంది. రైతుగా కూడా పసుపు చొక్కా వేసుకుని పచ్చటి చేలో దిగారు. చేనుకు ఎరువులు జల్లారు మిగతా రైతులతో పాటు ఆయన అక్కడే తేనేరూ సేవించారు. తనకు ఇంత ఆనందం తృప్తి మరి ఏమి చోట ఏ పనిలోనూ దొరకదని నవ్వుతూ చెప్పారు. అందుకే శ్రమయేవ జయతే అన్నారేమో !

# ఇడి నోటీసులు

>> కేసులో విజిల్ బ్లోయర్ అంటూ పోస్టు పెట్టారు. గత ఏడాది ఏప్రిల్ 18న తొలిసారి సిట్ విచారణకు హాజరైన తర్వాత తాను వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానాలపై జరిగిన సమావేశాల్లో రెండు సార్లు పాల్గొన్నానని కిక్‌బ్యాక్‌లు ఎవరికి వెళ్లాయో తనకు తెలియదంటూ చెప్పుకొచ్చారు. ఈ కుంభకోణానికి మాజీ సీఎం ఐటీ సలహాదారుగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డిని సూత్రధారిగా పేర్కొంటూ ఆరోపణలు చేశారు. గత ఏడాదిలో మే నెలలో సీఐడీ విచారణలో మద్యం కుంభకోణం గురించి ప్రస్తావించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు వ్యక్తుల వివరాలను అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. మద్యం పాలసీ రూపకల్పనకు సంబంధించిన సమావేశాల్లో కెసిరెడ్డితో పాటు సజ్జల రామ కృష్ణారెడ్డి, మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నట్లు సిట్ దృష్టికి తెచ్చారు. మద్యం కుంభకోణంలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, అతని బంధువు అవినాష్ రెడ్డి, మరికొందరు వ్యక్తులు హవాలా మార్గాల్లో డబ్బు తరలించారని వివరించారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాలి: మద్యం విధానం అమలులో తాను నేరుగా ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని, అమ్మకాలతో తనకు సంబంధం లేదని గతంలో సిట్ ముందు స్పష్టం చేస్తూ, దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తానని, అధికారులు ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరవుతానని తెలిపారు. అసలైన నిందితులు పట్టుబడేందుకు అధికారులకు మరింత సమాచారం అందిస్తానని పేర్కొన్నారు. 'తప్పు చేసిన వారు ఎవరైనా దానికి తగిన శిక్ష అనుభవించాల్సిందే' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## వారం - వర్జ్యం

18-01-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,,ఉత్తరాషాఢ కార్తె
● అమావాస్య రా.1.20
పూర్వాషాఢ ఉ.10.12
వర్జ్యం : సా.6.45-8.27
దు.సా.4.22-5.07
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**వృషభం:** ఏ పనిని చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మిథునం:** దీర్ఘకాలిక ఋణాలు తీరి కొంత ఊపిరి పీల్చుకుంటారు. పరిశోధన విషయాలపై ఆసక్తి.

**కర్కాటకం:** క్రయ, విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేకపోవచ్చు. శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** సన్నిహితుల నుండి అందిన సమాచారం కొంత ఆందోళన గురి చేస్తుంది. వాహనయోగం.

**కన్య :** కొత్త కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయుటానికి విఫల యత్నం చేస్తారు. వస్త్రాలు కొనుగోలు. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** ఇంటి యందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తిచేస్తారు. భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు.

**వృశ్చికం:** కుటుంబంలో ఒకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తిచేస్తారు.

**ధనుస్సు:** నూతన పెట్టుబడులకు అనుకూలమైన కాలం. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. స్థలాలు కొనుగోలు.

**మకరం:** పనులు నిదానంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బంధువుల కలయిక.

**కుంభం:** ఇంటా బయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. దూరప్రాంత ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**మీనం:** కోర్టుకేసులు ఓ కొలిక్కివస్తాయి. సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. విందు, వినోదాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బెజవాడలో మళ్లీ రెచ్చిపోయిన రౌడీషీటర్లు

## - బార్‌లో తప్పతాగి బీర్ బాటిల్‌తో యువకులపై దాడి
## - కేసు రాజీ చేసేందుకు రాజకీయ నేతల ప్రయత్నాలు

**విజయవాడ,జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలో రౌడీ షీటర్ల ఆగడాలు రోజురోజుకి శృతిమించుతున్నాయి. బబ్బూరి గ్రౌండ్స్ లో కొందరు రౌడీ షీటర్లు కార్ తో హల్చల్ చేసి కొందరిని గాయపరిచిన విషయం మరువక ముందే., కేదారేశ్వరపేట మాధురి బార్ లో మరో రౌడీషీటర్ల ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. బార్ లో అందరూ చూస్తుండగానే బీర్ బాటిల్ తో ఓ వ్యక్తి తలపై దాడి చేసి గాయపరిచిన దృశ్యాలు నగరవాసులను కలవరపెడుతున్నాయి. ఈ దాడి ఘటన సీసీ ఫుటేజ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుంది.దీంతో పోలీసులు అప్రమత్తమై కేసు నయోదు చేసారు. వివరాల్లోకి వెళితే.. కేదారేశ్వరపేట ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన మోహన్ కుమార్ ఓ పార్సిల్ ఆఫీసులో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 15వ తేదీ గురువారం (సంక్రాంతి పండగ రోజు) నాడు అదే ప్రాంతంలోని ప్రభాస్ కాలేజీ వద్ద మాధురి బార్ అండ్ రెస్టారెంట్ కు పార్సిల్ తీసుకునేందుకు వెళ్లాడు. కౌంటర్ లో పార్సిల్ తీసుకుంటుండగా., అయోధ్య నగర్ కు చెందిన రాము, సాల్మన్ అనే వ్యక్తులు మోహన్ పై దాడికి దిగారు. ముందుగా సాల్మన్ తన చేతుల్లో ఉన్న బీరు బాటిల్ తో మోహన్ తలపై బలంగా కొట్టాడు. ఈ దాడి ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై సైతం రాము , సాల్మన్ దాడి చేశారు. అనంతరం మోహన్ పై ఇరువురు బీర్ సీసాలు, చేతులతో తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనలో మోహన్ తలపై తీవ్ర గాయాలయ్యాయి. చెవి నుంచి తీవ్రంగా రక్తస్రావం అయింది. ప్రస్తుతం అతను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితుడు అజిత్ సింగ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది ఎలా ఉండగా.., నిందితులు రాము, సాల్మన్ లపై గతంలో నగరంలోని అనేక పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదయ్యాయి. అందరూ చూస్తుండగానే బహిరంగంగా మీరు చేసిన దాడి ఆ ప్రాంతవాసులను తీవ్రంగా కలవరపెట్టాయి. గతంలోనూ ఇదే మాదిరిగా నిందితులిద్దరూ అనేక మందిపై దాడి చేసినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలను మీరు నిత్యం సేవిస్తుంటారని, ఆ మత్తులోనే అకారణంగా పిచ్చెక్కిన కుక్కల మాదిరిగా ఇతరులపై దాడి చేస్తుంటారని పలువురు చెబుతున్నారు. సమాజానికి పెను సవాలుగా మారిన రాము, సాల్మన్ లపై పోలీసుల చర్యలు తీసుకోకుండా ఉండిపోవడంతో మీరు ఆగడాలు రోజురోజుకి శృతిమించు తున్నాయని ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాల కోసం ఇరువురు నిందితులు దాడి దోపిడీలకు తరచూ పాల్పడుతుంటారనే వాదనలు వినిపిస్తున్నాయి.

సెంట్రల్ నియోజవర్గానికి చెందిన కొందరు రాజకీయనేతలు కేసులు రాజీ చేసేందుకు రంగంలోకి దిగారు. నిందితులు రాము, సాల్మన్ లను రాజకీయ పార్టీ నేతలు భుజాన వేసుకుంటున్నారు. ఈ కేసు నుంచి ఈ ఇద్దరు నిందితులను కాపాడేందుకు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొందరు నాయకులు పోలీసులతో సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది.



'చేయి వీడని చెలిమి" నవల రచయిత్రి సాయిజ్యోతితో మంత్రి నారా లోకేశ్

## సాంకేతికతతో వైకల్యాన్ని జయించిన రచయిత్రి..'చేయి వీడని చెలిమి' నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

### - వాయిస్ ఇన్‌పుట్ టెక్నాలజీతో పుస్తకాలు రాస్తున్న సాయిజ్యోతి

**విజయవాడ,జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** ఆత్మ విశ్వాసం ముందు శారీరక వైకల్యం తలవంచక తప్పదని నిరూపించారు రచయిత్రి చింతక్రింది సాయిజ్యోతి. అంధత్వాన్ని జయించి, రచ యిత్రిగా మారారు సాయిజ్యోతి.తన భావాలను ఆధునీక సాంకేతికత అందిబుచ్చుకుని,"చేయి వీడని చెలిమి" అనే నవలను రచించారు. ఈ నవలను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సాయిజ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిజ్యోతి అసాధారణ ప్రతిభను, ఆమె కృషిని మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. మంగళగిరి 26వ వార్డుకు చెందిన సాయిజ్యోతి, పుట్టుకతో వచ్చిన అంధత్వంతో ఏమాత్రం కుంగిపోలేదు. మొబైల్ ఫోన్‌లోని వాయిస్ ఇన్ పుట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తనలోని సృజ నాత్మకతకు అక్షర రూపం ఇస్తున్నారు.'చైత్రశ్రీ అనే కలం పేరుతో ఆమె ఇప్పటికే'కవితాంజలి అనే కవితా సంపుటిని, 'మంచుతాకిన ప్రేమ్మ, 'ఎవరు అతన్ను వంటి నవలలను పాఠకులకు అందించారు. కేవలం కల్పిత కథలే కాకుండా, సామాజిక స్పృహ కలిగించే అనేక కథలను కూడా ఆమె రచించారు. ప్రస్తుతం ఆమె నూతక్కి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు తనలోని రచనా వ్యాసం గాన్ని కొనసాగిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస 'స్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శారీరక వైకల్యాన్ని సంకల్ప బలంతో అధిగమించి, తన ప్రతిభతో యువ తరానికి సాయిజ్యోతి స్ఫూర్తిగా నిలిచారు.

# తిరుమల సమాచారం

## 25న రథసప్తమి వేడుకలు

### - ఒకేరోజు సప్తవాహనాలపై శ్రీవారి కటాక్షం
### -24నుండి 26వరకు సర్వదర్శన టైమ్‌స్లాట్ రద్దు

**తిరుమల,జనవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిథి ఈనెల 25వతేదీ ఆదివారం సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు.రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలు, భద్రత అంశాలపై టిటిడి అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. ఆ రోజు భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు. ఆదివారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. 24వతేదీ నుండి 26వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు.



## అర్ధబ్రహ్మోత్సవానికి ముందస్తు జాగ్రత్తలు

### - సమన్వయంతో మెరుగైన భద్రత

**తిరుమల,జనవరి 17ప్రభాత వార్తప్రతినిధి:** రానున్న ఆదివారం 25వతేదీ రథసప్తమి పర్వదినం సందర్భంగా అర్ధబ్రహ్మోత్సవం వేడుకలు తిరుమలలో జరగ నున్నాయి. మలయప్ప స్వామి ఏడు వాహనాలపై ఊరేగ నున్నారు. రెండు లక్షలమందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనావేసి తదనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట ఏర్పాట్లపై ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ,టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ దిశానిర్ధేశం చేశారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు ,విస్తృతస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నారు.మాఢవీధుల్లో గ్యాలరీల్లో పోలీసులు, శ్రీవారిసేవకులు, ఎస్‌పిఎఫ్, ఆక్టోపస్, విజిలెన్స్ బలగాలు భద్రతాపరంగా, సేవలకు సిద్ధం చేస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేసే పనులు జోరుగా సాగుతున్నాయి.



## ఆన్‌లైన్‌లో రేపు ఏప్రిల్ నెల ఆర్జితసేవల టిక్కెట్లు విడుదల

**తిరుమల,జనవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఏప్రిల్‌నెల కోటా ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 19వతేదీ సోమవారం (రేపు)విడుదల చేయనుంది. 19వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లుచేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21వతేదీ బుధవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 21వతేదీ నుండి 23వతేదీ మధ్యాహ్నాం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు మంజూరవుతాయి. టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 22వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 22న మధ్యాహ్నాం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదలవుతాయి. అంగప్రదక్షణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేయునున్నారు. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. కాగా శ్రీవాణి దర్శన టిక్కెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో 23వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

## శనివారం ఒక్కరోజు ఆఫ్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు ఇప్పించండి!

### - మంత్రి లోకేశ్ దృష్టికి టిటిడి సమస్య

**తిరుమల,జనవరి 17 పభాతవార్తప్రతినిధి:** తిరుపతి,తిరుమల స్థానికుల శనివారం వేకువజామున అంగప్రదక్షణ టోకెన్ల విషయం ఎట్టకేలకు తిరుపతివాసి, రాష్ట్రమంత్రి నారాలోకేశ్ వద్దకు వెళ్ళింది. నాలుగురోజులు సొంతూరు నారావారిపల్లెకు వచ్చిన సిఎం చంద్రబాబునాయుడు, తనయుడు ,మంత్రి లోకేశ్‌లను తిరుపతివాసులు కలసి అంగప్రదక్షణ సమస్యను విన్నవించారు.అనాదిగా వస్తున్న ప్రతిశనివారం వేకువజామున స్థానికులు అంగప్రదక్షణలో దర్శనం తమకు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆ ఒక్కరోజు ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేయించాలని కోరారు. గతంలో అంగప్రదక్షణకు రోజువారీగా ఆఫ్‌లైన్‌లో జారీచేసే 750 అంగప్రదక్షణ టోకెన్లను మూడేళ్ళనుండి టిటిడి ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తోంది. ఈ టోకెన్లు అందుకున్న చాలావరకు భక్తులు అంగప్రదక్షణుక రావడంలేదు. అయితే ఆన్‌లైన్‌లో విడుదల చేసినా స్థానికుల కోసం గతంలోని టిటిడి ధర్మకర్తలమండళ్ళ ఛైర్మన్లు , టిటిడి అధికారులు ఒక్కశనివారం రోజుమాత్రం 250 టోకెన్లు ఆఫ్‌లైన్‌లో తిరుపతి,తిరుమల,రేణిగుంటవాసులకు తిరుమలలోని జెఇఒ కార్యాలయంలో అందజేసేవారు. చాలావరకు స్థానిక భక్తులు భక్తితో అంగప్రదక్షణ చేసి తమ మొక్కులు చెల్లించుకున్నామనే అభిప్రాయం వ్యక్తం చేసేవారు. అయితే ఆ ఒక్కరోజు శనవారం అంగప్రదక్షణ టోకెన్లు కూడా గత ఏడాదిగా ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తుండటంతో స్థానికులు అందుకోలేని పరిస్థితితో అంతర్మథనం చెందుతున్నారు.గతంలో శనివారంరోజు 250 టోకెన్లను మాత్రం లక్కీడిప్‌కు టిటిడి అధికారులు మార్పుచేశారు. కానీ ఈ విధానంలో గందరగోళంగా మారడంతో మళ్ళీ ఆన్‌లైన్‌లోనే ఉంచేశారు. ఇప్పటికే ఈ అంశంపై స్థానికులు టిటిడి అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు.అయినా ఫలితం లేకపోతోంది.

## నిండిన క్యూలైన్లు! - వెలుపల లైన్లలోనికి భక్తులను అనుమతించని టిటిడి

### - దివ్యదర్శనం టోకెన్ భక్తులకు కష్టాలే!

**తిరుమల,జనవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా సంక్రాంతి సెలవులు...ఆపై వారాంతం కలసి రావడంతో ఏడుకొండలపై ఆలయం వెలుపల క్యూలైన్లు ఐదుకిలోమీటర్లు నిండిపోయి భక్తులను సర్వదర్శనంలో అనుమతించడంలేదు. పైగా ఆ కొండల రాయుడి దర్శనానికి 26గంటలుపైగా సమ యం పడుతుండటంతో క్యూలైన్లలోనికి సామాన్య భక్తుల అనుమతి శనివారం ఉదయం నుండి తాత్కాలికంగా నిలుపుదలచేశారు.పూర్తిగా టిటిడి అధికారయంత్రాంగం వివిఐపిలు, విఐపిలసేవలో తరిస్తుండటం అధికారభక్తి ఏ పాటిదోనని సామాన్యభక్తులు పెదవివిరుస్తున్నారు. తిరుపతి అలిపిరిలో దివ్యదర్శనం టోకెన్‌లు పొందిన భక్తులను శ్రీవారిమెట్లమార్గంలో అనుమతించక నిలుపుదలచేశారు. ఆదివారం ఉదయం దర్శనాలకు సంబంధించి శనివారం జారీచేసిన టోకెన్‌లతో అక్కడకు చేరుకున్న భక్తులను శ్రీవారిమెట్టు ప్రాంతంలోనే వేచివుండాలని భద్రత సిబ్బంది ఆపేశారు. అటు కొండెక్కలేక ఇటు క్రిందనే ఉండలేక భక్తులు అవస్థలు పడుతూన్నారు. సంక్రాంతిసెలవులు నేటితో ముగుస్తుండటంతో ఇష్టదైవమ్ దర్శనానికి భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక,తెలుగురాష్ట్రాల నుండి తరలివచ్చారు. అనూహ్యంగా పెరిగిన విపరీత రద్దీతో తిరుమల కిటకిటలాడుతోంది. శనివారం ఉదయానికి తిరుమలలో 1.30లక్షలమంది భక్తులు చేరుకున్నారు. వైకుంఠమ్ 2లోని అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూషెడ్లునిండి శిలాతోరణం వరకు లైన్లు నిలిచిపోయాయి.




# నంద్యాల ఎన్జీఓ కాలనీలో విషాదం

## ఇద్దరు పిల్లలను చంపి.. ఉరివేసుకొని తల్లి ఆత్మహత్య

**నంద్యాల జనవరి 17,ప్రభాతవార్తప్రతినిధి** నంద్యాల పట్టణంలోని యన్‌జిఒ కాలనీల్లో లలితా నగరులో శనివారం విషాదం చోటు చేసుకుంది.. తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి.. తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.. మృతులను మల్లికా 26, ఇషాన్ సాయి 2 గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లలిత నగర్ కు చెందిన ఉదయ్ కిరణ్‌కు.. ఎన్జీవో కాలనీకి చెందిన మల్లికతో ఏడేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు.. కొన్నేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. నిన్న రాత్రి కూడా గొడవ జరిగినట్లు సమాచారం. అనంతరం పిల్లలను తీసుకొని గదిలోకి వెళ్లి.. మల్లికా తలుపు వేసుకుంది. తర్వాత పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకుంది. ఉదయం గది తలుపులు బద్దలు కొట్టి చూడగా.. ముగ్గురు విగత జీవులుగా పడి ఉన్నారు. కొనఊపిరితో ఉన్న ముగ్గురినీ కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, కోలుకోలేక మృతి చెందారు. అయితేఈ ఆత్మహత్యలపై పలుఅనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకు చిన్న పిల్లలకు విషయం ఇచ్చి ఆమె తనువు చాలిస్తుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భర్త, ఆడపడుచులే తల్లి, పిల్లలను చంపారంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్‌పే లింక్ క్లిక్ చేస్తే రూ.5,000 ఖాతాలో పడతాయి అంటూ సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు

### - క్లిక్ చేయొద్దని హెచ్చరిస్తోన్న సైబర్ పోలీసులు

**విజయవాడ.జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగను టార్గెట్ చేసుకుని సైబర్ మోసగాళ్లు కొత్త ఎత్తుగడకు పాల్పడుతున్నారు. ఫోన్‌పే లింక్ క్లిక్ చేస్తే రూ.5,000 మీ ఖాతాలో పడతాయి అంటూ సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు వైరల్ అవుతున్నాయి. మొదట నమ్మలేదని, కానీ నిజంగానే డబ్బులు వచ్చాయని చెప్పేలా మెసేజ్‌లు ఉండటంతో చాలామంది మోసపోయే ప్రమాదం ఉందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. సంక్రాంతి పండుగ ఆఫర్లు వచ్చాయని ఆసక్తితో లింక్‌ను ఓపెన్ చేస్తే మొబైల్‌లోకి మాల్వేర్ చొరబడుతుంది. ఫోన్‌లో ఉన్న ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత డేటా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లి, క్షణాల్లో ఖాతాలు ఖాళీ అవుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పండగ వేళ ఎవరూ ఉచితంగా డబ్బులు పంచరని పోలీసులు గుర్తు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌లు ఎప్పటికీ లింక్‌ల ద్వారా డబ్బులు ఆఫర్ చేయవని, అలాంటి సందేశాలు వస్తే వెంటనే డిలీట్ చేయాలని సూచిస్తున్నారు. ఇక సన్నిహితులు ఫార్వార్డ్ చేసిన మెసేజ్ అయినా సరే, నిజమని భావించవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ లింక్‌లను క్లిక్ చేసి డబ్బులు కోల్పోయినవారు ఉన్నారు.

## భార్యను చంపేసి గుండెపోటుగా చిత్రీకరించిన భర్త..

### 9 నెలల తర్వాత కాల్ రికార్డులు ద్వారా పట్టుకున్న పోలీసులు

**విజయవాడ.జనవరి 17.ప్రభాతవార్తప్రతినిధి:** ఓ వ్యక్తి ప్రియురాలితో కలిసి తన భార్యను అత్యంత దారుణంగా మట్టుపెట్టిన ఓ భర్త దాష్టీకం ఫోన్ సంభాషణల రికార్డింగ్ ద్వారా తొమ్మిది నెలల తర్వాత వెలుగులోకి వచ్చింది. కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకికి చెందిన ముక్కామల ప్రసాద్ చౌదరి, రేణుకాదేవి (46) భార్యాభర్తలు. వారి కుమారుడు నగేష్ లండన్‌లో చదువు కుంటున్నాడు. కుమార్తె తేజశ్రీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రేణుకాదేవి ఇంటికి ఝాన్సీ అనే బ్యూటీషియన్ తరచూ వచ్చేది. ఈ క్రమంలో ప్రసాద్ చౌదరికి ఆమెతో పరిచయం ఏర్పడింది. అది కాస్తా అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ విషయాన్ని గుర్తించిన రేణుకాదేవి తరచూ భర్తతో గొడవపడేది. దీంతో ప్రసాద్, ఝాన్సీ ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించారు. ఈ నేపథ్యంలో గతేడాది మే 18న రాత్రి రేణుకాదేవి ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రసాద్‌చౌదరి అందరినీ నమ్మించాడు. తల్లి మృతి చెందడంతో కుమారుడు నగేష్ లండన్ నుంచి వచ్చాడు. తండ్రి ప్రవర్తనలో మార్పు గమనించిన నగేష్, అతడు నిద్రిస్తున్న సమయంలో ఫోన్ తీసుకొని పరిశీలించాడు. తన తల్లిని ఎలా చంపాలన్న విషయంపై తండ్రి ప్రసాద్ చౌదరి, అతడి ప్రియురాలు ఝాన్సీల సంభాషణలు ఫోన్లో రికార్డ్ అయినట్లు గుర్తించాడు. పండ్ల రసంలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చి, తర్వాత దిండుతో ముఖాన్ని నొక్కి ఊపిరాడకుండా చేసి చంపాలని ప్రణాళిక వేసుకున్నట్లు తేలింది. దీంతో ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితుల ఫోన్ సంభాషణల ఆధారాలను అందజేశాడు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏ తప్పు చేసినా కాస్త ఆలస్యమైనా పరిహారం తప్పదు. వాళ్లు నిందితులుగా ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది.

కానీ పిల్లల పరిస్థితి అగమ్యగోచరమవుతుంది. ఈ క్రమంలో కుటుంబాలు చిన్నా భిన్నమవుతున్నాయి. ఇటువంటి ఘటనలు మన కళ్లముందు పదుల సంఖ్యలో జరుగుతున్నా, కొందరు మూర్ఖులు వాటి నుంచి బయట పడలేకపోతున్నారు. ఇలా మర్డర్లు చేసి జీవితాన్ని చీకటి చేసుకుంటున్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచింది : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

**విజయవాడ,జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఈశ్వరయ్య ఒక ప్రకటన విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పిఆర్‌సి అమలు, మధ్యంతర భృతి, వారికి రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా పూర్తి నిరక్ష్యం ప్రదర్శిస్తోందని పేర్కొన్నారు. ఈ సంక్రాంతికైనా డిఎ, ఐఆర్, పిఆర్సిపై ప్రభుత్వం ప్రకటన చేస్తోందని ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూసి భంగాపాటుకు గురయ్యారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ఎన్నికల ముందు ఒక రకంగా, అధికారం చేపట్టిన అనంతరం మరో రకంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. 2018లో వేయాల్సిన పిఆర్‌సిని ఇప్పటికి ఏర్పాటు చేయలేదన్నారు. జిపిఎఫ్, వైద్య ఖర్చుల రీఎంజర్స్‌మెంట్, పెన్షనర్లకు రిటైర్మెంట్ బెనిప ట్స్‌కు సంబంధించి దాదాపు రూ.35 వేల కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

సిపిఎస్ విధానాన్ని పునఃసమీక్షి ంచి ఆమోదయో గ్యమైన పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నా రు. ఉద్యోగులకు మెరుగైన పిఆర్సీ అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వ్యవహిస్తున్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# సిఎం చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రగతిని తాకట్టుపెడుతున్నారు

### - వైయస్సార్సీ అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

**విజయవాడ,జనవరి 17,ప్రభాతవార్త ప్రతినిధి:** టీజీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర ఏ గిఫ్టు తీసుకుని రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌ను చంద్రబాబు పక్కనపెట్టారో ప్రజలకు స్పష్టం చేయాలని వైయస్సార్సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రగతిని తాకట్టుపెట్టడం అలవాటుగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నారని సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీనే చెప్పారన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి.. పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నా హక్కులు వదిలేసుకుని చంద్రబాబు విజయవాడకు పారిపోయి వచ్చారని తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆ కేసు నుంచి బయటపడటం కోసం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపేశారని ఆరోపించారు .చంద్రబాబుతో మాట్లాడి రాయలసీమ లిఫ్టును తానే ఆపేయించానని తెలంగాణ అసెంబ్లీలో ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. దానిపై నిజనిర్ధారణకు కూడా సిద్ధమని ప్రకటించడం చూస్తే ఎన్నో అనుమానాలకు తావిస్తోందని అనుమాన పడ్డారు. ఏపీ ప్రయోజనాలను కూడా తాకట్టు పెట్టేలా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో చేసుకున్న ఆ రహస్య ఒప్పందం ఏమిటో చంద్రబాబు ఏపీ ప్రజల ముందు బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. వైయస్ జగన్ కి మంచి పేరు రావడం ఓర్వలేకనే చంద్రబాబు రాయలసీమ లిఫ్టును పణంగా పెట్టడానికి కూడా వెనుకాడటం లేదని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అన్యాయాల గురించి ప్రశ్నించినందుకే తనపై అక్రమంగా కేసు నమోదు చేసి, వారెంట్ జారీ చేశారని పేర్కొన్నారు.

చిన్నారిని చంపేసి ఏడాదిన్నర గడిచినా ఇంతవరకు మృతదేహాన్ని గుర్తించి నిందితులను శిక్షి ంచలేని కూటమి ప్రభుత్వం.. అన్యాయాలను ప్రశ్నిస్తున్న వైయస్సార్సీపీ నాయకులపై మాత్రం అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తుందని

## అల్లంతదూరం నుండే ఏడుకొండలవాని దర్శనం - సామాన్యభక్తుల అసహనం

**తిరుమల,జనవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణరోజుల్లోనూ ఆపదమొక్కులవాడి దర్శనానికి తిరుమలకు లక్షమంది వరకు వస్తున్న భక్తులు....గంటకు 4,500మంది వరకు భక్తులకు మహాలఘులో ఆలయంలోపల జయవిజయులవరకే 70వేలమంది వరకు భక్తులను అనుమతించి అల్లంతదూరం నుండే ఇష్టదైవం దేవదేవుడిని దర్శించుకునేలా చూస్తున్నారు. వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండి వెలుపల కిలోమీటర్లు దూరం లైన్లు విస్తరిస్తుండటంతో మహాలఘు తప్పదని టిటిడి అధికారుల వాదన. తిరుమలకు వస్తున్న అశేష సంఖ్య భక్తులకు వీలైనంత వరకు సంతోషకరమైన దర్శనం చేయించాలనేది ప్రస్తుత టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలోచన. మరీ విఐపి బ్రేక్ దర్శనాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఉదయం 5.30గంటల నుండి 8.30-9గంటల వరకు నిరాటంకంగా అనుమతినిస్తున్నారు. సామాన్యభక్తులు మాత్రం గంటలుగంటలు క్యూలైన్లలో నిలబడినిలబడి కదులుతున్నా తమను జయవిజయుల వద్దే స్వామిని చూసుకుని పంపుతున్నారనే అసహనం వ్యక్తమవుతోంది. ఆనందనిలయంలో కులశేఖరపడి గడపకు ముందు నిలబడి దివ్యమంగళరూపంతో భక్తులను ఆకర్షిస్తున్న ఇష్టదైవాన్ని మరింత దగ్గరగా దర్శించుకోవాలని ప్రతి భక్తుడు ఉవ్విళ్ళూరుతుంటారు. ఉదయంవేళ 3గంటలకు ఆలయంలో జరిగే సుప్రభాతసేవ, అర్చన,తోమాల సేవలతోబాటు ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనాలు, శ్రీవాణిబ్రేక్ దర్శనాలు మాత్రమే ప్రస్తుతానికి కులశేఖరపడివరకు అనుమతినిచ్చి సంతృప్తికర దర్శనం చేయిస్తున్నారు.సిఫార్సు లేఖలపై వస్తున్న బ్రేక్ దర్శనాల భక్తులను రాములవారిమేడ వరకే అనుమతించి పంపుతున్నారు. దశాబ్ధకాలం క్రిందట రోజుకు 50వేలనుండి 60వేలమంది వరకు వచ్చే భక్తుల సంఖ్య ఇటీవల కాలంలో లక్షకు చేరింది. సరాసరి రోజువారీగా 80వేలమంది వరకు మాత్రమే ఆ శ్రీవారి దర్శనం మహాలఘులోనే చేయిస్తున్నారు. ఈసంఖ్యను మరింత పెంచి రోజుకు 90వేలమందిపైచిలుకు నుండి లక్షమంది వరకు భక్తులకు దర్శనం చేయించాలనే ఆలోచన అధికారుల్లో ఉంది. రోజువారీగా ఆర్జితసేవలు, ఆన్‌లైన్ దర్శనాలు, టైమ్‌స్లాట్‌సర్వదర్శనం ,దివ్యదర్శనం ఇలా రకరకాల దర్శనాల భక్తులు కిలోమీటర్లు క్యూలైన్లలో గంటల తరబడి పడిగాపులు కాచి వస్తున్నా కేవలం ఆలయంలోపల జయవిజయుల వరకే అనుమతించి అల్లంతదూరంనుండే ఇష్టదైవాన్ని దర్శించుకునేలా చేస్తున్నారు.

## మంత్రి 'కొండపల్లి' ఇంట పండగ సందడి



**విజయనగరం, జనవరి 17 ప్రభాత వార్త ప్రతినిధి :** మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంట పండగ సందడి నెలకొంది. కనుమ పండుగను సం దర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకే చోట కలిసి సందడి చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా గంట్యాడలోని ఇంటికి రాగా ఆయన చిన్నాన్న, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ కే.ఏ. నాయుడు కూడా వచ్చారు. వీరితో పాటు మంత్రి తాత, మాజీ ఎంపీ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ స్వర్గీయ కొండపల్లి పైడితల్లి కుటుంబ సభ్యులందరు హాజరై పండుగను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆయన సతీమణి లక్ష్మి సింధు తమ బంధువులతో కలిసి తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. వెరసి, కొండపల్లి కుటుంబం అంతా ఆహ్లాదకర వాతావరణంలో ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. ఉమ్మడి కుటుంబవ్యవస్థ అంతరించి, ఎవరికీ వారే చిన్న చిన్న కుటుంబాలుగా అవతరించి జీవిస్తున్న నేటి తరంలో కొండపల్లి పైడితల్లి నాయుడు వారసులందరు కలిసి పండుగ జరుపుకోవటం విశేషమే.

రబీ సీజన్ వ్యవసాయానికి చాలా ముఖ్యం. రైతులకు మంచి దిగుబడి రావాలంటే, సరైన సమయంలో నీటిపారుదల, మంచి మార్కెట్, ప్రభుత్వ మద్దతు తప్పనిసరి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీటి నిర్వహణ కీలకం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు, దేశవ్యాప్తంగా రబీ పంటల సాగు ఊపందుకుంది. ముఖ్యంగా వరి, గోధుమ, మొక్కజొన్న, శనగ, ఆవాలు వంటి పంటలు విస్తృతంగా సాగవుతున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లోతుపాన్లు, ప్రతికూల మార్కెట్ పరిస్థితులు సాగుపై ప్రభావం చూపాయి. కొన్ని రాష్ట్రాల్లో అయితే రైతులకు నీటిపారుదల అవసరం పెరుగుతోంది. వర్షాలు తక్కువగా ఉన్నందున రైతులకు నీటిపారుదల సౌకర్యం కీలకంకావడంతో ఇది లేకపోతే పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీనిని అధిగమించడానికి ప్రభుత్వ మద్దతు ధర వంటివి అవసరంఉంది. దేశంలోని వివిధ జిల్లాల్లో గత డిసెంబర్ తుపాన్లవల్ల సాగు ఆలస్యం అయింది. దీంతోఆయా రాష్ట్రాల్లో శనగ, వరి వంటి ప్రధాన పంటలపై సాగు తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో వర్షాలు తక్కువగా ఉన్నందున నీటిపారుదలపై ఆధారపడాల్సిన పరిస్థితి రైతులకు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే రైతులు నష్టపోయే ప్రమాదంఉంది. అంతర్జాతీయ పరిస్థితులవల్ల మార్కెట్లో శనగలు, అపరాలు, కందుల ధరలు పడిపోయాయి. మరోపక్క పొగాకు సాగుపై ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో రబీలో ఏ పైరు వేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధరలభిస్తుందా లేదా అనేదానిపై భయపడుతున్నారు. ఇదే సమయంలో పంటలకు కనీస మద్దతు ధరలు దక్కక నష్టాలు వస్తుండటంతో కౌలు రైతులు సాగుకు దూరమవుతున్నారు. మినుములు, పెసర సాగు చేసినా పంట చేతికి వచ్చిన తర్వాత కనీసమద్దతుధర వస్తుందా అన్నసందేహం వ్యక్త అవుతోంది.

# ఆశ, నిరాశల్లో రబీ అన్నదాతలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో రబీ సీజనుకు సబంధించి ఆశ, నిరాశల్లో రైతాంగం రబీ సాగులో నిమగ్నమైంది. రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా పప్పుధాన్యాల సాగులో తగ్గుదల, మరికొన్ని చోట్ల పెరుగుదల కనిపించింది. మొత్తంగా దేశ వ్యాప్తంగా సాగులో పెరుగుదల చోటు చేసుకుంది. రబీ సాగు గత ఏడాది తో పోలిస్తే పెరిగింది. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకూ పంటల విస్తీర్ణం గత సంవత్సరం కంటే 44,12,300 ఎకరాలు (17.65 లక్షల హెక్టార్లు) పెరిగి 16,10,72,500 ఎకరాలు (644.29 లక్షల హెక్టార్ల)కు చేరుకుంది. ఇది సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువ. పప్పుధాన్యాలు ముఖ్యంగా శనగలు, నూనెగింజల సాగు బాగా పెరిగింది, గోధుమ విస్తీర్ణం కూడా పెరిగింది. ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా గోధుమలు 8,35,42,500 ఎకరాలు (334.17 లక్షల హెక్టార్లు) లోను, కంది, పెసర, మినుము తదితర పప్పుధాన్యాలు 9,35,000 ఎకరాల్లో (3.74 లక్షల హెక్టార్లు) పెరిగాయి. ముఖ్యంగా శనగలు 11,65,000 (4.66 లక్షల హెక్టార్లు) పెరిగాయి. నూనెగింజలు సాగుకు వస్తే ఆవాల సాగు పెరిగింది. ఈ సాగు మొత్తం 2,33,32,500 ఎకరాలు (93.33 లక్షల హెక్టార్ల)కుచేరింది. రబీలో సాగుచేసే ఆరు పంటల మద్దతు ధరను కేంద్రం పెంచింది. వీటిలో గోధుమ, శనగ, కుసుమ, మసూర్ దాల్, ఆవాలు, బార్లీ పంటలు ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎక్కువగా పండించే శనగలు క్వింటా కనీస మద్దతు ధర రూ.5,440 నుంచి రూ.5,650 కి (రూ.210 పెంపు) పెరగనుంది. అలాగే క్వింటా కుసుమల ధర రూ.5,800 నుంచి రూ.5,940 (పెంపు రూ.140 ), గోధుమలు రూ. 2,275 నుంచి రూ.2,425 (రూ.150 పెంపు), ఆవాలు రూ. 5,650 నుంచి రూ.5,950 (రూ. 300 పెంపు), మసూర్ దాల్ రూ.6,425 నుంచి రూ.6,700 (రూ.275 పెంపు), బార్లీ రూ.1,850 నుంచి రూ.1,980లకు (రూ. 130 పెంపు) పెంచింది. అయితే పెరిగిన ఎరువుల ధరలు రైతాంగానికి భారంగా మారుతున్నాయి. ప్రస్తుత ఈ ఖరీఫ్ ప్రారంభంలో ఎరువుల ధరలు పెరగ్గా, మళ్లీ ఇప్పుడు ఇదే సీజనులో మరోసారి పెరుగుదల చోటు చేసుకుంది. ఇలారెండు సార్లు ఎరువుల ధరలు పెరగడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో ఒకసారి ఎరువుల ధరలు పెరిగితే ఈ రబీలో డీఏపీ, యూరియా మినహా అన్ని రకాల ధర రూ.50కు పెంచారు. ఇక కూలీల కొరత, పెరిగిన కూలి




వేతనం, కూలీల పనితనం తగ్గటం, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు ముఖ్యంగా భాస్వరం పొటాష్ ఎరువుల ధరలు దశాబ్ద కాలం లో మూడు రేట్లు పెరగటం మూలిగే నక్క పై తాటి పండు పడ్డ చందంగా క్రిమిసంహారక మందుల ధరలు కూడా విరివిగా పెరిగిపోవటంతో పాటు, గిట్టుబాటు ధరలు అంత అంత మాత్రమే ఉండటంవలన వ్యవసాయంపై ఆసక్తి చూపక ఇతర రంగాల వైపు రైతులు ముఖ్యంగా యువకులు మళ్లుతున్నారు. తెలంగాణ విషయానికి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా గత అక్టోబర్, నవంబరు నెలల్లో భారీగా కురిసిన వర్షాలతో రాష్ట్రంలో నీటి వనరులు గణనీయంగా పెరగడంతో ఈ యాసంగి (రబీ) సాగు గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్రం మొత్తం మీద రబీ సాధారణ విస్తీర్ణం 68.67 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటికే 35 శాతం మేర 25లక్షల ఎకరాల్లో అన్ని పంటలు సాగైయ్యాయి. ఈ సీజన్లో అత్యధికంగా వరి 11.59 లక్షల ఎకరాల్లో సాగైంది. ఆ తర్వాత స్థానంలో 6.70 లక్షల ఎకరాలతో మొక్కజొన్న ఉండగా, వేరుశనగ 1.60లక్షల ఎకరాలు, పప్పుశనగ 1.56 లక్షల ఎకరాల్లో సాగైంది. అదే విధంగా జొన్నలు 1.40 లక్షల ఎకరాలు, మినుములు 25 వేల ఎకరాల్లో సాగైంది. రాష్ట్రంలో వరి, కంది, శనగ, కొర్ర, ఉలవలు తదితర ఆహార ధాన్యాల మొత్తం సాగు 21.61 లక్షల ఎకరాలకు చేరింది. ఆయిల్ పంటలైన వేరుశనగ, సన్‌ఫ్లవర్, ఆముదం తదితర వంటివి 1.77 లక్షల ఎకరాల్లో వేశారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 2.99 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, కామారెడ్డి, సిరిసిల్లా, సిద్దిపేట్, ఖమ్మం, నాగర్‌కర్నూలు, సూర్యాపేట్, నల్లగొండ జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగయ్యాయి. మరోవైపు యూరియా కొనుగోలుకు ప్రభుత్వం యాప్ తీసుకురావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఈ రబీలో సాగు కోసం అన్ని రకాల ఎరువులు కలిపి దాదాపు 19.60 లక్షల టన్నుల వరకూ అవసరం అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా 9.8 లక్షల టన్నుల యూరియా, 1.6లక్షల డిఎపి, 7వేల టన్నుల ఎంఒపి, కాంప్లెక్స్ 7 వేల టన్నులు, ఎంఎస్‌పి 6 వేల టన్నులు చొప్పున అవసరం అవుతుంది. రాష్ట్రంలో పంటల బీమాను మాత్రం రైతులకు అమలు చేయకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల్లో రైతులు భారీగా నష్టపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రబీ సీజనుకు ఈ ఏడాది వాతావరణం అంతగా అనుకూలించలేదు. కీలక సమయంలో పలు జిల్లాలపై మొంథా తుఫాన్ విరుచుకుపడింది. ఫలితంగా సాధారణ రబీ సీజన్ సాగు జాప్యం జరిగింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో పంటల సాగు ఊపందుకుంది. రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న, శనగ, కంది వంటి పంటలు సాగు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రబీ పంట 51.75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. పంట ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే 44శాతం పెరగొచ్చని కూడా తెలిపారు. దీంతో ఎరువుల లభ్యత, సరఫరా, పంటల బీమా వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది, దీంతో పాటు రబీ సాగు విస్తీర్ణం తగ్గుదల, తెగుళ్ల సమస్యలు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం వరి, మొక్కజొన్న, శనగ, కంది పంటల సాగు జోరుగా జరుగుతోంది. వరి నారుమడి దశలో ఉండగా, జొన్న, శనగ, మినుములు విత్తడం, మొలకెత్తే దశలో ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే జొన్న, నూనెగింజలు, పొగాకు సాగు విస్తీర్ణం తగ్గింది. ఎరువుల కొరత, నల్లరేగడి నేలల్లో పప్పుసెనగకు మార్కెట్ లేకపోవడం, తెగుళ్లు, అధిక పెట్టుబడి ఖర్చులు వంటివి రబీ రైతాంగానికి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం రబీ సీజన్ కోసం దాదాపు 9.38లక్షల టన్నుల యూరియాను ప్రభుత్వంఅందుబాటులో ఉంచింది. ఇప్పటికే 5.57 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేయగా, డిసెంబర్ చివరి నాటికి మరో 57 వేల టన్నులు అందుబాటులోకి వచ్చాయి. ఆధార్ ఆథెంటికేషన్ ద్వారా ఎరువుల సరఫరా చేస్తోంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో రైతుల కోసం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రబీ సీజను రైతులకు ఏ మేరకు కలిసొస్తుందనే దానిపై భారీ ఆశలు, అంచనాలు ఉన్నాయి. ●

శ్రీకారం
మహారాష్ట్ర

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయంటారు. మహారాష్ట్ర కార్పొరేషన్ ఎన్నికల్లో శివసేన ఓడలన్నీ చాలావరకు బండ్లయ్యాయి. వాయిదాలు పడుతూ తొమ్మిదేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో శివసేన కంచుకోటల్లో కాషాయ జెండా ఎగిరింది. 15వ తేదీ సంక్రాంతి రోజున 29 కార్పొరేషన్లకు జరిగినఎన్నికల్లో 25చోట్ల బిజెపి నాయకత్వంలోని 'మహాయుతి' విజయఢంకా మోగించింది. ముఖ్యంగా శివసేనకు ప్రతిరూపంగా కనిపించే ముంబయి కార్పొరేషన్‌లో బిజెపి అత్యధిక సీట్లతో అగ్రాసనం అధిష్ఠించింది. ముంబయి, దాని చుట్టుపక్కల గల మునిసి పల్ కార్పొరేషన్‌లలో కొన్ని దశాబ్దాలుగా శివసేన బలంగా వేళ్లూనుకొంది. ఆ పార్టీ అధినేత బాల్ థాకరే ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో ముఖ్యంగా పురపాలికల్లో శివసేన రాజ్యమేలింది. అప్పట్లో ఆ పార్టీతో పొత్తు కుదుర్చుకొని నాలుగు సీట్లు సంపాదించడానికి అటు కాంగ్రెస్, ఇటు బిజెపి తహతహలాడేవి. అయితే మూడున్నరసంవత్సరాల క్రితం శివసేనలో చీలిక వచ్చిన తర్వాత ఆ పార్టీ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేన ముక్కలైన తర్వాత తొలిసారి జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికలు కావడంతో రాజకీయ పరిశీలకులందరి దృష్టి ప్రధానంగా ముంబయిపైనే పడింది. అంతేగాక ఎన్నికల ముందు థాకరే సోదరులిద్దరూ చేతులు కలిపి ఉమ్మడిగా బరిలోకి దిగడంతో బిజెపికి గట్టి ఎదురుదెబ్బ తగలవచ్చనే అంతాభావించారు. దాదాపు 20సంవత్సరాల తరువాత రాజ్ థాకరే మనసు మారి ఉద్ధవ్ థాకరేతో పొత్తు కుదుర్చుకోవడం అందరినీఆశ్చర్యపరచిందికూడా. అంతేగాక మహాయుతిలోని అజిత్ పవార్, షిండేలు పక్కచూపులు చూస్తున్నారని కూడా ప్రచారమైంది. అజిత్ తిరిగి శరద్‌పవార్ నాయకత్వం లోని ఎన్సీపీతో కలుస్తారనీ, షిండే మళ్లీ ఉద్ధవ్ శివసేనతో చేతులు కలపనున్నారనీప్రచారమైంది. వాటిలో ఏది నిజమోకాదో తెలియదు కానీ కార్పొరేషన్ ఫలితాలు మాత్రం మహాయుతికి ఇప్పట్లో తిరుగులేదనే వాస్తవాన్ని చాటిచెప్పాయి. పుణే, పింప్రి చించ్వాడ్ కార్పొరేషన్లకు ఎన్సీపీవర్గాలు ఉమ్మడిగా పోటీ చేశాయి. ఆ రెండు కార్పొరేషన్లలో గెలుపును డిప్యూటీ సిఎం అజిత్ పవార్ చాలా ప్రతిష్టాత్మకంగా భావించారు. అక్కడ ఎన్సీపీఅభ్య ర్థులు బిజెపితో తలపడ్డారు. అజిత్‌కు ఆ రెండు కార్పొరేషన్లలో బలం ఎక్కువే ఉన్నా, తాజా ఎన్నికల్లో బిజెపిఅభ్యర్థులే గెలుపొందడంగమనించవలసిన అంశం. దేశఆర్థిక రాజధాని, ప్రపంచంలోనే అత్యంత సంపన్న కార్పొరేషన్‌గా పేరున్నముంబయిలో శివసేన ఆధిక్యానికి గండికొడుతూ బిజెపి అతి పెద్ద పార్టీగా అవతరించడం ఈ ఎన్నికల్లోఒక విశేషమైతే నాలుగు చోట్ల మినహా మిగిలిన అన్ని కార్పొరేషన్‌లలో మహాయుతి విజయం సాధించడం మరో విశేషం.

# 'కాషాయ' సంక్రాంతి

**ఎ.వి.వి ప్రసాద్**



ఫడ్నవిస్

ఉద్ధవ్‌తో చేతులు కలిపి ఉమ్మడిగా పోటీ చేసిన రాజ్‌థాకరే నాయకత్వంలోని ఎమ్మెన్నెస్‌కి సీట్లు నామమాత్రంగానే లభించడం కూడా గమనించవలసిన విషయం. కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు ఆశాజనకంగా ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఉమ్మడిగా పోటీ చేయాలని థాకరే సోదరులు తొలుతభావించారు. అయితే ఉద్ధవ్‌తో కలిసినా ప్రయోజనం లేకపోయిందని రాజ్ ఇప్పుడు పునరాలోచిస్తున్నారు. ముంబయి కార్పొరేషన్‌లోని 227సీట్లలో మహాయుతికి అధిక స్థానాలు లభించగా, ఉద్ధవ్, రాజ్ కూటమికి 75సీట్లు మాత్రమే వచ్చాయి. వాటిలో ఉద్ధవ్‌సేనకు 65సీట్లు రాగా, ఎమ్మెన్నెస్‌కి వచ్చినవి ఆరు మాత్రమే. శరద్‌పవార్ ఎన్సీపీకి 2017 ఎన్నికల కంటేకూడా తక్కువగా 24సీట్లు మాత్రమే లభించాయి. దీన్నిబట్టి చూస్తే ముంబయి కార్పొరేషన్‌లో శివసేన ఆధిక్యం తొలగడంతో పాటుబిజెపి పూర్తిస్థాయిలో బలపడిందనే విషయం స్పష్టమవుతుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి మరింతగా దిగజారింది. ఒక్క లాతూరు కార్పొరేషన్‌లో మాత్రమే ఆధిక్యత సాధించ గలిగింది. ఈఎన్నికల్లో ప్రత్యేకంగా గమనించవలసిన అంశాలు మరో రెండు కూడా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 114సీట్లలో ఎంఐఎం విజయం సాధించడం అపూర్వమే. గతంలో 48సీట్లుమాత్రమే ఉండగా, ఇప్పుడు రెట్టింపుపైగా బలంతో114 సీట్లు లభించాయి. ఛత్రపతి శంభాజీనగర్‌లోఅధికంగా 33సీట్లు, మాలెగావ్‌లో 21, అమ్రావతిలో 15, ముంబయిలో 6, థాణేలో 5సీట్లలో ఎంఐఎం అభ్యర్థులు విజయం సాధించారు. కర్ణాటకకు చెందిన ప్రముఖ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గౌరీ లంకేష్ హత్యకేసులో నిందితుడైన శ్రీకాంత్‌పంగార్కర్ జాల్నా కార్పొరేషన్‌లోని 13 వార్డు నుంచి గెలుపొందడం మరోవిశేషం. మరాఠీ, ముస్లింఓటు బ్యాంకు మద్దతుతో ముంబయిలో తిరిగి పట్టుసాధించగలమని ఆశించినథాకరే సోదరులకు నిరాశ ఎదురుకావడం ఒకటైతే, వారిద్దరి మైత్రికిగండిపడే సూచనలు అప్పుడే కనిపించడం ఈఎన్నికల్లో గమనించవసిన మరో అంశం. ముంబయిసహా అధికశాతం కార్పొరేషన్లలో కాషాయ జెండా ఎగరడం ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను మరింత బలోపేతం చేయగలదనే భావించాలి. షిండే సేనకంటే థాకరే సేనకు మెరుగైన ఫలితాలు లభించడంతో 'సేనల ఏకీకరణ' అంశం కొనసాగవచ్చు. 'బాల్ థాకరే బ్రాండ్'కు చాలాకాలం అధిక ఆదరణే ఉన్నా అదిక్రమంగా బలహీనపడుతోందని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి ఘన విజయం సాధించినా, పురపాలికల్లో మాత్రం ఇంత కాలం బలహీనంగానే ఉంది. అయితే తాజా ఎన్ని కల్లో వాటిలో కూడా ఘనవిజయం సాధించడంతో హిందూత్వకార్డుకు, బిజెపికి ఇప్పట్లో తిరుగులేదనే విషయం స్పష్టమవుతోంది. కేంద్రం, రాష్ట్రంలోనేగాక స్థానిక సంస్థల్లో కూడా 'డబులింజన్' పాలనవల్ల అభివృద్ధికార్యక్రమాలు చురుకుగా సాగుతాయనడంలో సందేహం లేదు. శివసేన ఓడిపోయినా, గణనీయమైన సీట్లను పొందడంతో బిజెపికి సవాలు విసురుతూనే ఉంటుంది. వాటిని ఎదుర్కొనేందుకు ఫడ్నవీస్ అనుసరించే వ్యూహాలపైనే మహారాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ●

శ్రీకారం
మాల్దోవా

అగ్రరాజ్యాల్లో పెరిగిపోతున్న సామ్రాజ్య విస్తరణ కాంక్ష, యుద్ధ క్రీడలకు ఇప్పుడు ప్రపంచంలోని చిన్న దేశాలకు అభద్రతాభావం ఏర్పడింది. ఇటీవలికాలంలో చైనా తైవాన్ పైనా, అమెరికా జరిపిన వెనిజులా సైనికచర్యలకు తోడు తాజాగా మెక్సికో, క్యూబా, గ్రీన్‌ల్యాండ్ వంటి దేశాలను హెచ్చరించడంవంటి సంఘటనలు ప్రపంచంలోని చిన్నదేశాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. అందువల్లనే ఇప్పుడు నాటో కూటమిలో అయినా చేరాలి లేదంటే అతి పెద్ద కూటమి అయిన ఐరోపా కూటమిలో అయినాచేరడం అనివార్యంగా భావిస్తున్నాయి. ఇప్పుడు ఇదే క్రమంలో రష్యా నుంచి ఎదురయ్యే ముప్పును అధిగమించేందేదుకు తూర్పుఐరోపాలోనిచిన్న దేశం మాల్దోవా తనకు పొరుగుననే ఉన్న రొమేనియాలో విలీనంకావాలని ప్రయత్నిస్తోంది. రష్యా నుంచి ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేందుకు ఇదొక్కటే తక్షణ ప్రత్యామ్నాయంగా ఆదేశం భావిస్తోంది. ఆదేశ అధ్యక్షురాలు మైయాసంధు మాట్లాడుతూ ఒకవేళ రిఫరెండమ్ జరిగితే విలీనానికే తాను ఓటువేస్తానని ప్రకటించడాన్ని చూస్తే మాల్దోవా తక్షణమే రొమేనియాలో భాగం కావాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే తాజాగా గడచిన మూడేళ్లనుంచి తనకు పొరుగుననే ఉన్న ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దండయాత్రను ప్రపంచం మొత్తం చూస్తోంది. ఈ తరుణంలో ఉక్రెయిన్, రొమేనియాకు మధ్యలో ఉన్న ఈ చిన్నదేశం తమ సార్వభౌమత్వం కాపాడుకునేందుకు ఏదో ఒక యూరోప్ దేశంలో విలీనానికి ప్రాధాన్యతనిస్తోంది. మాల్దోవాలోని ట్రాన్స్‌నిష్టియా రష్యాకు అత్యంత కీలకమైన ప్రాంతం. మాల్దోవా ఉక్రెయిన్ సరిహద్దు, డ్నీస్టర్ నది మధ్యలో ఉంటుంది. దేశ జనాభా మొత్తం 25 లక్షలు అయితే ఈ ప్రాంతంలోనే నాలుగున్నర లక్షల మంది ఉన్నారు. అంతర్జాతీయంగా ఈప్రాంతం మాల్దోవా పరిధిలోనిదని భావిస్తున్నా1992 నుంచి రష్యా తిరుగుబాటుదారుల నియంత్రణలో ఉంది. ఇక్కడే 1500కిపైగా రష్యా సైనికులు ఉన్న స్థావరాలున్నాయి. రష్యా దక్షిణ ఉక్రెయిన్‌ను ఆక్రమించి ట్రాన్స్‌నిస్ట్రియాకు చేరేందుకు ఇక్కడ సైనిక స్థావరాలు మరింతగా ఏర్పాటు చేస్తున్నదన్న భావన మాల్దోవా పాలకుల్లో నెలకొని ఉంది. ఈ చిన్న దేశంపై రష్యా నజర్ పడేందుకు కారణం కూడా లేకపోలేదు. ఇటు నాటోలోకానీ, ఐరోపా కూటమిలోకాని మాల్దోవాకు సభ్యత్వంలేదు. 2030నాటికి సభ్యత్వం తీసుకోవాలని, అందుకోసం తక్షణ కర్తవ్యంగా రొమేనియాలో చేరడం ఒక్కటే మార్గమని చెపుతున్నా దేశ ప్రజలు అత్యధికంగా రొమేనియాలో చేరేందుకు సుముఖంగా లేకపోవడం ప్రస్తుత అధ్యక్షురాలికి సవాల్‌గానే పరిణమిస్తోంది. 1991లో రష్యా విచ్ఛిన్నం తర్వాత మాల్దోవా స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. నిజానికి 1918 నుంచి 1940 వరకూ రొమేనియాలోనే ఉంది. అందువల్ల ఇప్పటికిప్పుడు రొమేనియా ప్రజలనుంచి కూడా పెద్దగా ఇబ్బందులు ఉండక పోవచ్చుని ప్రెసిడెంట్ సంధు, ప్రధాని మన్‌టీనూలు భావిస్తున్నారు. మాల్దోవాకు ముందుపేరు బెస్సారబియాగా కొనసాగింది. పొరుగుదేశంలో కలిసి ఉన్నపుడు ఇదే పేరుతో ఉంది. ఇప్పుడు విలీనానికి రష్యా సానుకూలవాదులు వ్యతిరేకిస్తున్నారు. ఇది దేశద్రోహచర్యగానే పరిగణిస్తామంటూ అధ్యక్షురాలు సంధుపై నిప్పులు చెరుగుతున్నారు. అయితే ఈవిలీన ప్రక్రియ రష్యా ముప్పు పెరుగుతున్నదన్న ఆందోళన పెరుగుతున్నకొద్దీ ముందుకువస్తోంది. ఈయూలో సభ్యత్వం పొందేందుకు ఇదే సులువైన మార్గంగా మాల్దోవా పాలకుల పేర్కొంటున్నారు. రష్యాసైనికులు దేశ సరిహద్దుల్లోకి ప్రవేశిస్తే అనివార్యంగా విలీనం జరుపుకోవాల్సి వస్తుంది. అప్పుడు విధిగా 70 శాతం మాల్దోవియన్లు విలీనానికే మొగ్గుచూపించాల్సి ఉంటుంది. అయితే రొమేనియా ఇందుకు సంసిద్ధంగా ఉందా అన్నది ముందు తేల్చుకోవాలి. నిజానికి ఎక్కువ జనాభా రొమేనియా భాషలే మాట్లాడతారు. అదే మాల్దోవా మాట్లాడుకునే భాషగా కూడా నిర్ధారించింది. మాల్దోవా అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ సోషలిస్టుపార్టీ నేత ఇగోర్ డోడాన్ ఇది విద్రోహ చర్యమాత్రమేనని సంధు తక్షణమే రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేస్తూ వివాదాన్ని లేవదీసారు. సంధుపై విద్రోహ చర్యలపై విచారణ చేయాలని కూడా డిమాండ్ చేసారు. భౌగోళికంగా చూస్తే ప్రపంచబ్యాంకు లెక్కల ప్రకారం మాల్దోవా ఎగువ మధ్యతరగతి దేశంగా ఉంది. రొమేనియా ఉక్రెయిన్‌లతోనే ఎక్కువ సరిహద్దు ఉంది. పశ్చిమాన రొమేనియాఉంటే ఉక్రెయిన్ ఉత్తరం, తూర్పు, దక్షిణ దిశలవైపు కూడా సరిహద్దులు కలిగిఉంది. ఇప్పుడు ఉక్రెయిన్‌పై రష్యా నిర్వహిస్తున్న దాడికారణంగా ఆ ముప్పు తమకు సైతం ఎదురవుతుందన్న ఆందోళనతో మాల్దోవా ఉంది. వ్యవసాయం, విదేశీజమలే జిడిపికి ఎక్కువవాటాతో ఉంటాయి. యూరోప్‌తో చూస్తే పేద దేశంగానే భావిస్తారు. అవినీతి, అధికార దాహం, బయటిశక్తులనుంచి ముప్పు వంటి వాటితో సతమతం అవుతోంది. వ్యవసాయ ఉత్పత్తులు, వైన్, ఐటిరంగ పరిశ్రమలు మరింత వృద్ధి చెందే దిశగా ప్రస్తుత సంధుప్రభుత్వం కార్యాచరణ అమలుచేస్తోంది. జిడిపి 46.7బిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం కూడా 19591డాలర్లుగా ఉంది. ప్రపంచస్థాయిలో93వ స్థానంలోఉంది. జిడిపి పరంగా 136వ దేశంగా ఉన్నమాల్దోవాకు ఇప్పుడు సరిహద్దునుంచి వస్తున్నముప్పే ఎక్కువని భావిస్తోంది. అటు అమెరికా, చైనాలు అనుసరిస్తున్న వైఖరికితోడు రష్యా ఇటీ వలికాలంలో పెంచిన సైనికచర్యలతో ఎప్పటికైనా తమ దేశానికి రష్యానుంచే ముప్పు ఎక్కువని భావిస్తున్న ఈ చిన్న దేశంపక్కనే ఉన్న రొమేని యాతో విలీనమైతే యూరోపియన్‌యూనియన్ సభ్యత్వం ఉన్నదేశంగా పరిగణనలోనికి వస్తుందన్న భావనతోఉంది. దీనితో నాటో కూటమి నుంచి కూడా తమకు భద్రత, సైనిక సాయం ఆయుధసాయం పరంగాకూడా నిరంతరంగా సహకారం ఉంటుందన్న భావనతో ఉన్న ఈ మాల్దోవా అధ్యక్షురాలు సంధు వ్యూహం ఎంతమేర ఫలిస్తుందన్నదే ఇపుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ●

# విలీనం వైపే మాల్డోవా వ్యూహం!

**గన్ని మోహన్**



మైయ్యా సంధు

# అమెరికా సామ్రాజ్యవాదానికి అంతమెప్పుడు?

**డాక్టర్. పి.ఎస్. చారి**

రెండువేల ఇరవైఆరు సంవత్సరం ప్రారంభంలో అమెరికా వెనిజులాపై సైనిక చర్యతో అధ్యక్షుడు నికోలస్ మదురో, అతని భార్యను బంధించి, నార్కో టెర్రరిజం ఆరోపణలతోసహా అభియోగాలను ఎదుర్కొనేందుకు వారిని న్యూయార్క్‌కు తరలించారు. ఈదాడి ప్రపంచ వ్యాప్తంగా వివాదానికి దారితీసింది. అనేక దేశాలు, అంతర్జాతీయసంస్థలు దీనిని వెనిజులా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం అనిఖండించాయి. బ్రెజిల్, మెక్సికో, కొలంబియా వంటి లాటిన్ అమెరికన్ పొరుగు దేశాలు, క్యూబా, రష్యా, చైనా వంటి వెనిజులా మిత్ర దేశాలు దీనిని ఆధిపత్య దురాక్రమణగా ఖండించాయి. కొంతమంది యూరోపియన్ దేశాల నాయకులు ఐక్య రాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ నిబంధనలను గౌరవించాల్సిన అవసరాన్ని, సైనిక జోక్యం కంటే శాంతియుత పరిష్కారాలను నొక్కిచెప్పారు. వెనిజులాపై అమెరికా దాడిపై ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తంచేసి భద్రతామండలి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అక్కడ అనేక సభ్య దేశాలు బలప్రయోగాన్ని విమర్శించాయి. అయితే అర్జెంటీనాకు చెందిన జేవియర్మిలేతోసహా కొన్ని ప్రభుత్వాలు మదురో పతనాన్ని స్వాగతించాయి. ప్రారంభం నుండి అమెరికా తరచుగా వివిధ చర్చనీయాంశమైన, సంక్లిష్టమైన కారణాల వల్ల ఇతరదేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటూ వస్తున్నది. ప్రచ్ఛన్న యుద్ధసమయంలో కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించడం, అంతర్జాతీయంగా సంఘర్షణలు పాలన మార్పుకార్యకలాపాలకు దారితీసింది. సెప్టెంబర్ 11దాడుల తరువాత ఉగ్రవాదంపై యుద్ధం, దాని మిత్రదేశాల జాతీయ భద్రతా ప్రయోజనాల పేరుతో, ఆర్థికస్థిరత్వం, పెట్టుబడులను కాపాడటం, స్వేచ్ఛావాణిజ్యం, ప్రపంచ రిజర్వ్‌కరెన్సీ గాడాలర్‌స్థానం కొనసాగించడం, సహజవనరులకు, ముఖ్యంగా చమురుకోసం అనేక జోక్యాలున్నాయి. ఈచర్యలు తరచుగా అంతర్జాతీయ చట్టం, దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించాయని విమర్శించబడుతున్నాయి. వ్యూహాత్మక, రాజకీయ, ఆర్థిక, భద్రతా కారణాల దృష్ట్యా అమెరికా అనేక దేశాలపై సైనిక శక్తినిఉపయోగించింది. మెక్సికన్ అమెరికన్ యుద్ధంలో అమెరికా మెక్సికోపై (1846–1848) ప్రధానంగా ప్రాదేశిక విస్తరణ కోసం దాడిచేసింది. తరువాత స్పానిష వలస పాలనను ఓడించడానికి జోక్యం చేసుకుంది. క్యూబా, ఫిలిప్పీన్స్‌తో (1898–1902) పోరాడింది. కమ్యూనిజం వ్యాప్తిని ఆపడానికి కొరియాలో 1950–1953 మధ్య అమెరికా జోక్యం చేసుకుంది. వియత్నాంలో (1965–1973)కమ్యూనిజాన్ని అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్న అమెరికా, 1973లోయుద్ధం ముగిసినప్పటికీ 1975లో ఉపసంహరించుకుంది. కమ్యూనిస్ట్ సరఫరా మార్గాలను దెబ్బతీసేందుకు కంబోడియా, లావోస్‌లలో (1960ల చివరలో–1973) సైనిక చర్యలు చేపట్టింది. గ్రెనడా దండయాత్రతో (1983) మార్క్సిస్టుప్రభుత్వాన్ని తొలగించడానికి ప్రయత్నించింది. పనామాలో (1989–1990) మాన్యుయెల్నోరిగాను పడగొట్టడానికి, పనామా కాలువను రక్షించడానికి అమెరికా జోక్యంచేసుకుంది. ఇరాక్‌పైగల్ఫ్ యుద్ధం (1991), అంతర్యుద్ధం మధ్య మానవతా కారణాల వల్ల సోమాలియాలో (1992–1994)బోస్నియా (1995) కొసావో/సెర్బియా (1999)లోనాటోనేతృత్వంలోని అమెరికా చర్య, 9/11 దాడుల తర్వాత, అల్‌ఖైదాను కూల్చివేసి తాలిబాన్‌ను తొలగించడానికి అఫ్ఘనిస్థాన్‌పై దాడి చేసింది (2001–2021), పాలన మార్పు ఆరోపణలపై ఇరాక్ యుద్ధం (2003–2011), లిబియాలో (2011) సైనికచర్య ఇటీవల, సిరియాలో ఇస్లామిక్ స్టేట్స్ ఆఫ్ఇరాక్ అండ్సిరియాను ఎదుర్కోవడంపై అమెరికా సైనికప్రమేయం 2014 నుండికొనసాగుతోంది కార్యకలాపాలలో సైనిక, నిఘా మద్దతుకోసం అమెరికా సాధారణంగా ఉత్తర అట్లాంటిక్ ఒప్పందసంస్థ సభ్యులు యునైటెడ్ కింగ్డమ్, ఫ్రాన్స్, జర్మనీ, కెనడాతోపాటు, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా ఇజ్రాయెల్ లాంటిమిత్రదేశాలపై ఆధారపడుతుంది. అయితే పాకిస్థాన్ లాంటి దేశాలు ఉగ్రవాద నిరోధక చర్యలో కీలకమైన భాగస్వాములుగా పని



చేశాయి. ముఖ్యంగా చమురు, గ్యాస్, ఖనిజాలు లేదా వ్యూహాత్మక వాణిజ్యమార్గాలు సమృద్ధిగా ఉన్నప్రాంతాలలో, ప్రజాస్వామ్యం, భద్రత లేదా మానవహక్కులను ప్రోత్సహించడానికి చర్యలు సమర్థించబడినప్పటికీ, అమెరికాసైనిక జోక్యాలు తరచుగా స్వార్థపూరిత ప్రయోజనాలను కలిగి ఉంటాయని విమర్శకులు వాదిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో, ముఖ్యంగా లిబియాలో జోక్యాలను తరచుగా ఉదాహరణలుగా ఉదహరిస్తారు. ఇంధనవనరుల వ్యూహాత్మక ప్రభావం అమెరికా ఆర్థిక కార్పొరేట్ ప్రయోజనాలకు దగ్గరగా ఉంటాయి. ఈ అవగాహన 'భద్రతాముప్పులు' కొన్నిసార్లు వనరుల నియంత్రణ భౌగోళిక రాజకీయ ఆధిపత్యానికి పనిచేస్తాయనే ప్రపంచ సందేహాన్ని రేకెత్తించింది. ప్రపంచదేశాలపై ఆధారపడిన అమెరికా ఆర్థికవ్యవస్థ మానవవనరులు, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్యం, పెట్టుబడి, వ్యూహాత్మక విదేశీ సంబంధాల ద్వారా తన ఆర్థికవ్యవస్థను నిలబెట్టుకోవడానికి బలోపేతం చేయడానికి అమెరికా అనేకదేశాలపై ఆధారపడి ఉంటుంది. సాఫ్ట్‌వేర్, ఆరోగ్యసంరక్షణ, ఇంజనీరింగ్, పరిశోధన ఆవిష్కరణలలో భారతీయ నిపుణులు కీలకపాత్ర పోషిస్తున్నారు. తయారీ, సరఫరాగొలుసులు, అరుదైన వినియోగ వస్తువుల ద్వారా అమెరికా ఆర్థిక పనితీరుకు చైనా చాలా కాలంగా కేంద్రంగా ఉంది. వ్యవసాయం, శ్రమ, సరిహద్దు సరఫరా గొలుసుల ద్వారాఅమెరికా ఆర్థికవ్యవస్థకు మెక్సికో మద్దతు ఇస్తుంది. కెనడా ఇంధనభద్రత (చమురు, గ్యాస్, విద్యుత్), ఖనిజాలు, వాణిజ్యానికి చాలా ముఖ్యమైనది. జర్మనీ, యూరోపియన్యూనియన్ అధునాతనసాంకేతికత, యంత్రాలు, ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆర్థిక పెట్టుబడులను అందిస్తాయి. జపాన్, దక్షిణకొరియా సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, రోబోటిక్స్ పారిశ్రామిక సాంకేతికతకు కీలకమైనవి. సౌదీఅరేబియా, యుఎఇ, ఖతార్ ఇంటి మధ్యప్రాచ్య దేశాలు చమురు, గ్యాస్, ఇంధన మార్కెట్ నియంత్రణ ద్వారా అమెరికా ఆర్థికస్థిరత్వానికి మద్దతు ఇస్తాయి. ఇజ్రాయెల్ సాంకేతికత, సైబర్ భద్రత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలకు గణనీయంగా దోహదపడుతుంది. ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ దేశాలు కీలకమైన ఖనిజాలు, ముడిపదార్థాలు, వ్యవసాయ ఉత్పత్తులు, అభివృద్ధిచెందుతున్న మార్కెట్లను సరఫరా చేస్తాయి. మొత్తంమీద, అమెరికా ఆర్థికవ్యవస్థ ప్రపంచ వ్యవస్థతో లోతుగా పరస్పరం ఆధారపడిఉంది. ఆర్థికంగా, సాంకేతికంగా బలంగా ఉన్నప్పటికీ, అమెరికా అనేక సామాజిక దురాచారాలను, శాంతి, సామాజిక సామరస్యం, స్థిరత్వాన్ని సవాలు చేసే నిర్మాణాత్మక సమస్యలను ఎదుర్కొంటోంది. తుపాకీ హింస అత్యంత తీవ్రమైన సమస్యలలో ఒకటి, జాతివివక్ష, వ్యవస్థాగత జాత్యహంకారం, ముఖ్యంగా ఆఫ్రికన్ అమెరికన్లు వలసదారులపై, సామాజిక అశాంతి నిరసనలకు కారణమవుతూనే ఉన్నాయి. ఆర్థిక అసమానత నిరాశ్రయత, ఆహారఅభద్రత మాదకద్రవ్య దుర్వినియోగం ఓపియాయిడ్ సంక్షోభం, రాజకీయద్వేషపూరిత ప్రసంగం అమెరికా సమాజాన్ని తీవ్రంగా విభజించాయి. అయినప్పటికి, తన లక్ష్యం ఆర్థికసామ్రాజ్యవాదంతో ప్రపంచ దేశాల సార్వభౌమత్వంలో జోక్యం చేసుకుంటున్నది. ఐక్యరాజ్య సమితి, దాని భద్రతామండలి, స్వీయరక్షణ కోసం లేదా భద్రతామండలి అనుమతితో మాత్రమే బలప్రయోగాన్ని అనుమతించే ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఖచ్చితంగా అమలు చేయడం ద్వారా అమెరికా దాడులు, జోక్యాన్ని నియంత్రించాలి. ఏదైనా అమెరికా సైనిక చర్యను భద్రతామండలిలో తప్పనిసరి చర్చ, పారదర్శకత, ఓటింగ్‌కు గురిచేయాలి. బెదిరింపులను ధృవీకరించడానికి అతిశయోక్తి. ముఖ్యంగా శాశ్వత సభ్యుల వీటో నియంత్రణను ప్రోత్సహించాలి. భద్రతా మండలి స్తంభించిపోయినప్పుడు జనరల్ అసెంబ్లీ 'శాంతి కోసం ఐక్యత' తీర్మానాన్ని ఆమోదించాలి. అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ న్యాయస్థానం ఉల్లంఘనలను పరిశీలించడానికి చట్టపరమైన ఒత్తిడిని ఉపయోగించాలి. ఐక్యరాజ్య సమితి అధికారం ఇచ్చిన ఆర్థిక దౌత్యపరమైన ఆంక్షలు ఏకపక్ష చర్యకు వ్యతిరేకంగా నిరోధకాలుగా పని చేస్తాయి. ఘర్షణలు పెరగడానికి ముందే సంఘర్షణలను పరిష్కరించడానికి ఐక్యరాజ్య సమితి ప్రాంతీయ సంస్థలకు అధికారం ఇవ్వాలి. అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న శక్తివంత మైన దేశాలు ఇతర ప్రాంతీయ వాణిజ్య కూటములు కూడా అమెరికా జోక్యాన్ని అన్ని అంచులలో నియంత్రించడానికి ప్రయత్నించాలి. ●

# గణతంత్ర వేడుకలకు ఉగ్ర ముప్పు!

## భారీ బందోబస్తు ఏర్పాట్లకు కేంద్రం ప్రణాళిక



**న్యూఢిల్లీ, జనవరి 17:** గణతంత్ర దినోత్సవ వేడుకలను లక్ష్యంగా చేసుకుని ఈ సంవత్సరం ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద సంస్థలు దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. హర్యానా, ఢిల్లీ ఎన్‌సీఆర్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఉగ్ర నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం ఉందని, అక్కడ హైఅలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీయడానికి ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేస్తోన్న ఉగ్రవాద సంస్థలు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నాయని పేర్కొన్నాయి. గత ఏడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీతో పాటు ప్రముఖ నగరాలు, ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు. పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్లు విదేశాల నుంచి పని చేస్తున్న ఖలిస్తానీ, రాడికల్ హ్యాండ్లర్లకు సహకరిస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. ఉగ్రవాద సంస్థలు తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకుంటున్నాయని పేర్కొన్నాయి. దేశరాజధాని ఢిల్లీలో ఈనెల 26వ తేదీన జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌ను వందేమాతరం థీమ్‌తో నిర్వహించనున్నారు. కర్తవ్యపథ్‌పై 150 ఏళ్ల వందేమాతరం శోభ వెల్లువిరియనున్నది. జాతీయ గీతానికి చెందిన ఆర్ట్‌వర్క్‌ను ప్రజెంట్ చేయనున్నారు.

ఆ గేయాన్ని రాసిన బంకిమ్ చంద్ర ఛటర్జీకి ప్రత్యేక నివాళి అర్పించనున్నారు. గతంలో రిపబ్లిక్ డే పరేడ్‌ను వీక్షించే వారి కోసం వివిధ రకాల కేటగిరీలతో పాస్‌లను ఇచ్చేశారు. ఈ సారి కొత్త విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ప్రేక్షకుల గ్యాలరీకి భారతీయ నదులతో పేర్లు పెట్టారు. బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్, చీనాబ్, గండక్, గంగా, ఘాగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోశి, కృష్ణ, మహానంది, నర్మద, పెన్నార్, పెరియార్, రావి, సోని, సట్లజ్, తీస్తా, వైగయి, యమునా నదుల పేర్లతో ప్రేక్షకుల గ్యాలరీలను పిలవనున్నారు. ఇక జనవరి 29వ తేదీన జరగనున్న బీటింగ్ రిట్రీట్ సెర్మనీ కోసం భారతీయ సంగీత వాద్యాల పేర్లతో ఎన్‌క్లోజర్లను పిలువనున్నారు. బాన్సురి, డమరుకం, ఎక్తారా, ఇస్రాజ్, మృదంగం, నగడా, పక్వాజ్, సంతూర్, సారంగి, సరింద, సరోద్, షెహనాయి, సితార్, సుర్బహార్, తబల, వీణా పేర్లతో పిలవనున్నారు. యురోపియన్ కమీషన్ ప్రెసిడెంట్ ఉరుసుల వాన్ డేర్ లియాన్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలు పరేడ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరు కానున్నారు. ఈసారి పరేడ్‌లో 30 శకటాలను ప్రదర్శిస్తున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 17 శకటాలు ప్రదర్శనకు ఉంటాయని, 13 శకటాలు మాత్రం మంత్రిత్వ శాఖలు, సర్వీస్‌లకు ఉండనున్నట్లు రక్షణశాఖ కార్యదర్శి ఆర్కే సింగ్ తెలిపారు.



సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే డ్రెస్‌కోడ్..

## నల్లకోటుకు మోడీ సర్కార్ చెల్లు చీటీ!

**న్యూఢిల్లీ, జనవరి 17:** దేశంలో విస్తృత స్థాయిలో అమలవుతున్న నల్లకోటు వ్యవస్థను చెరిపివేయాలని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. బ్రిటిష్, వలసవాదం నాటి గుర్తులను చెరిపేసేందుకు దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూనే ఉంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ శాఖల్లో ఈ నల్ల కోటు ధరించడాన్ని రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతోంది. వాటి స్థానంలో భారత సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సరికొత్త యూనిఫామ్‌ను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. వలసవాద ఆనవాళ్లను తుడిచిపెట్టే లక్ష్యంతో భారత ప్రభుత్వం రైల్వే అధికారుల బ్లాక్ ప్రిన్స్ కోట్ల (నలుపు రంగు బంద్‌గలా కోట్ల)ను రద్దు చేసింది. దీంతో పాటు విద్యాసంస్థల్లో కాన్వొకేషన్ గౌన్లు, న్యాయస్థానాల్లో న్యాయవాదుల దుస్తుల మార్పుపై కూడా త్వరలో నిర్ణయం తీసుకోనుంది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా ఇక్కడి వాతావరణానికి అనుగుణంగా ఉండే దుస్తులను ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీనికి సంబంధించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా ఒక ప్రకటన చేశారు. వలసవాద మనస్తత్వాన్ని, ఆ కాలపు గుర్తులను పూర్తిగా తుడిచిపెట్టాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపులో భాగంగా ఈ మార్పు చోటుచేసుకుంది. రైల్వే అధికారులకు బ్రిటిష్ కాలం నుంచి అమలులో ఉన్న నలుపు రంగు ప్రిన్స్ కోట్ ఇకపై అధికారిక దుస్తుల్లో భాగం కాదని అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. అది బ్రిటిష్ వారి సంప్రదాయమని మన దేశ సంస్కృతికి, ప్రస్తుత పనితీరుకు అనుగుణంగా మార్పులు అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఈ బ్లాక్ కోట్‌ల స్థానంలో భారతీయ మూలాలు, సంస్కృతిని ప్రతిబింబించే కొత్త తరహా దుస్తులను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యూనివర్సిటీల స్నాతకోత్సవాల్లో విద్యార్థులు వేసుకునే గౌన్లు, మోర్టార్ బోర్డ్ (టోపీలు) పై కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మన దేశంలోని ఉష్ణమండల వాతావరణానికి ఈ నల్లటి గౌన్లు ఏమాత్రం సౌకర్యవంతంగా ఉండవని ఇవి కేవలం పాశ్చాత్య సంప్రదాయమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే అనేక ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు పంచెలు, కుర్తాలు, భారతీయ సంప్రదాయ వస్త్రధారణను అమలుచేస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇపుడు మోడీప్రభుత్వం కూడా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే దుస్తులనే న్యాయవ్యవస్థ, విద్యావ్యవస్థ, రైల్వేల్లో డ్రెస్‌కోడ్‌గా అమలు చేయాలని చూస్తోంది.




## నా ఇంటిని కూల్చేసిన వారికి శాస్తి జరిగింది

### థాకరే సేన ఓటమిపై కంగనారనౌత్ విసుర్లు

**ముంబయి, జనవరి 17:** తన ఇంటిని కూల్చివేసిన వారికి తగిన శాస్తి జరిగిందని బిజెపి సిమ్లా ఎంపి కంగనారనౌత్ వ్యాఖ్యానించారు. బృహన్‌ముంబయి మున్సిపల్ ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించడం, థాకరే శివసేన ఓటమి పాలయిన వైనంపై ఆమె తన అభిప్రాయాలు వ్యక్తంచేస్తూ ముంబయిలో నా ఇంటిని కూల్చేసినవారికి శాస్తి జరిగిందని అన్నారు. మొత్తం 227 వార్డులున్న బీఎంసీలో అధికారం చేపట్టేందుకు 114 సీట్లు అవసరం కాగా, బీజేపీఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన కూటమి 118 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఇందులో బీజేపీ 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించగా, షిండే వర్గం 29 సీట్లు గెలుచుకుంది. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) కేవలం 65 సీట్లకే పరిమితమైంది. కాంగ్రెస్ 24, ఎంఎన్‌ఎస్ 6 స్థానాల్లో విజయం సాధించాయి. ఈ ఫలితాల తర్వాత కంగనా రనౌత్ స్పందిస్తూ తన పాత సంఘటనను గుర్తు చేసుకున్నారు. 2020లో ఉద్ధవ్ థాకరే ప్రభుత్వ హయాంలో బీఎంసీ అధికారులు తన కార్యాలయంలోని కొంత భాగాన్ని కూల్చివేశారు. నా ఇల్లు పడగొట్టారు, రేపు మీ అహంకారం బద్దలవుతుందని అప్పట్లో ఆమె చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకుంటున్నారు. మహాయుతి కూటమి విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయంతో దేశంలోనే అత్యంత సంపన్నమైన కార్పొరేషన్ బిజెపి కూటమి చేతికి వచ్చినట్లయింది. త్వరలోనే ముంబైకి కొత్త మేయర్‌ను ఈ కూటమి ఎన్నుకోనుంది.

## ఎందరో మేధావుల కల.. నోబెల్

### కొందరు వేలం వేస్తే, మరికొందరు అమ్మేశారు



**వాషింగ్టన్, జనవరి 17:** నోబెల్ ప్రైజ్.. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు, రచయితలు కలలు కంటారు. ఈ అవార్డు అందుకోవడం అత్యంత గౌరవంగా భావిస్తారు. అలాంటి పురస్కారాన్ని వెనిజులా విపక్ష నేత మారియా కొరీనా మచాడో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇచ్చేశారు. దీంతో ఇది కాస్తా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, వచ్చిన 'నోబెల్'ను వదులుకోవడం కొత్తేం కాదు. గతంలో పలువురు గ్రహీతలు అనేక కారణాలతో వాటిని వేలం వేయడం, విక్రయించడం వంటివి చేశారు. ఆ సందర్భాలేంటో చూద్దాం. 2021లో రష్యా జర్నలిస్టు దిమిత్రి మురాటోవ్ నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అయితే, ఆ మరుసటి యేడాదే దాన్ని వేలంవేయగా రికార్డు స్థాయిలో 103.5 మిలియన్ డాలర్లు పలికింది. ఆ మొత్తాన్ని ఉక్రెయిన్ శరణార్థుల్లో ఉన్న చిన్నారుల సంక్షేమం కోసం యునిసెఫ్ విరాళంగా ఇచ్చారు. అమెరికా శాస్త్రవేత్త జాన్ నాష్ ఆర్థికశాస్త్రంలో నోబెల్ తీసుకున్నారు. ఆ అవార్డును 2019లో క్రిస్టీస్ ఆక్షన్ సంస్థ వేలం వేయగా.. 7,35,000 డాలర్లు పలికింది. ఈ మొత్తాన్ని జాన్ నాష్ పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్‌కు ఇచ్చేశారు. 1962లో అమెరికా శాస్త్రవేత్త జేమ్స్ డి.వాట్సన్ వైద్యశాస్త్రంలో నోబెల్ అందుకున్నారు. అయితే, శాస్త్రీయ పరిశోధనల కోసం విరాళాలు సేకరించే క్రమంలో ఆ పురస్కారాన్ని ఆయన విక్రయించగా.. రష్యాకు చెందిన బిలియనీర్ అలిషెర్ ఉస్మనోవ్ కొనుగోలు చేశారు. ఆ పురస్కారాన్ని అలిషెర్ తన వద్ద ఉంచుకోకుండా తిరిగి వాట్సన్‌కే ఇచ్చేశారు. ఈ అవార్డు శాస్త్రవేత్త వద్ద ఉండటమే సరైందని నాడు బిలియనీర్ అన్నారు.

1939లో సోవియెట్ యూనియన్ ఫిన్‌లాండ్‌ను ఆక్రమించింది. ఆ సమయంలో ఫిన్‌లాండ్ ప్రజల కోసం విరాళాలు సేకరించేందుకు డెన్మార్క్ శాస్త్రవేత్తలు నీల్స్ బోర్, ఆగస్ట్ క్రోగ్ తమ నోబెల్ పురస్కారానాలను వేలం వేశారు. ఈ వేలంలో అవార్డు కొనుకున్నవారు కొంతకాలం తర్వాత డెన్మార్క్ మ్యూజియంలకు వాటిని ఇచ్చేశారు.

నీల్స్ బోర్ కుమారుడు ఆగేబోర్ కూడా 1975లో ఫిజిక్స్‌లో నోబెల్ అందుకున్నారు. దాన్ని 2011లో వేలం వేశారు. అయితే, 2019లో ఆయనకు మరోసారి నోబెల్ దక్కడం విశేషం.

నాజీ సానుభూతిపరుడైన నార్వే రచయిత నట్ హామ్సన్‌కు 1920లో నోబెల్ సాహిత్య పురస్కారం దక్కింది. దాన్ని ఆయన రెండో ప్రపంచ యుద్ధం సమయంలో నాజీ జర్మనీ మంత్రి జోసెఫ్‌కు బహుమతిగా ఇచ్చేశారు.

అమెరికా పర్యటనలో ఉన్న మచాడో తన నోబెల్‌ను ట్రంప్‌నకు ఇచ్చిన సంగతి తెలిసిందే. వెనిజులా ప్రజల స్వేచ్ఛ కోసం కృషి చేస్తున్న ట్రంప్‌నకు ఇది గుర్తింపు అని ఆమె పేర్కొన్నారు. ఈ పరిణామాలపై నోబెల్ కమిటీ కూడా స్పందించింది. ఇలా తన పురస్కారాన్ని మరొకరికి ఇవ్వడం చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది నార్వే నోబెల్ ఇనిస్టిట్యూట్, నోబెల్ కమిటీ నిబంధనలకు ప్రకారం.. ఒకసారి నోబెల్ ప్రకటించిన తర్వాత.. దాని రద్దు, బదలీ చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం కుదరదు. అయితే గ్రహీతలు తమ మెడల్ లేదా నగదు బహుమతిని ఏదైనా చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. కానీ, అధికారికంగా మాత్రం పురస్కారం వారి పేరు మీదే ఉంటుంది.

## వలసజీవుల బాధలు వర్ణనాతీతం: ఎంపి సుధామూర్తి



**జైపూర్, జనవరి 17:** దేశ విభజన అనంతరం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు వలస వెళ్లిన వారి గురించి ఆలోచిస్తే ఎంతో బాధ కలుగుతుందని రాజ్యసభ సభ్యురాలు, ప్రముఖ రచయిత్రి సుధామూర్తి అన్నారు. దేశ విభజన జరగడం దురదృష్టకరమని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని ఆమె అభిప్రాయపడ్డారు. జైపూర్ సాహిత్య వేడుకలో పాల్గొన్న సుధామూర్తి మాట్లాడుతూ, దేశ చరిత్రను, ముఖ్యంగా విభజనకు దారితీసిన పరిస్థితులను నేటి తరంపిల్లలు తప్పనిసరిగా అర్థం చేసుకోవాలని సూచించారు. చరిత్ర తెలియకపోతే భవిష్యత్తును అర్థం చేసుకోవడం కష్టమన్నారు. భారతీయ సంప్రదాయం, భాషల గురించి ఏమీ తెలియని ఒక వ్యక్తి పెన్సిల్ తీసుకుని గీత గీసి సరిహద్దుల నిర్ణయించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు వలస వెళ్లిన వారి గురించి ఆలోచిస్తే బాధగా ఉందన్నారు. ఒకసారి తాను పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు విదేశీయురాలినని చెప్పి అక్కడి మ్యూజియంలో అధిక ఛార్జ్ వసూలు చేశారని, కానీ ఆ భూభాగం ఒకప్పుడు మన దేశంలో భాగమేనని గుర్తు చేశారు. సరిహద్దుల కారణంగా అది విదేశమైందన్న ఆలోచన తనను ఎంతగానో బాధించిందని ఆమె తెలిపారు. మనం ఇప్పుడు అనుభవిస్తున్న స్వేచ్ఛ మన పూర్వీకులు ఎంతో కష్టపడి సాధించారని ఆమె పేర్కొన్నారు. దేశ విభజన కోసం ఆనాడు తీసుకున్న తప్పుడు నిర్ణయం ఎన్నో తరాలపై ప్రభావం చూపుతోందని ఆమె అన్నారు.

## తమిళనాడులో పురుషులకూ ఉచిత బస్సు

### అన్నాడిఎంకె ఎన్నికల మేనిఫెస్టో విడుదల



**చెన్నై, జనవరి 17:** తమిళనాడు 2026 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏఐఏడీఎంకే పార్టీ తమ ఎన్నికల వాగ్ధానాల్లో ఈ హామీని ప్రకటించింది. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సిటీ బస్సుల్లో మగవాళ్లకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అమలు చేస్తామని ఏఐఏడీఎంకే జనరల్ సెక్రటరీ ఇడప్పడి కే పళనిస్వామి ప్రకటించారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి పురుషులపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఇప్పటికే మహిళలకు సిటీ బస్సుల్లో ఉన్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అలాగే కొనసాగుతుందని వెల్లడించారు. మరి ఈ స్కీమ్ ఎంతమందిని ఆకరిస్తుంది.. ఏఐఏడీఎంకేను గెలిపించడంలో కీరోల్ పోషిస్తుందా అనేది ఆసక్తి నెలకొంది. మొదటి దశ ఎన్నికల వాగ్ధానాల్లో మరో నాలుగు హామీలను కూడా ప్రకటించింది ఏఐఏడీఎంకే. ప్రతి మహిళా కుటుంబ పెద్దకు నెలనెలా రూ.2వేలు, అందరికీ ఇళ్లు, నగరంలోని బస్సుల్లో పురుషులకు ఉచిత ప్రయాణం, 100 రోజుల ఉపాధి హామీ పథకం 150 రోజులకు పొడిగింపు, రూ.25వేల సబ్సిడీతో ఐదులక్షలమంది మహిళలకు అమ్మ ద్విచక్రవాహన పంపిణీ పథకంఇతర అంశాలతో మేనిఫెస్టో విడుదలచేసారు. ప్రస్తుతం మహిళా కుటుంబ పెద్దలకు రూ.1000, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలువుతున్న సంగతి తెలిసిందే. ఇపుడు చెన్నై నగరంలో పురుషులకు కూడా ఉచితప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పళనిసామి వెల్లడించారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అనగానే మొదట గుర్తొచ్చేది కర్ణాటక రాష్ట్రం. అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసింది. ఆ తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు స్కీమ్‌ను అమలు చేసింది. అయితే ఈ రెండు రాష్ట్రాల్లో ఉచిత ప్రయాణాలపై హర్షాతిరేకాల కన్నా విమర్శలే ఎక్కువగా వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ స్కీమ్ అమలవుతున్న విషయం తెలిసిందే. కొన్ని ప్రాంతాల్లో ఆడవాళ్లకేనా మగ వాళ్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించా లంటూ డిమాండ్లు అక్కడక్కడా కనిపిస్తూనే ఉన్నాయి. ఈ డిమాండ్‌ను ఇపుడు ఎఐఎడిఎంకె రాజకీయ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి అందరి ఫోకస్ తనవైపు తిప్పుకునే పనిలో పడింది.

## సంక్షిప్తంగా..

### చైనా స్కూలులో 103 మంది విద్యార్థులకు 'నోరా వైరస్'




**బీజింగ్,జనవరి 17:** చైనాలోని ఓ స్కూలులో వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు 'నోరా వైరస్' సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం క్లాస్ రూమ్‌లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్‌ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్సఅందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు. బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు.

### జైలు నుంచే పోటీ చేసి గెలిచిన అత్తాకోడళ్లు



**పూణె, జనవరి 17:** హత్య కేసులో జైలుకు వెళ్లిన ఇద్దరు మహిళలు మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందడం పూణెలో సంచలనంగా మారింది. లోకల్ గ్యాంగ్‌స్టర్ బందు అందేకర్ బంధు వులు, వరుసకు అత్తాకోడళ్లు అయిన సోనాలి, లక్ష్మి జైలునుంచే అజిత్ పవార్ ఎన్సీపీ పార్టీ టికెట్ పై ఎన్నికల్లో పోటీ చేశారు. వారి తరఫున కుటుంబ సభ్యులు ప్రచారం చేయడంతో ఈ అత్తాకోడళ్లు ఘన విజ యం సాధించారు. ఎన్నికల ముందు వీరికి టికెట్ ఇవ్వడం రాజకీయంగా దుమా రం రేపింది. హత్య కేసులో నిందితులకు టికెట్ ఎలా ఇచ్చారంటూ అజిత్ పవార్ పై ప్రతిపక్షాలతో పాటు మిత్రపక్షం బీజేపీ నేతలు కూడా మండిపడ్డారు. అయితే, ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షాలను ఆశ్చర్యానికి గురిచేశాయి.

### అమెరికాకు పెట్టుబడులు వచ్చేది భారత్ నుంచే: రిచ్ మెక్‌కార్మిక్

**వాషింగ్టన్, జనవరి 17:** భారత్, పాకిస్థాన్‌లతో అమెరికా సంబంధాలపై ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, రిపబ్లికన్ పార్టీ నేత రిచ్ మెక్‌కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు.పాకిస్థాన్‌తో కంటే భారత్‌తో అమెరికా సంబంధాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అమెరికాకు పెట్టుబడులను తీసుకొచ్చేది భారత్ తప్ప పాకిస్థాన్‌కాదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రతిభావంతులైన నిపుణులను, ఉద్యోగులను భారత్ అమెరికాకు పంపిస్తోందని ఆయన పేర్కొన్నారు. అమెరికా అభివృద్ధిలో భారతదేశం, అక్కడి నిపుణులు, ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తాయని అన్నారు. భారత్‌ను అమెరికా దూరం చేసుకోకూడదని, ఒకవేళ అదే జరిగితే అమెరికాకే నష్టమని ఆయన పేర్కొన్నారు.

### గ్రీన్‌ల్యాండ్ ఎలాగైనా లాగేసుకుంటాం: ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రపంచ దేశాలకు మరోసారి టారిఫ్ ల హెచ్చరికలు చేశారు. గ్రీన్ లాండ్ ను ఎలాగైనా తీసేసుకుంటామని ఇప్పటికే స్పష్టం చేసిన ట్రంప్ ఈ విషయంలో తమతో విభేదించే దేశాలకు టారిఫ్‌లతో బదులిస్తామని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా జాతీయ భద్రత విషయంలో గ్రీన్ లాండ్ చాలా కీలకమని, అయితే సులువుగా, కాకపోతే కఠిన పద్ధతిలోనైనా దానిని స్వాధీనం చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ ఆక్రమణను వ్యతిరేకిస్తే సహించబోనని చెప్పారు. ప్రపంచ దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ పరోక్షంగా డెన్మార్క్‌ను నేరుగా హెచ్చరించినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గ్రీన్ లాండ్ ను అమెరికా ఆక్రమించుకోవాలని చూడడాన్ని డెన్మార్క్ మొదటినుంచీ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. తమ అధీనంలోని గ్రీన్ లాండ్ ఎన్నటికీ స్వతంత్రంగానే ఉంటుందని డెన్మార్క్ అధ్యక్షుడు మెట్టె ఫ్రెడెరిక్సన్ పలుమార్లు తేల్చి చెప్పారు.

### బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్య



**ఢాకా, జనవరి 17:** బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్యకు గురయ్యాడు. గత మూడు వారాల్లోనే బంగ్లాదేశ్‌లో పది మందికి పైగా హిందువులు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. పెట్రోల్ పంపులో ఇంధనం నింపుకుని డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు హిందూ వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. రాజ్‌బరి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనలో మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. అతడు అక్కడి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.




## ప్రియురాలు, స్నేహితురాలిని సైతం హత్య చేసిన రష్యన్

**పనాజీ, జనవరి 17:** రష్యాకు చెందిన ఒక పర్యాటకుడు దారుణానికి పాల్పడ్డాడు. ప్రియురాలుతో పాటు మరో స్నేహితురాలిని హత్య చేశాడు. వారిద్దరిని గొంతు కోసి దారుణంగా హత్యచేయడంతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర గోవాలో రష్యా జాతీయుడైన 37 ఏళ్ల అలెక్సీ లియోనోవ్, ఈనెల 14న రాత్రి వేళ మోర్జిమ్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్న స్నేహితురాలైన 37 ఏళ్ల ఎలెనా వనీవాపై కత్తితో దాడి చేశాడు. ఆమె గొంతుకోసి హత్య చేశాడు. ఆ తర్వాత 8 కిలోమీటర్ల దూరంలోని అరమ్బోల్ గ్రామానికి అలెక్సీ లియోనోవ్ చేరుకున్నాడు. ఈనెల 15న సాయంత్రం వేళ అద్దె ఇంట్లో కలిసి నివసిస్తున్న ప్రియురాలైన 37 ఏళ్ల ఎలెనా కస్థానోవా, అతడి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆమె కాళ్లు, చేతులు కట్టేసి గదిలో బంధించాడు. తప్పించుకునేందుకు ఆమె ప్రయత్నించగా కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. మరోవైపు ఆ ఇంటి యజమాని ఫిర్యాదుతో మండ్రేమ్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రష్యా జాతీయుడైన అలెక్సీ లియోనోవ్‌ను అరెస్ట్ చేశారు. రష్యాకు చెందిన ప్రియురాలితో పాటు స్నేహితురాలిని కూడా అతడు హత్య చేసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఇద్దరు మహిళల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రష్యా వ్యక్తిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజ్యసభలో దీర్ఘకాలికంగా 19 బిల్లులు పెండింగ్



**న్యూఢిల్లీ, జనవరి 17:** రాజ్యసభలో ప్రస్తుతం 19 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తాజా వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో ఓ బిల్లు 1992 నుంచి అంటే దాదాపు 33 ఏళ్లుగా పెండింగులో ఉంది. ఎగువసభ బులెటిన్ ప్రకారం జనాభా నియంత్రణ, చిన్న కుటుంబాలను ప్రోత్సహించేందుకు సంబంధించిన బిల్లు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్నట్లు తేలింది. ఎన్నికల్లో పోటీచేసే వారికి ఇద్దరు పిల్లల నిబంధనను పొందుపరిచారు. ఇద్దరు కన్నా ఎక్కువ పిల్లలు ఉంటే ఎంపీని లేదా ఎమ్మెల్యేని అనర్హులుగా ప్రకటించాలని ఆ బిల్లులో ప్రతిపాదించారు. 1997 నాటి ఢిల్లీ అద్దెల (సవరణ) బిల్లు కూడా సుదీర్ఘకాలంగా పెండింగులోనే ఉంది. ఈ బిల్లుపై పలు భాగస్వామ్య పక్షాల నుంచి వ్యతిరేకత రావడంతో ముందుకు కదల్లేదు. నాణ్యమైన విత్తనాల అమ్మకం, వీటి ఎగుమతి, దిగుమతులకు సంబంధిన సీడ్స్ బిల్లు 2004 నుంచి పెండింగులోనే ఉంది. అంతర్రాష్ట్ర వలస కార్మికులకు సంబంధించిన ఓ బిల్లు 2011 నుంచి ఆమోదానికి నోచుకోలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు దీనిని ప్రవేశపెట్టారు. వీటితోపాటు భవన నిర్మాణ కార్మికుల బిల్లు, ఉపాధి కల్పన కార్యాలయాల బిల్లు సహా పలు బిల్లులు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. లోక్ సభ రద్దయినప్పుడు పెండింగ్ బిల్లుల గడువు తీరిపోతుంది. వాటిని మళ్లీ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కానీ రాజ్యసభ శాశ్వతసభ కాబట్టి ఎప్పటికీ రద్దుకాదు. బిల్లులు సజీవంగా ఉంటాయి. అయినా కూడా ఈబిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయంటే వివిధ పార్టీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం తీసుకురా లేకపోవడమేనని తెలుస్తోంది.

## పంజాబీ గాయకుడికి బిష్ణోయ్ గ్యాంగ్ వార్నింగ్

### రూ.10 కోట్లు ఇవ్వకపోతే ఖతం చేస్తామని హెచ్చరిక



**న్యూఢిల్లీ, జనవరి 17:** పముఖ బాలీవుడ్ గాయకుడు, పంజాబీ సింగర్ బీప్రాక్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. సిద్దూ మూసేవాలా హత్య తరహాలోనే డబ్బులివ్వకపోతే ఖతంచేస్తామంటూ వార్నింగ్ ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదులు చేసాడు. వారం రోజుల్లోగా రూ.10కోట్లు ఇవ్వకపోతే దారుణమైన పర్యవసనాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ ముఠా హెచ్చరించింది.

ప్రాక్ సహోద్యోగి, గా యని దిల్నూర్‌కు ఫోన్ కాల్స్, ఒక వాయిస్ మెసేజ్ ద్వారా ఈ బెదిరింపులు వచ్చాయి. ఈనెల 5వతేదీన దిల్నూర్ మొబైల్‌కు అంత ర్జాతీయ నంబర్ నుంచి రెండుసార్లు కాల్స్ వచ్చాయి. అయితే ఆమె స్పందించలేదు. మరు సటి రోజు మళ్లీ కాల్ రావడంతో ఆమె క్లుప్తంగా సమాధానమిచ్చి, అనుమానం రావడంతో కాల్‌ను కట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అర్జు బిష్ణోయ్ పేరుతో ఆమెకు ఒక వాయిస్ మెసేజ్ వచ్చింది. ఆడియోలో ఏముందంటే హలో అర్జు బిష్ణోయ్ మాట్లాడుతున్నాను. మాకు రూ.10 కోట్లు కావాలని బీప్రాక్‌కు చెప్పు. మీకు వారం రోజులు గడువు ఇస్తున్నాం. మీరు ఏ దేశానికి పారిపోయినా అతనితోపాటు ఉండే ఎవర్నీ విడిచిపెట్టం. ఇది ఫేక్ మెసేజ్ అనుకోవద్దు. డబ్బు ఇవ్వకుంటే అతన్ని మట్టిలో కలిపేస్తాం అని ఆ ఆడియోలో హెచ్చరించారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన దిల్నూర్ ఈనెల 6న మొహాలి ఎస్ఎస్‌పీకి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. క్రిమినల్ గ్యాంగ్‌తో సంబంధమున్న ఎక్స్‌టార్షన్ కేసుగా పరిగణించిన పోలీసులు దీనిపై వెంటనే దర్యాప్తు చేపట్టారు.

# ఉప్పులూరు గ్రామంలో కోడిపందాల బరి వద్ద అమానుష చర్య

### డబ్బులు తీసారనే నెపంతో కొందరిని బట్టలూడదీసి తాళ్లకు కట్టేసిన నిర్వాహకులు



**విజయవాడ,.జనవరి17,ప్రభాత వార్తప్రతినిధి:** విజయవాడ నగర సమీపంలోని కంకిపాడు దగ్గర ఉప్పలూరులో అమానషు చర్య చోటు చేసుకుంది. కోడి పందాల బరి వద్ద గల్లా నుంచి డబ్బులు తీసారనే నెపంతో బట్టలూడదీసి తాళ్లతో నిర్వాహకులు కట్టేసారు. పందెం బరి వద్ద నిర్వహించే పత్తలా ఆట కోసం తోట్లవల్లూరుకి చెందిన కొందరిని కూలి కోసం తీసుకుని నిర్వాహకుల వెళ్ళారు. ఆటలో వచ్చిన లెక్కల్లో తేడాలు రావడంతో బట్టలూడదీసి తాళ్లతో కట్టేసిన నిర్వాహకులు తాళ్లతో కట్టేసి వారిపై దాడి చేసి వీడియో నిర్వాహకులు తీసారు. వాటిని కొన్ని వాటాప్స్ గ్రూపుల్లో పెట్టారు. ఈ వ్యవహారంపై స్దానిక పోలీసులు స్పందించని క్రమంలో కొందరు ప్రజాసంఘాల నాయకులు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకుని వెళ్ళారు. దాంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. కంకిపాడు పోలీసులపై మండిపడ్డారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వాహకుల్లో కొందరిని కేసు నమోదు చేసి అరెస్టు చేసిన కంకిపాడు పోలీసులు. అమానుష ఘటనపై ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

# హెల్ప్‌లైన్‌తో మరింత మెరుగ్గా కళ్యాణ మండపాల నిర్వహణ :టిటిడి ఇఓ సింఘాల్



**తిరుమల,జనవరి 17ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి కళ్యాణమండపాలను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయాలని అధికారులను టిటిడి ఇఓ అనిల్‌కుమార్‌సింఘాల్ ఆదేశించారు. భక్తుల నుండి అభిప్రాయం సేకరించేందుకు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటుచేయడం ద్వారా ,భక్తుల నుండి శ్రీవారిసేవకులు అభిప్రాయ సేకరణ చేయడం వల్ల వాటి నిర్వహణ, ఏఏ సౌకర్యాలు అవసరమో తెలుసుకునేందుకు ప్రణాళికలు సిద్దంచేయాలని తెలిపారు. కల్యాణమండపాల నిర్వహణను ఎఫ్ఎంఎస్ పరిదిలోకి తీసుకువస్తే పరిశుభ్రత, మెరుగైన సౌకర్యాల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని అన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి సిఇ సత్యనారాయణ, ఎఫ్ఎసిఎఓ బాలాజీ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి కల్యాణమండపాల నిర్వహణ, మెరుగైన సౌకర్యాలు కల్పనపై సమీక్షించారు.

దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి కల్యాణమండపాల్లో ప్రహరీగోడలు, మరుగుదొడ్లు, కల్యాణవేదిక, అలంకరణ, వివాహవేడుకలను నిర్వహించేందుకు అనువుగా ఉన్నాయా, ఏదేని సౌకార్యలు కల్పించాలా అనేది తెలుసుకోవాలన్నారు.మెరుగైన సౌకర్యాలు ఏర్పాటుచేయాడం వల్ల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు.

## బిసిసిఐ అబ్జర్వర్ గా కెడిసిఎ సెక్రటరీ ఎమ్.రవీంద్ర చౌదరి నియామకం




**విజయవాడ.జనవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** నాగపూర్ లో ఈ నెల 21వ తేదీజరిగే ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ మొదటి టిట్వంటీ మ్యాచ్ కి అబ్జర్వర్ గా కెడిసిఎ (కృష్ణ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్) సెక్రటరీ ఎమ్.రవీంద్ర చౌదరి నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎమ్.రవీంద్ర చౌదరి కి అభినందనలు తెలిపింది. గత 40 సంవత్సరాలుగా క్రికెట్ కి అందిస్తున్న సేవలకి ఎమ్.రవీంద్ర చౌదరికి తగిన గుర్తింపు లభించందని క్రికెట్ అభిమానులు, క్రికెట్ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేరళ ప్రాచీన యుద్ధ క్రీడ సిలంబం పోటీలో జగ్గయ్యపేట విద్యార్థి చౌడవరపు దేవాన్ష్ ప్రతిభ




**జగ్గయ్యపేట, జనవరి 17, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన విద్యార్థి చౌడవరపు దేవాన్ష్ కేరళ ప్రాచీన యుద్ధ క్రీడ సిలంబం పోటీలో నాలుగు పతకాలు సాధించి విజయభేరి మోగించాడు. జాతీయస్ధాయి పోటీలకు ఎంపికై జగ్గయ్యపేటకు వన్నెతెచ్చాడు. కేరళలోని త్రివేండ్రంలో జరిగిన అమెచ్యూర్ అసోసియేషన్ ఆఫ్ కేరళ ఆధ్వర్యంలో జరిగిన 2026–27 ఛాంపియన్ షిప్ పోటీలకు జగ్గయ్యపేట నుండి హాజరైన దేవాన్ష్ 4 పతకాలు కొల్లగొట్టి జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయస్ధాయి పోటీలకు అర్హత సాధించాడు. స్ధానిక చేగు విద్యాలయంలో 4వ తరగతి చదువుతున్న దేవాన్ష్ సంవత్సరకాలంగా ఆన్‌లైన్‌లో సిలంబం పోటీలకు సాధనచేశాడు. టీం ఈవెంట్, ఇరట్టు వాడి వీషు, అలంకార వాడి వీషు, వెలకంబు వి విభాగాల్లో నాలుగు పతకాలు సొంతం చేసుకుని రికార్డు సృష్టించాడు. బైజు మోహన్‌దాస్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. దేవాన్ష్ తండ్రి చౌడవరపు సాయికిషన్ స్ధానికంగా బంగారం వ్యాపారం చేస్తున్నారు, తల్లి గృహిణి.

# దుర్గమ్మ ఆలయంలో 23న వసంతపంచమి వేడుకలు



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జనవరి 17, ప్రభాతవార్త :** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 23 వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 7 గంటల వరకు యూనిఫారం, గుర్తింపుకార్డుతో వచ్చిన విద్యార్ధిని విద్యార్దులకు ఉచిత దర్శనం ఏర్పాటు చేశామన్నారు. అలాగే వారికి 6వ అంతస్థులో శ్రీ అమ్మవారి ప్రసాదంగా పెన్ను, లడ్డూ ప్రసాదం, శక్తికంకణం, శ్రీ అమ్మవారి ఫోటో అందిస్తామన్నారు. 6వ అంతస్థులో ఉచితంగా 500 మందికి అక్షరాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మవారు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతి మాతగా దర్శనమిస్తారన్నారు.

- దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 19 నుండి మాఘమాసంలో పూజలు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 19ను మాఘమాసం ప్రారంభం నుండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈనెల 25, 28, ఫిబ్రవరి 1, 8, 13, మరియు 15వ తేదీలలో ప్రత్యేక సూర్య ఉపాసన పూజాదికాలు జరుగుతాయన్నారు. రు.1000 ల ఉభయ రుసుముతో దంపతులు పాల్గొనవచ్చన్నారు.

- భక్తుల సౌకర్యార్థం ఆలయ ఇఓ చర్యలు సత్ఫలితం : శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఇఓ వికె శీనా నాయక్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. భక్తులు ఇఓ తీసుకున్న చర్యలతో హర్షం వెలిబుచ్చుతున్నారు. స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు రద్దీని బట్టి త్వరితంగా సామాన్య భక్తులకు దర్శనమయ్యేలా చర్యలు తీసుకోవడంతో త్వరగా శ్రీ అమ్మవారి దర్శనం అవుతోంది.

- ఈనెల 19న హుండీ లెక్కింపులు:

శ్రీ కనకదుర్గ అమ్మవారికి హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 19న లెక్కిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

- భక్తుల విరాళం: శ్రీ అమ్మవారి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన త్రిశూన్ కుమార్ దంపతులు రూ.1,11,111/–లు ఆలయ అధికారులకు శనివారం విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మరో దాత సతీష్‌కుమార్ రు.1,00,011ల విరాళం శనివారం అందించారు. ఏలూరుకు చెందిన మరో దాత అన్న ప్రసాద వితరణకు రు.1,01,116ల విరాళాన్ని శనివారం అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

- దుర్గమ్మను దర్శించుకున్న శేఖర్ మాస్టర్: దుర్గమ్మవారిని శేఖర్ మాస్టర్ శనివారం దర్శించుకున్నారు.



# ఐదవ తరగతి దాకా మాతృభాషలోనే విద్యాబోధన

## జిఓ నం. 85ను వెంటనే రద్దు చేయాలి

### ప్రజల మమకార భాషగా తెలుగు వికసించాలి: ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

**విజయవాడ. జనవరి17, ప్రభాత వార్త ప్రతినిధి:** తెలుగు భాష అధికార భాషగా మాత్రమే కాక, ప్రజల మమకార భాషగా వికసించాలని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు కేశిరాజు (గజల్) శ్రీనివాస్ అన్నారు. భాషగా మాత్రమే కాదు. అమ్మ ఒడి భాషగా, ప్రతి ఇంట్లో తెలుగు నిరంతరం వినిపిస్తూ సాగాలన్నారు. మాతృభాష మన ఉనికి. ఆ ఉనికిని ప్రతి ఒక్కరూ మాతృభాషలో సంభాషిస్తూ, జీవిస్తూ కాపాడుకోవాలన్నారు. ఆంగ్ల భాష జీవనోపాధికి, తెలుగు భాష జీవన సంస్కృతికి" అన్న భావాన్ని సమాజం లోతుగా గ్రహించాలి. వ్యక్తి గానీ, వ్యవస్థ గానీ వాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, విశ్వజనీన అభివృద్ధి మాతృభాష, సాంస్కృతిక విలువల పునాదుల నుంచే విస్తరిస్తుందన్న విశ్వాసంతో, ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈ క్రింది తీర్మానాలను ఆమోదిస్తోంది. ఆంధ్రమేవ జయతే! నినాదంతో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలకు అంతర్జాతీయ గౌరవం లభించిందన్నారు. మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందిన వెంటనే అంగీకరించి, ఒక దేశాధ్యక్షుడు సతీసమేతంగా తన వ్యక్తిగత కార్యక్రమంగా తీసుకొని హాజరై మహాసభలను ఘనంగా విజయవంతం చేయడమే కాకుండా, మారిషస్ దేశంలో 2027 జనవరి 9, 10 తేదీలలో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాలని నిర్ణయించినందుకు, ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యవర్గం హర్షాభివ్యక్తం చేస్తూందన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతమైన నేపథ్యంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యవర్గం నిర్వహించారుమారిషస్ రాష్ట్రపతి ధరమ్ బీర్ గోకుల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

**విద్యా విధానం - మాతృభాష పునాది**

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు హర్షపూర్వకంగా స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. ఐదవ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి. డిగ్రీ ఐదవ సెమిస్టర్ వరకు తెలుగు ఒక సబ్జెక్టుగా విధిగా ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో తెలుగు ద్వితీయ భాషగా విధిగా ఉండాలి. బోధన మాధ్యమాన్ని ఎంచుకునే హక్కు విద్యార్థులకు ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన" అనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జి.ఓ. నెం. 85ను వెంటనే రద్దు చేయాలి. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలైన 12237/2020 కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా కోరుతోంది.

**విద్యా వాస్తవాలు - ఆందోళనకర పరిస్థితి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10వ తరగతిలో సుమారు 5.5 లక్షల మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదువుతుండగా, కేవలం 32 వేల మంది మాత్రమే తెలుగు మాధ్యమంలో చదువుకుంటున్నారు. ఈ రెండు వర్గాల విద్యార్థుల్లోనూ తెలుగు, ఇంగ్లీష్ భాషలలో తగిన ప్రావీణ్యం లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తున్న అనేక మంది ఉపాధ్యాయులకు ఇంగ్లీష్‌లో బోధించే శిక్షణ, అనుభవం తగిన స్థాయిలో లేకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని ఈ సమావేశం స్పష్టంగా గుర్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ స్థాయిలో కేవలం 8 శాతం మంది మాత్రమే తెలుగును రెండవ భాషగా తీసుకుంటుండగా, సుమారు 90 శాతం మంది సంస్కృతాన్ని రెండవ భాషగా తీసుకుంటున్నారు. ఇది భాషాభ్యాసం కోసం కాకుండా, కేవలం మార్కుల కోసమే అమలవుతున్న విధానం. ఫలితంగా విద్యార్థులకు తెలుగు, సంస్కృతం రెండింట్లోనూ ప్రావీణ్యం లేకుండా పోతోంది. ఈ స్వయం విధ్వంసక భాషా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఈ సమావేశం డిమాండ్ చేస్తోంది. నిజంగా ఇతర భాషలు నేర్చుకోవాలనుకుంటే, పరీక్షలు కూడా ఆయా భాషలలోనే నిర్వహించే విధానం అమలులోకి తేవాలని స్పష్టంగా సూచిస్తోంది.

**పాలన - న్యాయం - అధికార భాష**

చట్టసభలలో, ప్రభుత్వ కార్యాలయాలలో చర్చలు, సమావేశాలు, ఉత్తర్వులు తెలుగు భాషలోనే ఉండాలి. సమీక్షా సారాంశం అవసరమైతే ఆంగ్ల భాషలో కూడా ఉండాలి. న్యాయస్థానాలలో వాదోపవాదాలు, న్యాయమూర్తుల తీర్పులు తెలుగు భాషలోనే ఉండాలి. తీర్పుల ప్రతులు ఆంగ్ల భాషలో కూడా అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులకు తెలుగు ప్రతిని విధిగా అంతర్జాలంలో పొందుపరచాలి. రాష్ట్ర గౌరవం - చరిత్ర - ప్రతీకలు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి ఆత్మబలిదానాన్ని స్మరిస్తూ, నవంబర్ 1వ తేదీననే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంగా కొనసాగించాలి. రాష్ట్ర గీతంగా మా తెలుగు తల్లికి మల్లెపూదండ".ను అవసరమైతే స్వల్ప మార్పులతో కొనసాగించాలి. తెలుగు గొప్పదనాన్ని వివరించే ఈ గేయం ప్రతి నోటా విన్పించాలన్నారు.

**పాఠ్యాంశాలు - విద్యార్థి వికాసం**

ప్రతి ప్రాథమిక పాఠశాలలో విధిగా తెలుగు పండితులను నియమించాలి. తెలుగు పంచతంత్ర కథలు, కాశీ మజిలీ కథలు, తెలుగు సంస్కృతి–సంప్రదాయాలు, సాహితీవేత్తల జీవితచరిత్రలు, స్వాతంత్ర సమరయోధుల చరిత్రలు పాఠ్యాంశాలుగా బోధించాలి. ఉపవాచకం ప్రాధాన్యతను గుర్తించాలి. ప్రతివారం కనీసం ఒక రోజు లలితకళలు, సంగీతం, సాహిత్యం వంటి అంశాలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. భారతదేశం నా మాతృభూమి" ప్రతిజ్ఞను ప్రతిరోజూ విద్యాలయాల్లో నిర్వహించాలి.

**గ్రంథాలయాలు - పఠన సంస్కృతి**

రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసి ఏకీకృతం చేయాలి. విద్యాలయాలలో వారానికి కనీసం మూడు రోజులు గ్రంథాలయ సమయం ఇవ్వాలి .గ్రంథాలయాలు లేని ప్రాంతాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్‌ను పూర్తిగా గ్రంథాలయాల అభివృద్ధి, నిర్వహణ, పుస్తకాల కొనుగోలు, డిజిటలైజేషన్‌కు చేయాలి.

# రైతుల భూములకు పూర్తి చట్టబద్ధత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

## - దేవాదాయ మంత్రి ఆనం



**అనంతసాగరం (నెల్లూరు), జనవరి 17, ప్రభాతవార్త :** రైతుల భూములకు పూర్తి చట్టబద్ధత, భద్రత కల్పిండచమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఉప్పలపాడులో శనివారం మీ భూమి–మీహక్కు కార్యక్రమంలో భాగంగా నూతన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు. తొలుత మండల నాయకులు మంత్రి ఆనంకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆనం మాట్లాడుతూ అధికారం చేపట్టిన వెంటనే రైతుల హక్కులను హరించే ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేశామని గుర్తు చేశారు. రైతుల భూమి హక్కులకు భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ రాజముద్రతో క్యూ ఆర్ కోడ్‌తో జారీ చేసిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు పూర్తిగా చట్టబద్ధత కలిగినాయన్నారు. ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూ యజమానికి సంబంధించిన అనిన వివరాలు తక్షణమే కనిపిస్తాయని వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకాలకు తమ ప్రభుత్వం ఇస్తున్న పాస్‌పుస్తకాలకు మధ్య ఉన్న తేడాను రైతులకు సులభంగా అర్థమయ్యేలా మంత్రి వివరించారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకాలు చెల్లని నోట్లతో సమానమని, విలువలేనివని తమ ప్రభుత్వం జారీ చేస్తున్న పాస్‌పుస్తకాలు మాత్రం రిజర్వ్‌బ్యాంక్ జారీచేసిన కరెన్సీ నోట్ల మాదిరిగా పూర్తి విలువ, భద్రత, చట్టబద్ధత కలిగి ఉన్నాయన్నారు. నెల్లూరుజిల్లాలో 235గ్రామాల్లో రీసర్వే చేపట్టిన గట ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకాల స్థానంలో నూతన పాస్‌పుస్తకాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది రైతులకు నూతన పాస్‌పుస్తకాలు ఇవ్వడమే లక్ష్యంగా మంత్రి పేర్కొన్నారు. 2026 డిసెంబరు నాటికి రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను పూర్తిగా ప్రక్షాళణ చేసి రైతులు, ప్రజలకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ కార్యక్రమాలపై మంత్రి మాట్లాడుతూ ఎవరూ ఊహించని విధంగా ఆరుప్రధాన పథకాలను ప్రకటించి వాటి ద్వారా 60కిపైగా సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజలపై భారం పడకుండా ఆర్టీసికి ప్రభుత్వం 1144కోట్ల రూపాయలు చెల్లిస్తూ ఉచిత బస్సు–స్త్రీనిధి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 10వేల కోట్లను తల్లుల ఖాతాల్లో జమచేశామని, అన్నాక్యాంటీన్ల ద్వారా ఇప్పటివరకు నాలుగుకోట్ల మందికి భోజనం అందించామని, కోట్లాది రూపాయలతో పించన్లు క్రమం తప్పకుండా అందిస్తున్నామన్నారు. అలాగే గ్యాస్ సంస్థలకు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తూ ప్రజలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు.

### ఉపాధ్యాయులైన ఇద్దరు ముద్దాయిలకు

# ఐదేళ్లు జైలుశిక్ష రూ.50వేలు జరిమానా

**కావలి (నెల్లూరు), జనవరి 17, ప్రభాతవార్త :** పరీక్షలలో కాపీకొడుతున్నారనే కారణంగా విద్యార్థిని చితకబాది మృతికి కారకులైన ఇద్దరు ప్రైవేటు ఉపాధ్యాయులకు కోర్టు ఐదేళ్ళు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. వివరాలులోకి వెలితే రూరల్ మండలం బైనేటివరపాలెంకు చెందిన మందా చిన్నయ్య ఫిర్యాదు మేరకు పట్టణంలోని వైకుంఠపురంలో చేవూరివారి తోటలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో 2024అక్టోబర్ 11వతేది మద్యాహ్నం పాఠశాలల 5వ తరగతి చదువుతున్న మంద వెంకటసాయిక్రిష్ణ అనే విద్యార్థి క్వార్టర్లీ పరీక్షల సమయంలో కాపీ కొడుతుండగా కౌసల్య అనే ఇన్విజిలేటర్ కమ్ క్లాస్ టీచర్ విద్యార్థినిని కొట్టి మరొక టీచర్ మాధవరావు వద్దకు పంపగా అక్కడ టీచర్లు కౌలస్య మాదవరావు, హెచ్ఎం అయ్యన్న, కరస్పాండెంట్ క్రిష్ణలు విద్యార్థిని విచక్షణారహితంగా కొట్టారు. అనంతరం ఆ విద్యార్థి గాయాలుపాలై మృతి చెందాడు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది.

నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. తుది విచారణలో నేరం నిరూపణ అవడంతో ఈనెల 16న ఏఎస్‌జె కోర్టు జడ్జి ఎ.గీతావాణి అయ్యన్నకు, కొనంగి కౌలస్యకు ఐదేళ్ళు జైలుశిక్ష, రూ.50వేలు జరిమానాలు విధించడం జరిగింది.

# కుటుంబంలో విషాదం నింపిన సంక్రాంతి సంబరాలు

### - క్రికెట్ ఆడుతూ తనువు చాలించిన యువకుడు

**చౌడేపల్లి, జనవరి 17 ప్రభాతవార్త** రేపో మాపో ఉద్యోగం సంపాధించి కష్టంలో వున్న కుటుంబంలో వెలుగులు నింపుతాడనుకొన్నాడా తండ్రి...పొరుగు రాష్ట్రానికి వెళ్ళి కొలువు వేటలో పడి పండగనాడైన వచ్చి కంటారా చూసి కడుపారా తిండి పెడదామనుకొంది తల్లి... చినినాటి స్నేహితులతో కలసి ఆట పాటలాడి ఊరు జ్ఞాపకాలను మనసు నిండా నింపుకొని కొలువు సాధించి తీరుదామను కొన్నాడా బిడ్డ...ఇలా ఎవరికెవరు ఊహల్లో తేలుతూ కుటుంబానికి మంచి రోజులు రావాలని ఆకాంక్షించారు...తామొకటి తలచితే దేవుడు మరొకటి తలుస్తాడన్న చందంగా తల్లిదండ్రుల ఆశలపై నీళ్ళు చెల్లుతూ యువకుడు అనంత లోకాలకు చేరుకొన్నాడు...హృదయ విదారక మైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని వెంగళపల్లి పంచాయతీ పెద్దూరుకు చెందిన సహదేవరెడ్డి శక్తిక్షేత్రం బోయకొండలో పనిచేస్తున్నాడు. అతని కుమారుడు తేజ(21) పుంగనూరులోని ఎంసివి కాళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణ నిమిత్తం హైదరాబాదుకు వెళ్ళాడు. సొంత ఊరిలో సంక్రాంతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారనీ, చిననాటి స్నేహితులతో కలసి సంబరాల్లో పాల్గొనాలనే తలంపుతో తేజ సంక్రాంతికి గ్రామానికి వచ్చాడు. సంబరాల్లో భాగంగా పాలెంపల్లి సమీపంలోని పొలంలో గత రెండు రోజులుగా క్రికెట్ టోర్నమెంటు ఆడసాగారు. శనివారం యదాప్రకారం అందరూ గ్రౌండుకు చేరుకొన్నారు. తేజ 10నంబరు జెర్సీతో ఆడు తున్నాడు. తొలుత ఫీల్డింగ్ ఎంచుకొన్నారు. స్నేహితులతో కలసి ఫీల్డింగ్ కోసం కీపర్ వెనుక భాగంలో నిల్చొని వున్నాడు. మ్యాచ్ రసవత్తరంగా సాగుతున్న తరుణంలో 5వ ఓవర్ నందు బ్యాట్స్‌మ్యాన్ బంతిని లెగ్‌సైడ్ మీదుగా సిక్సర్ కొట్టాడు. కీపర్ వెనుకనే వున్న తేజ బాల్ బౌండరీ లైన్ దాటే క్రమాన్ని చూస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పడ్డాడు. గుర్తించిన సహచర క్రికెటర్లు అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

# బద్వేల్‌లో జరిగిన హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

## ఇద్దరు సోదరుల అరెస్టు, ఆయుధాలు స్వాధీనం- వెల్లడించిన వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

**కడప క్రైమ్, జనవరి 17, ప్రభాతవార్త:** బద్వేల్ రూరల్ పి యస్ పరిధిలో జరిగిన హత్య కేసును ఛేదించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు 11న మధ్యాహ్నం 11 గోపవరం మండలం, శ్రీనివాసపురం గ్రామం సమీపంలోని సత్య టౌన్‌షిప్ వెంచర్ వద్ద. మూడే శ్రీవాణి రిపోర్టు. నిందితుల పేర్లు 1) మూడే చిన్న గురవయ్య టీచర్ గుర్రయ్య, వయసు: 48 సం., తండ్రి: పెద్ద తిరుమలయ్య, స్వగ్రామం: ఈ. రామాపురం, ప్రస్తుతం బద్వేలులో ఉంటున్నారు. 2) మూడే నడిపి గుర్రయ్య, వయసు: సం., తండ్రి: పెద్ద తిరుమలయ్య, స్వగ్రామం: ఈ. రామాపురం, ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. మృతుడు/గాయపడిన వారి వివరాలు :మృతుడు: మూడే చిన్న గుర్రయ్య (42 సం.), తండ్రి: పెద్ద తిరుమలయ్య, నివాసం: వెంకటేశ్వర నగర్, బద్వేలు టౌన్, స్వగ్రామం: ఈ. రామాపురం.గాయపడిన వ్యక్తి: మూడే పెద్ద గుర్రయ్య (53 సం.), తండ్రి: పెద్ద తిరుమలయ్య, నివాసం: ఈ. రామాపురం, కలసపాడు మండలం. ప్రస్తుతం ఇంకా చికిత్స పొందుతూ వున్నాడు. కేసు పూర్వాపరాలు, నిందితుల అరెస్టు మరియు విచారణలో వెల్లడైన అంశాలు: తి1 అయిన టిచర్ గుర్రయ్యకు అతడి తమ్ముడు అయిన మృతుడు గత 10 ఏళ్లుగా సుమారు 20 లక్షల రూపాయల వరకు అప్పు ఇచ్చి ఉన్నాడని, అయితే ఇటీవల అతడి పెద్దన్న అయిన పెద్ద గుర్రయ్య (గాయపడ్డ వ్యక్తి) మాటలు విని, మృతుడు అప్పు వెంటనే తిరిగి ఇవ్వమని తనని పదే పదే వేధిస్తూ, అవమానకరంగా దూషిస్తు ఉండటంతో, తాను అబద్రతా భావానికి గురియై, వారిద్దరిపై కక్ష పెంచుకుని, బెంగుళూరులో ఉంటున్న తన రెండవ అన్న అయిన నడిపి గురయ్య (తి2) తో కలిసి వీరిద్దరి హత్యకు కుట్రపన్ని, పథకం రచించారు. వీరి ప్రణాళికలో భాగంగా 11.01.2026 తేదీన అప్పు సెటిల్ చేస్తామని నమ్మబలికి, మృతుడిని మరియు ఈ విషయమై మధ్యవర్తిగా ఉండమని వారి పెద్దన్న పెద్ద గురయ్యను నమ్మించి తి1 !! తి2 లు సత్య టౌన్‌షిప్ లోని నిర్జన ప్రదేశానికి రప్పించారు. అక్కడ మాటల మధ్యలో మృతుడి వద్ద ఉన్న అప్పుకు సంబంధించిన పత్రాలను లాక్కొని, పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న ఇనుప సుత్తులతో మృతుడి తల వెనుక భాగంలో విచక్షణారహితంగా కొట్టి చిన్న గురయ్యను హత్య చేశారు. అడ్డువచ్చిన పెద్దన్న పెద్ద గురయ్యపై కూడా హత్యాయత్నం చేసి, అతడి తలవెనుక అవే సుత్తులతో తీవ్రంగా గాయపరిచి, వారు రక్తపు మడుగులో కింద పడిపోగా ఇద్దరు మరణించారని భావించి నేరమునకు ఉపయోగించిన సుత్తులను కొద్ది దూరంలో వున్న కంపలో పడవేసి, తి1 వచ్చిన తిశి16 దీళి 5755 నెంబర్ గల సుజికి యాసేస్125 ద్విచక్ర వాహనంలో అక్కడి నుండి పారిపోయి రేణిగుంట చేరి, వాహనం అక్కడ పెట్టి, అక్కడ నుండి తాము రైలులో దూర ప్రాంతానికి వెళ్లినట్లు, చిన్న గురయ్య చనిపోయినట్లు, పెద్ద గురయ్య తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్నాడని, పోలీసులు తమగురించి తీవ్రంగా వెదుకుతున్నారని తెలుసుకొని, బద్వేలుకు వచ్చి తెలిసిన లాయర్ ద్వారా సహాయం పొడుదామని నిర్ణయించుకొని, 16.01.2026 తేదీ ఇద్దరు తిరిగి రేణిగుంటకు వచ్చి, తి1 వాహనంలో బద్వేలుకు వస్తు వుండగా, గరుడయ్య సత్రం వద్ద బద్వేలు రూరల్ సి.ఐ.గారు 16.01.2026 తేదీ సాయంత్రం, 5.30 శిలీ కు అరెస్టు చేయడం జరిగింది. విచారణలో నిందితులు ఇద్దరు తమ నేరాన్ని అంగీకరించారు. వీరిని రిమాడు నిమిత్తం కోర్టులో ప్రవేశ పెట్టడం జరుగుతుంది. నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు: రెండు ఇనుప సుత్తులు హత్యకు మరియు గాయపరచడానికి ఉపయోగించినవి.

# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు (నెల్లూరు), జనవరి 17, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్చరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్,సిబ్బంది పులగల నరసింహా, వెంకటసుబ్బయ్య,పెంచల స్వామి, హరీష్,తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.



శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సూఫీ సంగీతం గజల్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అభిషేక్‌సింఘ్వీ తదితరులు.

## చౌమహల్లా ప్యాలెస్‌లో అలరించిన గజల్స్ గానామృతం

### వీనుల విందుగా సూఫీ మ్యూజిక్

### హాజరైన పలువురు ప్రముఖులు

**హైదరాబాద్ (చాంద్రాయణగుట్ట), జనవరి 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చారిత్రక చౌమహల్లా ప్యాలెస్ (నాలుగు ప్యాలెస్‌లు)లో సాంప్రదాయ సాంస్కృతిక వారసత్వ సంగీతం ఉట్టిపడింది. నిజాం రాజప్రసాదంలో గజల్స్, సూఫీ సంగీతం ఆద్యంతం ఆహుతులను అలరించింది. ప్రముఖ గజల్ కళాకారాణి అనితా సింఘ్వీ గాత్రం నుండి జాలు వారిన గజల్స్ శ్రోతలను గానామృతంలో ఓలలాడించాయి. సూఫీ మ్యూజిక్ వీనుల విందుగా సాగింది. నిజాం నివాసం చౌమహల్లా ప్యాలెస్ రాజరికపు దర్పానికి మరోసారి వేదికైంది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ తదితర ప్రముఖులు హాజరై గజల్స్, మ్యూజిక్‌ను ఆస్వాదించారు. పోలీసులు భారీ పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు.



సూఫీ సంగీతాన్ని ఆలాపిస్తున్న అనితాసింఘ్వీ

## మహిళా వర్సిటీ విద్యార్థినులకు 20 వరకు సంక్రాంతి సెలవులు

### 21 నుంచి క్లాసులు ప్రారంభం.. ఇకపై షిఫ్టుల వారీగా తరగతుల నిర్వహణ

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం సంక్రాంతి సెలవులను పొడిగించింది. ఈ నెల 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించినప్పటికీ.. మరో రెండు రోజులపాటు సెలవులను పొడిగిస్తున్నట్టు యూనివర్సిటీ ప్రకటించింది. యూనివర్సిటీ ప్రాంగణంలో కొత్త భవనాలను నిర్మిస్తున్న నేపథ్యంలో సంక్రాంతి సెలవుల అనంతరం యూనివర్సిటీలోని యూజీ, పీజీ విద్యార్థినులకు షిఫ్టుల వారీగా క్లాసులను నిర్వహించాలని యూనివర్సిటీ నిర్ణయించింది. అందులో భాగంగానే యూజీ, పీజీ విద్యార్థినులకు క్లాసులను నిర్వహించే క్రమంలో వారికి షిఫ్టుల నిర్వహణలో భాగంగా ఇబ్బందులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే యూనివర్సిటీ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ నెల 18(ఆదివారం) వరకు సంక్రాంతి సెలవులు ఉండగా.. రేపటి(సోమవారం) నుంచి యూనివర్సిటీ పునః ప్రారంభం కావల్సి ఉంది. అయితే మరో రెండు రోజుల పాటు (19, 20) సెలవులను కొనసాగించి ఈ నెల 21(బుధవారం) యూని వర్సిటీలో క్లాసులను ప్రారంభించనున్నట్టు యూనివర్సిటీ ప్రకటించింది. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ కాలేజీలు సంక్రాంతి సెలవుల అనంతరం రేపటి నుంచి ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.పాఠశాలలు సక్రాంతి సెలవుల అనంతరం శనివారం తిరిగి ప్రారంభమైన సంగతి తెలిసిందే.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో గుజ్జ కృష్ణ, గణేషాచారి తదితరులు

## మున్సిపల్ ఎన్నికల్లోనూ బిసిలకు అన్యాయం

### తక్షణమే సిఎం సరిచేయాలి, లేదా రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది : జాజుల

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 17, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలుచేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఆదే పంథాను పునరావృత్తం చేసిందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, జెఎసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. 60 శాతం ఉన్న బిసిలకు 38 మున్సిపల్ స్థానాలు, 11 శాతం ఉన్న అగ్రకులాలకు 61 మున్సిపల్ స్థానాలు ఇదెక్కడి న్యాయమని, ఛైర్మన్‌లలో 31 శాతం, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్లలో 28 శాతమా?, బిసిలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్‌లు ఎటు పోయాయని ఆయన ప్రశ్నించారు. శనివారం బిసి భవన్‌లో కుందారం గణేషాచారి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిల రిజర్వేషన్‌ల విషయంలో మోసం చేస్తే ప్రతిపక్షాలు పట్టిం చుకోలేదన్నారు. 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని డా.బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే విగ్రహాల ఎదుట నిరసన కార్యక్రమాలు బిసిలు చేపడతారని జాజుల అన్నారు. తక్షణమే సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జోక్యం చేసుకుని బిసిలకు రిజర్వేషన్‌లను సరిదిద్దాలని లేదా రాష్ట్రం అగ్నిగుండంగా మారు తుందన్నారు.

## రాష్ట్రంలో 21.25 లక్షల జన్‌ధన్ ఖాతాలు బోగస్

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జన్ ధన్ పథకానికి వివిధ బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. బోగస్ ఖాతాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్రం ప్రతీ బ్యాంకు జన్ ధన్ ఖాతాకు ఖాతాదారుడి ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని మాత్రం కొన్ని బ్యాంకులు పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాల సొమ్మును జన్ ధన్ ఖాతాలకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానంలో కేంద్రం జమ చేస్తోంది. అయితే తెలంగాణలో 21,24,728 జన్ ధన్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో బోగస్ ఖాతాలను గుర్తించడం సాధ్యం కావడం లేదు. ఖాతాదారులకు ఇతర బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లను గుర్తించడం సైతం కష్టంగా మారుతుంది. అందుకే వెంటనే అనుసంధానం పూర్తి చేయాలని గత ఏడాది రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సైతం ఆదేశించింది.

# ఖమ్మం జిల్లాలో వేడెక్కిన రాజకీయం

### వివిధ మునిసిపాలిటీలు, కార్పొరేషన్ ఛైర్మన్ రిజర్వేషన్ల ఖరారు

### వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వరావుపేట జనరల్ మహిళకు, కల్లూరు, కొత్తగూడెం ఎస్టీ జనరల్, ఏదులాపురం ఎస్సీ మహిళ, ఇల్లందు బిసి మహిళకు ఖరారు

**ఖమ్మం బ్యూరో ప్రభాతవార్త :** తెలంగాణలో మరో ఎన్నికల సంగ్రామానికి ప్రభు త్వం తెరలేపింది. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ప్రభుత్వం తాజాగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమైంది.. ఎన్నికల ప్రక్రియల్లో భాగంగా శనివారం తెలంగాణ వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఛైర్మన్ రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించగా, డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.అదే విధంగా ఇదే పద్ధతిలో ఆయా జిల్లాల కలెక్టర్లు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో గల వార్డు రిజర్వేషన్లను చేసి వాటిని ప్రకటించారు. అవి కూడా వెల్లడి కావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్ మినహా అన్ని మున్సిపాలిటీలలో రాజకీయం ఒకసారి గా వేడెక్కింది. వార్డుల రిజర్వేషన్ వెల్లడైన వెంటనే కాంగ్రెస్, బిఆర్ఎస్ బిజెపి, పలు కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నాయకులు ఆశావాహులు ఎన్నికల రంగంలోకి దిగారు.నిన్నటి వరకు ఆయా వార్డుల్లో పోటీ చేద్దామనుకొని పలు కార్యక్రమాలు చేపట్టి రిజర్వేషన్ తమకు అనుకూలంగా రాకపోవడంతో నిరుత్సాహపడినవారు కొందరు ఉండగా మరికొందరు రిజర్వేషన్ తమకు అనుకూలంగా రావడంతో ఆనంద డోలికల్లో మునుగుతున్నారు.. అనేకమంది ఆశావాహులు ఆయా పార్టీల అగ్ర నాయకుల కు దగ్గర కావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో మున్సిపాలిటీలలో ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది. మరోవైపు అధికారులు చక చక ఎన్నికల పనులను ముమ్మరం చేస్తున్నారు.

**వార్డుల రిజర్వేషన్లు ఖరారు**

ఖమ్మం జిల్లాలో వైరా, సత్తుపల్లి, మధిర, ఏదులాపురం,కల్లూరు, మున్సి పాలి టీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపాలిటీ తో పాటు కొత్తగూడెం కార్పొరేషన్ కు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈమేరకు అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఖమ్మం జిల్లాలోని ఎదులాపురం మున్సిపాలిటీ ఛైర్మన్ ఎస్సీ మహిళాకు రిజర్వేషన్ కాగా వైరా జనరల్ మహిళ, మధిర జనరల్ మహిళ,సత్తుపల్లి జనరల్ మహిళ,కల్లూరు ఎస్టీ జనరల్ కు రిజర్వేషన్ అయ్యాయి. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్ ఎస్టీ జనరల్ కు రిజర్వేషన్ కాగా ఇల్లందు బీసీ మహిళ, అశ్వరావు పేట జనరల్ మహిళ కు రిజర్వేషన్ ఖరారైంది..వీటితోపాటు ఖమ్మం కార్పొరేషన్ మేయర్ కూడా జనరల్ మహిళకు రిజర్వేషన్ ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేసిన కలెక్టర్లు**

ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు లలోని వార్డులకు రిజర్వేషన్లు జిల్లా కలెక్ట ర్ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఖరారు చేశారు..వైరా మున్సిపాలిటీలో 20 వార్డులు, ఏదులాపురంలో 32, సత్తుపల్లిలో 23,మధిర లో 22,కల్లూరులో 20 వార్డులకు రిజర్వేషన్ ఖరారు చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్ లో 60 వార్డులకు,ఇల్లందు మున్సిపాలిటీలో 24, అశ్వరావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులకు జిల్లా కలెక్టర్ రిజర్వేషన్ ఖరారు చేశారు. ఎస్సీ ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయగా బీసీలకు డెడికేషన్ కమిటీ సిఫార్సుల మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.

**రేపు నోటిఫికేషన్?**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనకు రానున్నారు.. అదేవిధంగా మేడారంలో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరుకానున్నారు. అనంతరం సోమవారం మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార,అనధికార వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఇప్పటికే మున్సిపాలిటీలలో ఓటర్ జాబితా ఫైనల్ కావడం, వార్డులు, ఛైర్మన్ స్థానాలు రిజర్వేషన్లు పూర్తి కావడం తో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉందని పలు రాజకీయ పార్టీల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు మంత్రులు వారి పరిధిలో ఉన్న మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని ఎదులాపురం మున్సిపాలిటీలో శనివారం రాత్రి కూడా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం చూస్తుంటే ఏ క్షణానైనా నోటిఫికేషన్ వెలడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది కనుక ఎలాంటి అధికార కార్యక్రమాలు చేపట్టకూడదు కనుక ఎన్నికల నోటిఫికేషన కు ముందే అమాత్యులు అభివృద్ధి పనులను శంకుస్థాపనలు చేస్తూన్నారని ప్రజలు భావిస్తున్నారు.

## పాఠశాల విద్యాశాఖలో ఎఫ్ఆర్ఎస్‌ని నిలుపుదల చెయ్యాలి


### ప్రభుత్వానికి సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాఠశాల విద్యా శాఖలో అమలు జరుగుతున్న ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్)ను నిలుపుదల చేయాలని సీపీఎస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్గొండ నుండి సూర్యాపేట్ జిల్లా తుంగతుర్తికి పాఠశాల విధుల నిమిత్తం వెళ్తున్న నలుగురు ఉపాధ్యాయుల్లో జీహెచ్ఎం గీతా రెడ్డి, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ కల్పన మృతి చెందడం, మరో ఇద్దరు జీహెచ్ఎంలు ప్రవీణ్, సునీత రాణి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటం, కరీంనగర్‌లో శ్రీనివాస్ చారి, ఎస్ఏ బయోలాజి ప్రమాదం జరగి, తీవ్రంగా గాయలవ్వడం బాధాకరమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ అన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో అమలులో ఉన్న ఎఫ్ఆర్ఎస్ విధానం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, గత 317 జీఓ వల్ల చాలా మంది ఉపాధ్యాయులు స్వంత జిల్లా ఒక్కటి అయితే.. పని చేసే జిల్లా మరొకటి కావడం వల్ల రోజూ ఒకే సమయానికి హాజరు నమోదు చేయాల్సి న కారణంగా తొందరపాటు ప్రయాణాలు చేయాల్సి వస్తోందన్నారు. దానిమూలంగా ప్రమాదాల ముప్పు పెరుగుతోందని.. అందుకు ఉదాహరణ శనివారం జరిగిన ఘటనే అన్నారు. ప్రతి మారుమూల గ్రామానికి, ఆవాస ప్రాంతానికి వెళ్లే ఏకైక ప్రభుత్వ ఉద్యోగి ఉపాధ్యాయుడేనని, బస్ సౌకర్యం లేని గ్రామాలకు, ఆవాసాలకు వెళ్లే సందర్భంలో వారి వారి స్వంత వాహనాలలో ప్రయాణం చేస్తూ సమయానికి చేరుకోవాలనే తొందరలో అనేక మంది ఉపాధ్యాయులు ప్రమాదాలకు గురి కావడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ప్రాణ భద్రత, ఆరోగ్యం, ఒత్తిడి పని సౌలభ్యం దృష్ట్యా ఈ ఫేసియల్ అటెండెన్స్ విధానం నిలుపుదల చేయాలని స్థిత ప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## శివయ్య కళ్లు తెరిచాడని ప్రచారం!

### విగ్రహానికి భక్తుల ప్రత్యేక పూజలు

**నర్వ, జనవరి 17 ప్రభాతవార్త :** కలియుగంలో ఎన్నో వింతలు,విచిత్రాలతో పాటు అప్పుడప్పుడు అద్భుతాలు కూడా జరగడం మనం చూస్తుంటాం. అయితే ఇప్పటి దేవుడ్ని విగ్రహాల రూపంలో మాత్రమే చూసే భక్తులకు ఒక్కసారిగా ఆ విగ్రహాల్లో కూడా కదలికలు,చలనాలు ఉన్నాయంటే ఏమంటారు.ఎవరైనా ఖచ్చితంగా ఇది దైవానుగ్రహమే అంటారు.లేదంటే భగవంతుని మహిమగానే చూస్తారు. నారాయణ పేట జిల్లా లోని నర్వ మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో శివుడు విగ్రహం కళ్ల తెరిచినట్లు కనిపించడంతో భక్తులు,శివస్వాములు ఆశ్చర్యపోయారు. ఇదంతా శివుడు మూడో కన్ను తెరిచాడని..భక్తుల మొర ఆలకించారని నమ్ముతూ మొక్కులు తీర్చుకుంటున్నారు .సాయంత్రం దీపారాధన సమయంలో ఆలయంలో వెలిగించిన దీపాల కాంతి, ప్రశాంతమైన ఆలయ వాతావరణం కలిసి ఈ దర్శనానికి మరింత దైవత్వాన్ని చేకూర్చాయి. స్వామి ముఖంపై పడిన వెలుతురు వల్ల కళ్ల భాగం స్పష్టంగా కనిపించడంతో భక్తులు దీనిని దైవ అనుగ్రహంగా భావిస్తున్నారు.ఈ దర్శనం మాటలకందని అనుభూతిని కలిగించిందని, ఇది భక్తికి లభించిన వరమని పలువురు భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది.



నర్వ మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివుడి విగ్రహం

## ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తా

### టిఎన్‌జిఒ కేంద్ర సంఘం డైరీ ఆవిష్కరణలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమ స్యల సాధనకోసం తన వంతు సహకారం అందిస్తానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు తెలిపారు. టిఎన్‌జిఒ కేంద్ర సంఘం రూపొందించిన 2026 డైరీ, క్యాలండర్‌ని సీఎస్ శనివారం ఆవిష్కరించారు. టిన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఎస్.ఎం హుస్సేనీ ముజీబ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు మాట్లాడుతూ .. ప్రభుత్వ పథకాలను గ్రౌండ్‌లోకి తీసుకెళ్లే బాధ్యత ఉద్యోగులదేనని, ఉద్యోగులు ప్రభుత్వం వేరు వేరు కాదని, సమస్యలు ఉన్నంత వరకు సంఘాలు ఉంటాయని, చిన్న స్థాయిలో పనిచేసే ఉద్యోగి హక్కుల కోసం పోరాడే స్వభావం టిఎన్‌జిఓ సంఘానికి ఉందన్నారు. తన తండ్రి కూడా రైల్వే ఉద్యోగిగా ఎప్పుడూ రైల్వే కార్డును జేబులో పెట్టుకుని తిరిగేవారని, సమస్యలను పరిష్కరించుకోవడానికి మీ వెంట ఉంటానని అంశాలవారీగా ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుందామని భవిష్యత్‌లో అన్ని విధాలుగా మంచి జరగాలని కోరుకుంటూ రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణతో కూడిన భాగస్వామ్యంతోనే ముందుకు సాగుదామన్నారు. టిఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, ఎస్ఎం హుస్సనీ ముజీబ్ మా ట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలైన పీఆర్సి, పెండింగ్ డీఏల విడుదల, పెండింగ్ బిల్లుల మంజూరు, పాత పెన్షన్ విధానం అమలు, హెల్త్ కార్డ్స్ మంజూరు తదితర డిమాండ్లను పరిష్కరించాల్సి న బాధ్యత ప్రభుత్వం మీద, ముఖ్యమంత్రి, సీ.ఎస్‌పై ఉందని కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పోరాటాలకు పిలుపు ఇవ్వాలని తమ మీద తీవ్ర వత్తిడి ఉందని.. కానీ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ప్రతి సందర్భంలో ముఖ్యమంత్రి వివరిస్తున్నారు కనుక దాదాపుగా రెండు ఏళ్లుగా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఓ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి ముత్యాల సత్యనారాయణ 33 జిల్లా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర సంఘం నాయకులు పాల్గొన్నట్టు నాయకులు తెలిపారు.



శనివారం టిఎన్‌జిఒ కేంద్ర సంఘం రూపొందించిన 2026 క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె రామకృష్ణారావు

## రూ.3,900 కోట్ల బకాయిలు చెల్లించండి

### ప్రభుత్వానికి ఆల్కహాలిక్ బెవరేజ్ సంఘాల విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న రూ.3,900 కోట్లను చెల్లించాలని ఆల్కహాలిక్ బేవరేజ్ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఏడాది కాలంగా ఈ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. తెలంగాణ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిబిసిఎల్) ద్వారా మద్యం సరఫరాదారులకు చెల్లించాల్సి న మొత్తం ప్రస్తుతం రూ.3,900 కోట్లు దాటిందని, ఇందులో గత ఏడాది కాలంగా రూ.900 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించాయి. ఈ మేరకు బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ), ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యూఎ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సిఐఎబిఎస్‌సి) సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం సరఫరా చేసిన 45 రోజుల లోపు చెల్లింపులు జరపాల్సి ఉందని తెలిపారు. అయితే ఈ నిబంధనను అమలు చేయకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశాయి.

## నేటి కేబినెట్‌లో ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై చర్చించాలి

### ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎస్‌డబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి

### ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఆర్‌టిసి జెఎసి

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** మేడారంలో నేడు(ఆదివారం) జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై చర్చించి పరి ష్కరించేలా చూడాలని ఆర్‌టిసి కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఐఎన్‌టియుసి అనుబంధ సంఘంగా కొనసాగుతున్న ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శనివారం లేఖ రాశారు. ఆదివారం జరగనున్న కేబినెట్ సమావేశంలో.. పైసా ఖర్చు లేనీ యూ నియన్లను పునరుద్ధరించాలని, ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ పూర్తి చేయాలి, అపాయింటేడ్ డే ప్రకటించాలని కోరారు. 2021, 2025 రెండు పే స్కేల్స్ బకాయి ఉన్నదని, వెంటనే 2021 పే స్కేల్ అమలు చేయాలన్నారు. రిటైర్ అయిన వారికి 2017 పే స్కేల్ గ్రాట్యూటీ, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ డిఫరెన్స్ డబ్బులతోపాటు వేతనం సవరణ అరియర్స్ డబ్బులు చెల్లించాలని సీఎంకి రాసిన లేఖలో రాజిరెడ్డి కోరారు. అలాగే సెప్టెంబర్ 2024 నుండి రిటైర్ అయిన వారికి టెర్మినల్ బెనిఫిట్స్ డబ్బులు చెల్లించాలన్నారు. మేడారంలో సమ్మక్క సారక్కల సన్నిధిలో జరుగుతున్న కేబినెట్ సమావేశంలో పై సమస్యలపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని, కార్మికులలో ఉన్న అసం తృప్తిని, అభద్రతా భావాన్ని తొలగిస్తూ నిర్ణయం తీసుకుని స్టాఫ్, అండ్ వర్కర్స్ యూనియన్ ఐఎన్టీయుసీ చేయు నిరవధిక నిరాహార దీక్ష నివారించాలని కోరుకుంటున్నట్టు లేఖలో రాజిరెడ్డి పేర్కొన్నారు.

**ఆర్‌టిసి కార్మికులకు శుభవార్త ప్రకటించాలి : జెఎసి**

నేడు(ఆదివారం) మేడారంలో జరుగుతున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలను చర్చించి వాటిని అమలు చేయాలనీ ఆర్‌టిసి జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌ఛైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఆర్టీసీ కార్మిక సమస్యలు పరిష్కారం కొరకు కేబినెట్ సమావేశంలో మంత్రులందరూ సానుకూలంగా స్పందించి మేడారం వనదేవతల సన్నిధిలో ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిచే ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త ప్రకటింపచేయాలని కోరారు.

## పాఠశాల విధుల బాటలో మృత్యువేట

### కారు ప్రమాదంలో ఇద్దరు లేడీటీచర్ల మృతి



**జాజిరెడ్డిగూడెం, జనవరి 17, ప్రభాతవార్త:** జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారి 365పై శనివారం ఉదయం 8 గంటల 20 నిమిషాల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా ఉపాధ్యాయురాళ్లు మృతి చెందగా, మరో ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. నల్గొండ పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు ప్రతిరోజూ తుంగతుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విధులకు రాకపోకలు నిర్వ హిస్తూ ఉండగా, సంక్రాంతి సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైన శనివారం రోజూ మాదిరిగానే విధులకు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నల్గొండ టౌన్ నివాసి, తుంగతుర్తి మండలం కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి మామిడాల కల్పన (43), రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పోరెడ్డి గీత (48) తీవ్ర రక్తగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. అదే ప్రమాదంలో అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆలవాల సునీత రాణి (56), తుంగతుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆలవాల ప్రవీణ్ (48) తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అర్వపల్లి ఎస్ ఐ ఈట సైదులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నల్గొండ పట్టణానికి చెందిన కారు డ్రైవర్ నదిపల్లి గిరి అతివేగంగా మరియు అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని, లింగంపల్లి యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు. ఈ విషాద ఘటనతో తుంగతుర్తి మండలంతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లా విద్యా లోకం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.

## ర్యాలీ నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నేతల అరెస్ట్

### పోలీసుస్టేషన్‌లో నేతల ఆందోళన

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 17, ప్రభాతవార్త:** సికిందరాబాద్ కార్పొరేషన్ కోసం బిఆర్ఎస్ పోరు బాట పట్టింది. సికిందరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సికిందరాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఎంజి రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీకి పిలుపు నిచ్చారు. అయితే ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు తెలియజేసారు. సికిందరాబాద్ జిల్లా సాధన సమితి పేరుతో ర్యాలీకి అనుమతి అడిగారని, అయితే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ కారణంతో ర్యాలీకి అనుమతి ఇవ్వ లేదని చెప్పారు. ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో సికిందరాబాద్ రైల్వేస్టేషన్ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలీసులు పెద్దఎత్తున మోహరించి ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసారు. దీంతో తలసాని సాయికిరణ్‌యాదవ్ నల్లదుస్తులు ధరించి నల్ల బెలూన్లతో సికిందరాబాద్ బచావో నినాదాలతో నిరసన తెలుపుతూ ఎంజిరోడ్డు లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్‌చేసి గోషామహాల్‌కు తరలించారు. అలాగే జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్‌తోపాటు నాగరాజుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, లక్ష్మీపతి, ఆకులహరి తదితరులను అరెస్ట్‌చేసి రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేసారు. మహేశ్వరరెడ్డి, పాండుయాదవ్, లోకనాథం తదితరులు ఉన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న సాయికిరణ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.

# 50 టిఎంసిల నీటితో మున్నేరు-పాలేరు గ్రావిటీ లింక్

## రూ.162.57 కోట్లు కేటాయింపు

### ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్‌లో 1.38 లక్షల ఎకరాలకు నీటిస్థిరీకరణ

### ఆకస్మిక వరదలతో జరిగే నష్టాలకు చెక్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 17:** సహజ వనరులను వినియోగించడం ద్వారా వరద ప్రమాదాలను నివారించడంతో పాటు ఖమ్మం,సూర్యాపేట,మహబూబాబాద్ జిల్లాలకు సమృద్ధిగా సాగు నీరు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం మున్నేరు-పాలేరు లింక్ పధకం నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్



ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకోసం రాష్ట్రప్రభుత్వం రూ. 162.57 కోట్లు కేటాయిం చిందని ఆయన తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మున్నేరు-పాలేరు లింక్ కాలువ పొడుగు 9.6 కిలో మీటర్లు కాగా ఇది సెకనుకు 4,500 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేల రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.ప్రాజెక్టు పూర్తి అయితే ఖమ్మం, సూర్యాపేట,మహబూబాబాద్ జిల్లాలో 1.38 లక్షల ఎకరాలకు నీటి స్థిరీకరణతో పాటు పాలేరు రిజర్వాయర్ ఎగువ భాగంలోని 40 ఎకరాల నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి భద్రత లభిస్తుందని ఆయన వెల్లడించారు.మున్నేరు నది నుంచి ప్రతి సంవత్సరం వచ్చే వరద నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు వృధాగా పోతున్న సుమారు 50 టి.ఎం.సి ల నీటితో ఈ ప్రాజెక్టు నిర్మణానికి రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చుట్టిందన్నారు.ఇప్పటి వరకు ఈ నీరు వృధాగా సముద్రంలో కలుస్తుందని ఆ వృధాను అరికట్టడంతో పాటు ఆ నీటిని సద్వినియోగం చేసుకోవడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.దానికి తోడు ఖమ్మం జిల్లాలో మున్నేరు నుండి వస్తున్న నీటితో సంభవిస్తున్న నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వ నిర్ణయం దోహద పడుతుందన్నారు.మున్నేరు నది వరద జలాలతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూర్ గ్రామంలోనీ చెక్ డ్యామ్ ద్వారా నీరు మళ్లించి నిర్మించే మున్నేరుపాలేరు లింక్ పధకంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్టేజ్2 ను బలోపేతం చేయడంతో పాటు పాలేరు రిజర్వాయర్ ద్వారా భక్త రామదాసు ఎత్తిపోతల పధకం కింద ఉన్న డి.బి.యం 60 ద్వారా ఖరీఫ్ సాగుకు 70,308 ఎకరాల ఆయకట్టుకు అదనపు నీటి లభ్యత చేకూరుతుందని ఆయన తెలిపారు. అదే విదంగా సూర్యాపేట జిల్లాలోని మోతే ఎత్తిపోతల పధకం ద్వారా డి.బి.యం 71 కింద ఉన్న 46,712 ఎకరాల భూమికి నిరంతరం సాగునీటిని అందించవచ్చున్నారు.ఈ ప్రాజెక్టుతో కేవలం సాగునీరు మాత్రమే కాకుండా ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలో తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ పధకానికి 4.70 నీటిని కేటాయిస్తున్నట్లు ఆయన వివరించారు.అన్నింటికీ మించి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా సీతారామ ప్రాజెక్ట్‌కు వినియోగిస్తున్న విద్యుత్ చార్జీలకై రాష్ట్ర ప్రభుత్వం సాలీనా చెల్లుస్తున్న విద్యుత్ చార్జీల భారం నుండి తప్పించుకోవడంతో పాటు అదనపు నీటితో పాలేరు రిజర్వాయర్ దిగువన ఉన్న హైడల్ ప్లాంట్‌లో 2 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా మున్నేరు ఉగ్రరూపం దాల్చిన ప్రతి సమయంలో అతలాకుతలం అయ్యే ప్రాంతాల ప్రజలకు ఇకపై ఎటువంటి ఇబ్బంది కలగదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సుస్పష్టం చేశారు.

# యాసంగికి అనువుగా వేరుశనగ

### రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** యాసంగికి వేరుశనగ సాగు అనువుగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అంతేకాకుండా వేరుశనగ సాగు చేస్తే మంచి లాభాలు ఉంటాయని అన్నారు. మంచి రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో వేరుశనగ సాగుకు అవసరమైన విత్తనాలు తయారుచేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఈ వంగడాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరికి ప్రత్నామ్నాయ పంటగా రబీలో వేరుశనగ పంటను రైతులకు సిఫారసు చేశారు. కేవీకే రూపొందించిన వేరు శనగ విత్తనాల రకాలపై శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. తెలంగాణ లో వేరుశనగను సుమారు 1.3 లక్షల హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 70శాతం వరకు మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, గద్వాల్, వనపర్తి, నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లోనే సాగు చేస్తున్నారు. యాసంగిలో వేరుశనగ పంటను ఉత్తర తెలంగాణలో అక్టోబర్ రెండో పక్షంలోపు, దక్షిణ తెలంగాణలో నవంబర్ రెండో పక్షం వరకు విత్తుకోవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు. అధిక దిగుబడి సాధించాలంటే అనువైన రకాల ఎంపిక చేయాలి. రకాలను ఎంపిక చేసుకునేటప్పుడు రైతులు తమ ప్రాంతానికి అనువైన చీడ పీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. తద్వారా పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా కృషి విజ్ఞాన కేంద్రంలో తొలిసారిగా రెండేళ్ల కిందట నూనె గింజలు సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా అందులో తయారు చేసిన కదిరి లేపాక్షి (కే 1812) వెరైటీ వంగడాలను పరిచయం చేశారు. తొలి దశలో పది హెక్టార్ల విస్తీర్ణంలో ఈ వంగడాలను విత్తి రైతులకు పరిచయం చేశారు. వివిధ జిల్లాల్లో తేలిక నేలలు ఉన్నప్పటికీ అధిక నీటి వసతి ఉండటం వల్ల రైతులు ఎక్కువగా వరి పంట వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు.

### ఇప్పటికే రైతులకు నోటీసులు

### త్వరలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి మెమోలు

# వ్యవసాయ రిజిస్ట్రేషన్ల అక్రమాలపై ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ షురూ

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల అక్రమాలపై ప్రత్యేక కమిటీ ఆడిటింగ్‌ను వేగవంతం చేసింది. ప్రధానంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన లావాదేవీల్లో చలానాల మాయాజాలం, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులకు నోటీసులు జారీ కాగా, రెండు మూడు రోజుల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రస్తుతానికి ప్రభుత్వం నియమించిన కమిటీ కేవలం ఆధారాల సేకరణలో నిమగ్నమై ఉంది. ఈ సంక్రాంతి పండుగ ముగిసిన నేపథ్యంలో ఈ విచారణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆడిటింగ్‌లో 90 శాతం నివేదికలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. కొన్ని చోట్ల చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టే స్థాయిలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఈ కేసు తేలే వరకు తహసీల్దార్ల కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఇప్పటికే కొందరిని విచారిస్తుండటంతో వారిచ్చే సమాచారం ఆధారంగా రెవెన్యూ అధికారులకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో జరిగిన వ్యవసాయ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి కీలక జిల్లాల్లో పనిచేసిన పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు ఇప్పుడు విచారణకు భయపడుతున్నారు.

ముఖ్యంగా 2021 నుండి 2025 మధ్య కాలంలో జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పనిచేసిన పలువురు తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో అనేక లోపాలు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లు తప్పుడు చలానాలను సృష్టిం చడం లేదా ఒకే చలానాను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉపయోగిం చినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

విచారణలో భాగంగా ఇప్పటికే అనేకమంది భూ యజమానులకు, రైతులకు రెవెన్యూ శాఖ నోటీసులు పంపింది. వారి నుంచి ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరిస్తోంది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతి రిజిస్ట్రేషన్ లావాదేవీని క్షుణ్ణంగా ఆడిటింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా లావాదేవీల్లో తేడాలు వచ్చిన వివరాలను నేరుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు.

# పరిశోధనల రాజధానిగా కోల్‌కతా

### నేచర్ ఇండెక్స్‌లో బెంగాల్ రాజధానికి టాప్‌ర్యాంక్

### ప్రపంచవ్యాప్తంగా 84వ ర్యాంకు

**కోల్‌కతా, జనవరి 17:** దేశంలో పరిశోధనల కోశాగారంగాను, రీసెర్చి కేపిటల్‌గాను కోల్‌కత్తాను ఇపుడు పిలుస్తున్నారు. నేచర్ ఇండెక్స్‌లో కూడా కోల్‌కత్తాలో ఉన్న చరిత్రాత్మక సంస్థల్లో జరిగిన అధ్యయనాలు, పరిశోధనలే ఇందుకు కీలకం. అత్యున్నతస్థాయి శాస్త్రీయపరిశోధనలు ఇక్కడే జరిగాయని, ప్రపంచ ప్రఖ్యాత జర్నల్స్‌లో ఇవి ప్రచురితం అయినట్లు నేచర్ ఇండెక్స్ 24 సూచించింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ నగరం పరిశోధనల్లో 84వ ర్యాంకులో ఉంది. యూరోప్, మరికొన్ని దేశాలను అధిగమించి కోల్‌కత్తా ఈ ర్యాంకుసాధించింది. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రాలు, గణిత శాస్త్రం, ఎర్త్‌సైన్సెస్‌లో ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన పరిశోధనలు జరిగాయి. కోల్‌కత్తాలో పురాతన, అధునాతన శాస్త్రీయ పరిశోధన కేంద్రాలున్నాయి. స్వాతంత్ర్యానికి ముందే ఇక్కడ కొన్ని పరిశోధనాకేంద్రాలున్నాయి. భారత అర్థగణాంక శాఖ కేంద్రం కోల్‌కత్తాలోనే ఉంది. గణితం, అర్థగణాంకాలను ఈ సంస్థలోనే అధ్యయనంచేస్తారు. ఇండియన్ అసోసియేషన్ ఫర్‌ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ దేశంలోనే అత్యంత పేరెన్నిక గన్న సంస్థగా నిలిచింది. బోస్ ఇన్‌స్టిట్యూట్, సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్, ఐఐఎస్ఇఆర్ కోల్‌కత్తా వంటి సంస్థలు ఖండాంతర ఖ్యాతిని కూడా పొందాయి. నోబెల్ గ్రహీత సివిరామన్ ఇక్కడే పరిశోధనలుచేసారు. ఎస్ఎన్‌బోస్ వంటి




శాస్త్రవేత్తలు ఆధునిక భౌతికశాస్త్రం పరిశోధనలు, అధ్యయనం, బోధన కూడా చేసారు. ఆ స్ఫూర్తితోనే ఇక్కడ యువశాస్త్రవేత్తలు కొత్తకొత్త ఆవిష్కరణలకు సైతం శ్రీకారంచుట్టారు. ఇక దేశంలోని ఇతర నగరాల్లో బెంగళూరు 13వ స్థానంలో ఉంది. ముంబై వంటి నగరాలు తర్వాత స్థానాల్లో ఉన్నప్పటికీ కోర్‌సైన్స్ రీసెర్చిలోమాత్రం కోల్‌కతాయే రారాజుగా నిలిచిందని నేచర్ ఇండెక్స్ సూచిస్తోంది.

# మున్సిపల్ ఎన్నికలకు బిజెపి పూర్తిగా సిద్ధం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 17:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చూపిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు ఐదు వేల సర్పంచ్ స్థానాల్లో పోటీ చేశామని, గతంతో పోలిస్తే బీజేపీ గెలుపు సంఖ్య పెరిగిందని చెప్పారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలపడుతోందనేందుకు స్పష్టమైన నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని... ఆ పార్టీ ముక్కలవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు గుప్పిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల రాజకీయాలకు పరిమితమైందని ఆరోపించారు.

### ప్రైవేటు స్కూళ్లలో రెండేళ్లకోసారి

# 8 శాతం ఫీజు పెంపు

### అంతకంటే ఎక్కువ పెంచుకోవాలంటే ఫీజు రెగ్యులేటరీ కమిటీ అనుమతి తప్పనిసరి

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విద్యా శాఖ

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజులు పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రెండేళ్లకు ఒకసారి 8శాతం ఫీజును పెంచుకునే వీలు కల్పించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్య శాఖ నుంచి ప్రభుత్వానికి వెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. 8 శాతం కంటే ఎక్కువ ఫీజులను పెంచుకోవాలని పాఠశాలలు భావిస్తే వారు ఫీజు రెగ్యులేటరీ కమిటీ అనుమతి తీసుకోవల్సి ఉంటుంది. యాజమాన్యాలు సమర్పించిన ప్రతిపాదనలపై కమిటీ విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటుంది. రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం విద్యా శాఖ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. నేడు(ఆదివారం) మేడారంలో జరిగే మంత్రివర్గ సమావేశంలో కాకుండా తదుపరి జరిగే మంత్రివర్గంలో విద్యా శాఖ సమర్పించిన సిఫారసులపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రివర్గం ఆమోదించిన అనంతరం అసెంబ్లీలో బిల్లు రూపంలో తీసుకురానున్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందిస్తారు. ఇప్పటికే ప్రతి ఏడాది ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులు పెంచుతూ పేద, మధ్యతరగతిపై భారాలు వేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తున్న నేపథ్యంలో .. ప్రైవేటు స్కూల్స్ ఫీజులు పెంచుకోవడానికి ప్రభుత్వమే అధికారికంగా అనుమతిస్తూ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజు నియంత్రణ కోసం కమిటీని ఏర్పాటు చేయగా.. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అయితే కమిటీ సమర్పించిన ప్రతిపాదనలపై గత బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గానీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. గతంలో ప్రభుత్వం నియమించిన కమిటీ ప్రైవేటు స్కూల్స్ ప్రతి ఏడాది 15 శాతం ఫీజు పెంచుకోవచ్చని, అంతకంటే ఎక్కువ పెంచాలి అనుకుంటే జిల్లా ఫీజు నియంత్రణ కమిటీ(డిఎఫ్ఆర్‌సి) అనుమతి తీసుకోవల్సి ఉంటుందని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలను తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నేపథ్యంలో గతంలో ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ ప్రతిపాదనలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోయినప్పటికీ రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ మాత్రం ప్రతి ఏడాది 10 శాతానికి తగ్గకుండా ఫీజులను పెంచుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది ఫీజులను పెంచేకంటే.. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజులు పెంచుకోవడానికి అనుమతిస్తే తల్లిదండ్రులపై భారం ఎక్కువ పడదనే అభిప్రాయంతోనే రెండేళ్లకు 8 శాతం ఫీజు పెంచుకోవడానికి అనుమతించాలని విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని సర్కారు నిర్ణయించింది. రెండేళ్లయినా అది కార్యరూపం దాల్చలేదు. ఫీజులను నియంత్రించేందుకు తెలంగాణ విద్యాకమిషన్ ద్వారా అధ్యయనం చేయించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ నేపథనయంలో తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసింది. తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కాలేజీస్ ఫీజు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ డ్రాఫ్టులను బిల్లులను సైతం కమిషన్ సిద్ధం చేసింది. వాటి ప్రతిపాదనలను 2025 మార్చిలో సర్కారుకు సమర్పించింది. ప్రతిపాదనల్లో మూడేండ్లకోసారి ఫీజులను సవరించాలని, రెండేండ్లకోసారి 10నుంచి 15శాతం ఫీజులను సవరించే అవకాశమివ్వాలని సిఫారసు చేసింది. వాటితోపాటు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఫీజు రెగ్యులేటరీ కమిటీలుండాలని సూచించింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆయా ప్రతిపాదనలను కొంత మేర మార్పు చేసింది. కొత్త ప్రతిపాదనల్లో రెండేళ్లకోసారి ఫీజుల సవరణకు అవకాశమివ్వగా.. పెంపుదలను 8శాతానికే పరిమితం చేస్తూ ప్రతిపాదించింది. జిల్లా స్థాయిలో కాకుండా.. రాష్ట్రస్థాయిలోనే ఎఫ్ఆర్సీని సిఫారసు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సర్కారుకు చేరాయి. రాష్ట్రంలో సుమారు 11వేల ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ఉన్నాయి. వాటిలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 32 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.



# సికిందరాబాద్‌ను కార్పొరేషన్ చేయండి: కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 17:** సికిందరాబాద్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఏర్పాటైన విజయ్ సంకల్ప సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ జంట నగరాల్లో సికింద్రాబాద్ ఎన్నో సంవత్సరాలుగా అన్నింటికీ కేంద్రంగా ఉందని తెలిపారు. అటువంటి సికింద్రాబాద్ పేరు లేకుండా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడం సరికాదని ఆయన అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. లేనిపక్షంలో బిజెపి అధ్వర్యంలో సికింద్రాబాద్ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలు సికింద్రాబాద్ కార్పొరేషన్ కావాలని కోరుకుంటున్నారని ఆయన చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తాను ముస్లిం కావడం వల్లే అవకాశాలు రావడం లేదని తప్పుడు కామెంట్స్ చేశారని ఆయన అన్నారు. తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ భాషల్లో గొప్ప మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న రెహమాన్‌ను అభిమానులెవరూ ముస్లిమా? హిందువా? అని చూడలేదని ఆయన తెలిపారు.

# డ్రగ్స్ అమ్మకాలకు కేరాఫ్‌గా ధాబాలు

**హైదరాబాద్, జనవరి 17, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న అనేక దాబాలు డ్రగ్స్ అమ్మకాలకు కేరాఫ్‌గా మారుతున్నా యి. నిన్నమొన్నటి వరకు అక్రమ మద్యం అమ్మకాల వరకే పరిమితమైన పలు దాబాలు తాజాగా డ్రగ్స్‌ను సైతం అమ్ముతుండడం, వీటి కోసం డ్రై వర్లే కాకుండా చుట్టుపక్కన గల ఊళ్ల నుంచి యువత పెద్ద సంఖ్యలో వస్తుండడం వల్ల ఆయా ప్రాంతాలలో వ్యసనసరులు పెరిగిపోతూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. దీని వల్ల ఓవైపు రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండగా మరోవైపు యువకులు డ్రగ్స్ మహమ్మారినపడి అనారోగ్యం పాలువుతున్నారు. గడచిన పది రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని రెండుచోట్ల ఈగల్ పోలీసుల దాడిలో ఓపియంతోపాటు గంజాయి పెద్ద మొత్తంలో పట్టుబడగా వీటిని అమ్ముతున్న వారు అరెస్టయ్యారు.

డ్రగ్స్ స్మగ్లర్లు రూటు మార్చారు. నిన్నటి వరకు నేరుగా కస్టమర్ల చెంతకు డ్రగ్స్ చేర్చిన స్మగ్లర్లు మారిన పరిస్థి తుల నేపథ్యంలో ధాబాలను సురక్షిత స్థావరాలుగా ఎంచుకున్నారు. రాష్ట్రంలోని జాతీయ రహదారులపై వందల సంఖ్యలో దాబాలు వుండడం తెలిసిందే. ఇందులో మెజారిటీ దాబాలు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారివే కావడం గమనార్హం. ఈ దాబాదలలో మెజారిటీ 24 గంటలు పనిచేస్తుంటాయి. మెజారిటీ దాబాలలో ఇప్పటికీ అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనేది బహిరంగ రహస్యమే. దాబాలలో సాయంత్రం, రాత్రి వేళల్లో భోజనం చేసేందుకు వచ్చే వారిలో దూర ప్రాంతాలకు చెందిన లారీ డ్రైవర్లే ఎక్కువగా వుంటున్నారు. లారీ డ్రైవర్లలో ఎక్కువ మంది ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు వుంటున్నారు. వీరిలో అనేక మందికి మద్యం తాగి వాహనాలను నడిపే అలవాటు వుందని పోలీసు, రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారు లపై డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు పెద్దగా లేకపోవడం వీరికి బాగా కలిసి వచ్చిన అంశం. ఇదే సమయలో మద్యం అమ్మకాలు చేసే దాబాలు ఆయా ప్రాం తాల నేతలు, పోలీసులను మచ్చిక చేసుకుని తమ జోలికి రాకుండా జాగ్రత్త పడతాయని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.

ఈ క్రమంలోనే మెజారిటీ దాబాలలో ఇప్పటికీ అక్రమంగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. జాతీయ రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాలకు కారకులైన లారీల డ్రైవర్లలో అనేక మంది మద్యం మత్తులో వున్నట్లు తేలడం గమనార్హం. ఇక తాజా విషయానికి వస్తే నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద జాతీయ రహదా రిపై వున్న ఓ దాబాలో ఓపియం అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దాడిచేసి పది కిలోల ఓపియంను పట్టు కున్నారు. దాబా యజమానిని అరెస్టు చేశారు. ఇదే ప్రాంతంలోని మరో దాబాలో గంజాయి అమ్మకాలను రట్టు చేశారు. ఓపియంను రాజస్తాన్ నుం చి అక్కడి డ్రైవర్లు తక్కువ ధరకు కొని దానిని ఎక్కువ ధరకు దాబా నిర్వాహకుడికి అమ్మాడు. గంజాయితో పోలిస్తే మరింత నిషా ఇచ్చేది ఓపియం. దీనివల్ల ప్రాణాలు కూడా పోయే ప్రమాదం వుంది. ఓపిఎం సేవించిన డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు లారీలను నడుపుతున్నట్లు పోలీసులతో పాటు ర వాణా శాఖ అధికారులు తేల్చారు. ఈ సమయంలో ఏమైనా జరిగితే రోడ్డుపై ప్రయాణించే వారి ప్రాణాలకు దిక్కెవరనేది ప్రశ్న. రాజస్తాన్ నుంచి తె లంగాణకు ఓపియం స్మగ్లింగ్ అవడం చాలా కాలంగా వున్నా ఇటీవల ఇది మరింత పెరిగింది. రాజస్తాన్‌లో ఓపిఎం సాగుపై కఠిన నిఘా లేక పోవ డంతో అనేక మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. ముఖ్యంగా భారత్...పాక్ సరిహద్దుల్లో గల అనేక గ్రామాల రైతులకు ఓపియం ఆదాయవన రుగా మారింది.

# రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వండి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 17:** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి. మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రజలను కోరారు. అత్యధిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు గెలిపిస్తే ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని ఒప్పించి కేంద్రం నుండి అధిక నిధులు తీసుకొస్తాం. అవసరమైతే సీఎస్సార్ నిధులు తెచ్చి బీజేపీ పాలిత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. కేంద్రం నుండి వస్తున్న నిధులతోనే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నయాపైసా కూడా పట్టణ స్థానిక సంస్థల్లో ఖర్చు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాల్తిఅని సవాల్ విసిరారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్ లో జరిగిన బీజేపీ మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.ఫిబ్రవరి 15లోపు మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. ఈనెల 28లోపు షెడ్యూల్ వెలువడే అవకాశముందని చర్చ జరుగుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు లక్కీ హ్యాండ్. రాష్ట్రమంతా బీజేపీకి మంచి వాతావరణం ఉంది. గతంకంటే అధిక పంచాయతీ స్థానాలను గెలుచుకున్నామన్నారు. అర్బన్ లో బీజేపీకి పూర్తి అనుకూలంగా ఉంది. మున్సిపల్ ఎన్నికల్లోనూ అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటాం. ఆయన ఆధ్వర్యంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామేమో అని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ లేదు. ఎందుకంటే బీఆర్ఎస్ నుండి ఎవరు గెలిచినా మళ్లీ కాంగ్రెస్ లోకి వెళతారు. ఆ పార్టీ నుండి పోటీ చేయడానికి ఆసక్తి కూడా చూపడం లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉండబోతోందన్నారు. అభ్యర్థుల ఎంపికపై సర్వేలు



### కరీంనగర్, నిజామాబాద్, బైంసా, నిర్మల్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లతో మజ్లిస్ దోస్తీ

### మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటాం: కేంద్రమంత్రి బండి సంజయ్

నిర్వహించాలి. కార్యకర్తలు గెలిచే అవకాశమున్న చోట వాళ్లకు మాత్రమే టిక్కెట్ ఇవ్వాలి. కష్టపడితే గెలుస్తామనుకున్న చోట కూడా వాళ్లకే టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుందామన్నారు. ఇక ఏం చేసిన కార్యకర్త గెలిచే అవకాశం లేదని అనుకుంటే ఇతర పార్టీల్లో మంచి పేరున్న నాయకులను బీజేపీలోకి తీసుకుందాం, అంతిమంగా గెలు పే ప్రాతిపది కగా టిక్కెట్లు ఇవ్వాలన్నారు..కాంగ్రెస్ ముక్త భారత్ బీజేపీ లక్ష్యం. దేశంలో 3 రాష్ట్రాలకే కాంగ్రెస్ పరిమితమైంది. హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో బీజేపీ గెలుపు ఖాయమైంది. ఇక మిగిలింది తెలంగాణే. బెంగాల్, తమిళనాడు, అసోం ఎన్నికల తరువాత జాతీయ నాయకత్వం దృష్టి మొత్తం తెలంగాణ మీదే ఉండబోతోందన్నారు. 2028 ఎన్నికల్లో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు. ఎన్నికల హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు రాష్ట్ర ప్రజలంతా రడీగా ఉన్నారు. కరీంనగర్, నిజామాబాద్, బైంసా, నిర్మల్ వంటి ప్రాంతాల్లో బీజేపీ గెలుస్తుందనే సర్వేలు చెబుతున్నాయి. కానీ డీలిమిటేషన్ పేరుతో ఓట్లను తారుమారు చేసి ఎంఐఎంకు ఎక్కువ సీట్లు వచ్చేలా కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. మజ్లిస్ పార్టీలో రెండు వర్గాలున్నాయి. ఒక వర్గం కాంగ్రెస్ తో, ఇంకో వర్గం బీఆర్ఎస్ తో కలిసి పనిచేస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో మజ్లిస్ కు 10, 12 సీట్లు వచ్చినా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ సహకారంతో మేయర్ సీటును కైవసం చేసుకోవాలని చూస్తున్నాయన్నారు. అదే సమయంలో ఆ పార్టీలకు డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి, ప్రజా సమస్యలు, హిందుత్వ అంశాలే బీజేపీ ప్రధాన ఎజెండా అని పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 2014కు ముందు, ఆ తరువాత జరిగిన అభివృద్ధి గురించి బేరీజు వేయాలని ప్రజలను కోరదామన్నారు. మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే కేంద్ర నిధులవల్లే. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన, అమ్రుత్ పథకాల పేరుతో వేల కోట్ల నిధులిస్తోందన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

### 22 నుంచి ఫిబ్రవరి 7 వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 17:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే 1257 ట్యాబ్ టెక్నిషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్,హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను శనివారం విడుదల చేసింది. రాత పరీక్షకు హాజరైన ప్రతి అభ్యర్థి సాధించిన మార్కులు, ఇతరత్రా వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. మొత్తం 2322 పోస్టులకుగానూ 1:1.5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ లిస్టులో ఉన్నవారికి ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించి,అనంతరం సెలక్షన్ లిస్ట్ విడుదల చేయనున్నారు.

# పొడుల రుచులు

నాలికకి రుచి తగలడానికో.. కంచంలో ఓ వెరైటీగా కనిపించడానికో.. అని పొడులని తేలికగా తీసిపారే యొద్దండోయ్! వీటితో బోలెడు ప్రయోజనాలున్నాయ్. వ్యాధి నిరోదక శక్తిని పెంచే మునగాకు పొడి.. వైరస్‌లను తరిమికొట్టే ఉసిరి పొడి.. జీర్ణశక్తిని పెంచే బీరకాయ పొట్టు పొడి. బరువు తగ్గించే అవిసెగింజల పొడి.. ఆరోగ్యానికి మేలు చేకూర్చే దోస గింజల పొడి.. ఎలా తయారు చేయాలో చూద్దాం రండి..!

## అవిసెగింజల పొడి



**కావాల్సినవి:** అవిసె గింజలు అరకప్పు, సెనగపప్పు పావుకప్పు, మినపప్పు పావుకప్పు, ఎండుమిర్చి పది, చింతపండు నిమ్మకాయంత, కరివేపాకు రెబ్బ, నూనె చెంచా, ఉప్పు కావాలి.

**తయారీ:** అడుగు మందంగా ఉంటే ఒక కడాయి తీసుకుని దానిలో ముందుగా సెనగపప్పుని ఎర్రగా అయ్యేంతవరకూ సన్నమంట మీద వేయించి పక్కనపెట్టుకోవాలి. తర్వాత మినపప్పు, అవిసె గింజలని విడివిడిగా వేయించు కోవాలి. చివరిగా కడాయిలో కాస్త నూనె వేసుకుని అందులో ఎండు మిర్చి, చింతపండు, కరివేపాకు వేసి వేయించు కోవాలి.అన్ని చల్లారాక మిక్సీలో సెనగపప్పు. మినపప్పులని కలిపి మిక్సీ పట్టుకోవాలి. అవిసెగింజలని విడిగా.. మరీ మెత్తగా కాకుండా మిక్సీపట్టాలి. లేదంటే అవి వేడికి గడ్డ కట్టేస్తాయి. చివరిగా ఎండుమిర్చి కూడా ఆడించుకుని ఉప్పువేసి దానికి కలుపుకొంటే అవిసెగింజల పొడి సిద్ధం. ఈ పొడి అన్నంలోకి లేదా కూరల్లో వేసుకున్నా బాగుంటుంది. చెమ్మ లేకుండా డబ్బాలో దాచిపెడితే రెండు నెలల వరకూ నిల్వ ఉంటుంది... అవిసె గింజలు బరువు తగ్గుతాయి. జుట్టు, చర్మానికి మేలు చేస్తుంది.

## బీరకాయపొట్టు పొడి

**కావాల్సినవి.** లేత బీరకాయపొట్టు, అరకేజీ, వాము చెంచా, ఎండుమిర్చి12, మినపప్పు, రెండు చెంచాలు, పసుపు పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు ఏడు, చింతపండు 10గ్రా, **తయారీ:** బీరకాయపొట్టులో చెమ్మలేకుండా చూసుకుని అరచెంచా ఉప్పు వేసి మిక్సీలో బరకగా ఆడుకోవాలి. పొయ్యిమీద పాన్ పెట్టుకుని చెంచా నూనె వేసుకుని ఎండు మిరపకాయల్ని రంగు మారేంతవరకూ వేడి చేసి పక్కన పెట్టేయాలి. ఆ తర్వాత అదేపాన్లో మినపప్పుని ఎర్రగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్లో చెంచా నూనె వేసుకుని వేడెక్కాక బీరకాయ పొట్టుని వేసి పొడిపొడిగా అయ్యేంతవరకూ వేయించుకోవాలి. ఇందులో పసుపునే, వాము కూడా వేసుకుని మరికాసేపు వేయించుకోవాలి. మిక్సీలో వేయించిన ఎండుమిర్చి, మినపప్పు, వెల్లుల్లిపాయరెబ్బలు, చింతపండు వేసి పొడి చేసుకోవాలి. ఆ తర్వాత బీరకాయపొట్టు, ఉప్పు కూడా వేసి పొడి చేసుకోవాలి... యాంటీఆక్సిడెంట్లు నిండుగా ఉంటే ఈ పొడి. వామువల్ల జీర్ణప్రక్రియ సజావుగా సాగేట్టు చేస్తుంది.



## మునగాకుపొడి

**కావాల్సినవి.** మునగాకు కప్పు, కరివేపాకు రెబ్బ, పల్లీలు అర కప్పు, సెనగపప్పు చెంచా, మినప్పప్పు చెంచా, జీలకర్ర అరచెంచా, ఎండుమిర్చి ఆరు, ఉప్పు తగినంత, ఆమ్చూర్పొడి అరచెంచ**తయారీ** అడుగుమందంగా ఉండే పాన్ తీసుకుని అందులో మునగ, కరివేపాకు వేసుకుని బాగా గలగలమనేలా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత పల్లీలను దొరగా వేయించుకోవాలి. వాటికే సెనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఎండుమిర్చి కూడా వేసి వేయించుకోవాలి. చల్లారాక మునగాకు కూడా వేసుకుని పొడిచేసుకోవాలి. ఆమ్చూర్ పొడి అంటే ఎండు మామిడి పొడిని కూడా చేర్చుకుని మిక్సీ పట్టుకోవచ్చు. ఆరోగ్యానికి మంచిది. ఈ పొడి రక్తహీనత రాకుండా చూస్తుంది. వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది.



## దోస గింజల పొడి



**కావాల్సినవి:** దోసగింజలు అరకప్పు, మినప్పప్పు అరకప్పు, నువ్వులు పావుకప్పు, సెనగపప్పుపావుకప్పు, ఎండుమిర్చి 20, జీలకర్ర పావుకప్పు, కరివేపాకు రెండు రెబ్బలు,వెల్లుల్లి రెబ్బలుఐదు.

**తయారీ:** వెల్లుల్లి తప్పించి తక్కిన వాటిని విడివిడిగా పాన్లో ఎర్రగా వేయించుకోవాలి. చల్లారాక ముందుగా దోసగింజల్ని, ఎండుమిర్చితో కలిపి మిక్సీ పట్టుకోవాలి. ఆ తర్వాత తక్కినవాటిని కూడా మిక్సీ పట్టుకుని చివర్లో వెలుల్లి కూడా వేసి మరొక్కసారి మిక్సీ పట్టుకుంటే దోసగింజల పొడి సిద్ధమవుతుంది. ఇడ్లీలోకి నెయ్యి వేసుకుని తింటే ఆరోగ్యానికి కూడా మంచిది.

# అందరిలో ఏదో ఒక ప్రతిభ ఉంది..

**ప్రోత్సాహం... అనుకున్నది సాధించగలను అనే నమ్మకం... ఉండాలే కానీ, మహిళలకు సాధ్యం కానిదంటూ ఏది ఉండదు. ఇవే విస్లావత్ స్వప్నకు పేరు తెచ్చి పెట్టాయి. ఆమె ఎవరు? ఏం చేస్తున్నారో తెలియాలంటే..**



పుట్టి పెరిగింది నిజామాబాద్ ఇందల్వాయి, నాన్న వాళ్య. అమ్మ లలిత వ్యవసాయం చేస్తున్నారు. మేము ముగ్గురు పిల్లలు, చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టం. పాఠ్య పుస్తకాల్లో బొమ్మలు చూస్తూ వాటిని గీసేదాన్ని, స్కూల్లో డ్రాయింగ్ పోటీలు జరిగితే బహుమతి మాత్రం పక్కాగా గెలుచుకునేదాన్ని. ఇంటర్వ్యూగానే పెళ్లైంది. మావారు స్వామి ప్రైవేట్ ఉద్యోగి. పెళ్లి తర్వాత ఖిడిగ్రీ చదవాలనుందిఖి అని ఆయనకి చెబితే కాలేజీలో చేర్చారు.

**పేపరు ... కత్తెర... ఒక కళ..!!** డ్రాయింగ్ ఆర్ట్స్ పేరుతో యూట్యూబ్, ఇన్‌స్టా ఖాతాలను తెరిచి పలకపై బొమ్మలు గీసి వీడియోలు పెట్టేదాన్ని తక్కువ వ్యూస్ వచ్చేవి. అందరిలానే నేనూ చేస్తే ప్రత్యేకత ఏముంది అనిపించి ఏదైనా కొత్తగా చేయాలనుకున్నా. పేపరుపై ఆర్ట్ కటింగ్ చేసి వీడియోలు పోస్ట్ చేశా, కష్టంగా ఉండే బొమ్మల్ని యూట్యూబ్‌లో చూసి నేర్చుకునేదాన్ని, ఒక పేపర్ ఆర్ట్ కట్ చేయడానికి 4050 నిమిషాలు పట్టేది.



అలా నెమ్మదిగా సెలెబ్రిటీల ఫొటోలు కటింగ్ చేసి ఇన్‌స్టాలోనూ వీడియో పెట్టడం మొదలుపెట్టా వ్యూస్ పెరిగాయి. అంతేకాదు, వారి ఫొటోలను కట్ చేయమని ఆర్డర్లూ ఇచ్చేవారు. పేపరు కటింగ్తోపాటు థ్రెడ్ ఆర్ట్. బ్లడ్ ఆర్టూ వేస్తుంటా. సంపాదన మొదలైంది. మొదట్లో కష్టంగా అనిపించినా ఇప్పుడు అలవాటు అయిపోయింది. అందరిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించడంలో మనం తడబడు తాం. నా బలం చిత్ర లేఖనం అని తెలిశాక దాంట్లో నైపుణ్యాన్ని పెంచుకున్నా, ఆ కళే సాధారణ గృహిణిగా ఉన్న నన్ను అందరికీ పరిచయం చేసింది. మరిన్ని మెలకువలు నేర్చుకుని ముందుకు అడుగులు వేయాలన్నదే నా లక్ష్యం.

# తప్పకుండా నెరవేర్చే దేవుడి వాగ్దానం

అంతర్వాణి

ప్రభువైన యేసుక్రీస్తు కృపను బట్టి మనం కొత్తసంత్సరంలోకి అడుగుపెట్టాం. అంతేకాదు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తారు. వాగ్దానం తీసుకోవడం మాత్రమే కాదు, దేవుడు తప్పకుండా దాన్ని నెరవేరుస్తాడని నమ్మాలి. విశ్వసించాలి. లేకపోతే తీసుకున్న వాగ్దనం ఫలించదు.



చాలామంది వాగ్దానాలను కూడా తీసుకుని ఉంటారు. 'దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టుగానే యున్నవి గనుక మనద్వారా దేవునికి మహిమ కలుగుటకై అవి ఆయనవలన నిశ్చయములై (ఆమేన్) యున్నవి' (2 కొరింథీ 1:20). వాగ్దానాలను తీసుకునేటప్పుడు చాలామంది చూపించే ఆసక్తి, ఆతర్వాత దానిపై శ్రద్ధ పెట్టరు. మర్చిపోతారు కూడా. కానీ వాగ్దానం తీసుకున్న తర్వాత ప్రతిరోజూ దానిగురించి ప్రార్థించాలి. వాగ్దానం తీసుకునేముందు ఎంత భక్తిని, ఆసక్తిని కనబరుస్తామో సంవత్సరం చివరి రోజు వరకు దానిపై మనసు ఉంచాలి. అప్పుడే దేవుడు మనకు అంతేకాదు వాగ్దానం అంటే అదేదో చిలకజోశ్యంగా భావించరాదు. దేవుడు మనపట్ల తనకున్న ప్రణాళికలను బయలుపరిచే ఒక సాధనం మాత్రమే 'వాగ్దానం'. నిరాశలో, శ్రమల్లో, కృంగిపోయిన పరిస్థితిలో ఉన్న వారు, భవిష్యత్తుపట్ల ఆందోళన ఉన్నవారు దేవుడి వాగ్దానం ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. ఆనందాన్ని కలిగిస్తుంది. అంతేకాదు మరింతగా దేవుడిపై విశ్వాసాన్ని ఉంచేలా చేస్తుంది. ఆయనపై ఆధారపడేలా చేస్తుంది. అందుకే దేవుడు మనకు ఈ వాగ్దానాలను ఇస్తున్నాడు. కాబట్టి మనకు ఏ వాగ్దానం దేవుడు ఇచ్చినా, దానిపై పరిపూర్ణ విశ్వాసంతో దేవుడిని వేడుకుందాం. ప్రభువు అట్టి కృపను మనకు దయచేయునుగాక..

-పి.వాణిపుష్ప

# చుండ్రుతో చిక్కులా?

**ఏ కాల మైనా ఇబ్బంది పెట్టే సమస్య ఏదంటే చుండ్రే గుర్తొస్తుంది. దీనికి కాలుష్యం, చలి, పదార్థాల్లో రసాయనాలు... ఇలా కారణాలు. షాంపూలతో ప్రయోజనం లేదా... సహజమైనవి చూడండి.**



చలివేళ తలస్నానం చేయాలి అనిపించదు కానీ... వారానికి రెండుసార్లయినా తప్పక చేయాల్సిందే. లేదంటే మాడు మీద దుమ్ము పేరుకునిపోయి ఇన్ఫెక్షన్‌కి దారి తీస్తుంది. కాబట్టి... వేపాకు, కలబంద, మెంతులను ఒక గ్లాసు నీటిలో పదినిమిషాలు మరిగించి, నీటిని వడకట్టండి. ఆపై ఆ నీటిలో షాంపూ కలిపి తలస్నానం చేయాలి. జుట్టు మెత్తగా మారుతుంది, చుండ్రు బెడద తప్పుతుంది.తలకు నూనె పెట్టి, ఆపై తలస్నానం చేస్తే... కురులకు వచ్చే మెరుపే వేరు. కానీ చుండ్రు ఉన్నప్పుడు నూనె పెడితే సమస్య పెద్దది అవుతుందని భయం. అలాంటప్పుడు పావుకప్పు కొబ్బరినూనెకు అరచెంచా టీట్రీ ఆయిల్ కలిపి తలకు పట్టించండి. అరగంటయ్యాక తలస్నానం చేస్తే సరి. కురులకు పోషణ అందుతుంది, టీట్రీఆయిల్‌లోని యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చుండ్రుకి చెక్ పెడ తాయి. ఇదే కాదు... లావెండర్, రోజెమెరీ, పెప్పర్మెంట్ నూనెలను ప్రయత్నించినా కోరుకున్న ఫలితం దక్కుతుంది. పైగా ఇవి మనసునీ తేలికపరుస్తాయి.కలబంద గుజ్జులోనూ యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఫంగల్ గుణాలెక్కువే ఇవి మాడు ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. తలస్నానానికి అరగంట ముందు కలబంద గుజ్జును మాడు నుంచి కురుల వరకు పట్టిస్తే సరి. లేదంటే తలస్నానం పూర్తయ్యాక మగ్గులో కప్పుచొప్పున నీళ్లు, యాపిల్ సిడార్ వినెగర్ తీసుకుని ఆ మిశ్రమాన్ని తలపై పోసుకోవాలి. అయిదు నిమిషాలు మృదువుగా మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేసినా చుండ్రు బాధ తగ్గుతుంది. పోషకాహారం తీసుకోకపోవడం, సరిగా నీళ్లు తాగకపోవడం, ఒత్తిడి కూడా చుండ్రు సమస్యను పెంచేవే కాబట్టి, వీటిపైనా దృష్టి పెట్టాలి.

# తేమనందించే సాక్సులివి

చలికాలంలో చర్మం పొడిబారడమే కాదు... పాదాల పగుళ్లూ ఇబ్బంది పెడతాయి. ఇవి తీవ్రమైతే నొప్పి బాధిస్తుంది. దీనికి తగినంత తేమనందించడమే పరిష్కారం. అలాగని మాయిశ్చరైజర్ రాసుకున్నా... అది పూర్తిగా ఇంకిపోకుండానే చెప్పులకో, నేలకో, నిద్రపోయేటప్పుడు దుప్పటికో పూసేస్తాం. దాంతో అవి ఓ పట్టాన తగ్గవు. ఆ ఇబ్బంది లేకుండా ఉండాలంటే... మార్కెట్లో దొరుకుతోన్న ఈ మాయిశ్చరైజర్ సాక్స్ ఎంచుకోండి. అందులోనే కాస్త క్రీమో, నూనెనో వేసి పాదాలకు తొడిగితే సరి. తగిన తేమ అంది కోమలంగా మెరిసిపోతాయి. మంచి ఆలోచన కదూ!



# 'స్పిరిట్' 2027న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్, హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్‌లను అందించిన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఖిస్పిరిట్ఖి లో తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్ లో కనిపించబోతున్నారు. మేకర్స్ న్యూ ఇయర్ కి పవర్ ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ప్రభాస్‌ను రా, ఫిల్టర్ చేయని అవతార్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ వైరల్ గా మారింది.మేకర్స్ ఇప్పుడు థియేటర్ రిలీజ్ డేట్ నిఖరారు చేశారు. వచ్చే ఏడాది సమ్మర్ రేస్‌ను కిక్ స్టార్ట్ చేస్తూ స్పిరిట్ మార్చి 5, 2027న గ్రాండ్ గా రిలీజ్ కానుంది.సందీప్ వంగా మార్క్ ఇన్‌టెన్స్, యాక్షన్, ఎమోషన్స్, రా పవర్ తో ఈ యాక్షనర్ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని అందించబోతోంది. త్రిప్తి దిమ్రీ హీరోయిన్ గా నటిస్తుండగా ప్రకాష్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్, టిసిరీస్ ఫిల్మ్స్ సంయుక్తంగా భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ దశలో వుంది.స్పిరిట్ తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడతో పాటు చైనీస్, జపనీస్, కొరియన్ మొత్తం 8 భాషల్లో యూనివర్సల్ గా రిలీజ్ కానుంది.

# 'సీతా పయనం' సాంగ్ 'బసవన్న' విడుదల



మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శ కుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శక త్వంలో రాబోతోన్న కొత్త సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేష నల్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతో న్నారు. ఈ మూవీలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించను న్నారు. యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్నారు. అతని మేనల్లుడు యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషిస్తున్నారు. అయితే యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా పాత్రను పరిచయం చేస్తూ వదిలిన 'బసవన్న' పాట ఎంతో అద్భుతంగా ఉంది. ఇందులో బసవన్నగా ధ్రువ సర్జా అద్భుతమైన పాత్రలో కనిపించ బోతోన్నట్టుగా ఈ పాటను చూస్తే అర్థం అవుతోంది. అనూప్ రూబెన్స్ ఇచ్చిన బాణీ ఎంతో పవర్ ఫుల్‌గా ఉంది. ఈ సినిమాలో బసవన్న పాత్ర ఎంత ఇంపార్టెంట్ అన్నది ఈ పాటలో చూపించారు. కాసర్ల శ్యాం లిరిక్స్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండగా.. నకాస్ అజీజ్, ఎల్. కీర్తన గాత్రం శ్రోతలకు వినసొంపుగా ఉంది. ఈ పాటకు లలితా శోభి, శ్రష్టి వర్మ కొరియోగ్రఫీ అందించారు. ఇక ఈ మూవీకి ధ్రువ సర్జా మెయిన్ అస్సెట్‌గా మారబోతోన్నాడని ఈ పాట స్పష్టం చేస్తోంది.ప్రస్తుతం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని పూర్తి చేశారు. ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది.

# తెర

## 'పెద్ది' చికిరి చికిరి సాంగ్



200 మిలియన్లకు పైగా వ్యూస్‌తో గ్లోబల్ రికార్డులను బద్దలు కొట్టిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చికిరి చికిరి సాంగ్మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. బుచ్చి బాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ సింగిల్ చికిరి చికిరి తో మ్యూజిక్ ప్రమోషన్స్ అద్భుతంగా ప్రారంభించింది. ఈ ట్రాక్ ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ కు చేరుకుంది. ఎఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ పాట అదిరిపోయే బీట్, ఎనర్జీ, ఫెస్టివల్ వైబ్, రామ్ చరణ్ వైరల్ డ్యాన్స్ తో మెస్మరైజ్ చేసింది.చికిరి చికిరి ఇప్పటికే భారీ రిపీట్ వాల్యూను సాధిస్తూ 2 మిలియన్‌కు పైగా లైక్స్‌ను, మ్యూజిక్ ప్లాట్‌ఫాంలలో 60 మిలియన్‌కు పైగా ఆడియో స్ట్రీమ్స్‌ను రాబట్టి చార్ట్‌లను ఏలుతోంది. మ్యూజిక్ లవర్స్, సినిమా అభిమానులు ఈ పాటను మళ్లీ మళ్లీ వింటూ ప్రతి రోజు ప్లేలిస్ట్‌లో తప్పనిసరిగా ఉండే పాటగా మార్చేశారు.ఈ పాట వైరల్ తుఫాను సోషల్ మీడియాను ముంచెత్తింది. 300రీ కంటే ఎక్కువ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ , 870రీ యూట్యూబ్ షార్ట్స్‌లో నెటిజన్లు ఐకానిక్ హుక్ స్టెప్‌ను రిక్రియేట్ చేస్తున్నారు, ఇది యంగ్ ఆడియన్స్ లో గ్లోబల్ మూమెంట్ గా మారింది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు,

# 'నారీ నారీ నడుమ మురారి' యునానిమస్ హిట్ - స్టార్‌శర్వా



హిట్ ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు: సంక్రాంతి విన్నర్ మీట్‌లో చార్మింగ్ స్టార్ శర్వాచార్మింగ్ స్టార్‌శర్వా సంక్రాంతి బ్లాక్ బస్టర్ నారీ నారీ నడుమ మురారి. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్త, సాక్షివైద్య కథానాయికలుగా నటించారు. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని సంక్రాంతి విన్నర్‌గా నిలిచి హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సంక్రాంతి విన్నర్ మీట్ నిర్వహించారు. సంక్రాంతి విన్నర్ మీట్ హీరో శర్వా మాట్లాడుతూ... అందరికీ హ్యాపీ సంక్రాంతి. ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పాను. చెప్పి కొట్టాను. ఇది గర్వంతోనో పొగరుతో మాట్లాడటం లేదు. చాలా హంబుల్ గా చెప్తున్నాను. హిట్టు కొడతానని అంత నమ్మకంగా చెప్పడానికి కారణం ఈ కథ. రామ్, నందు, భాను వాళ్లు రాసిచ్చిన కథ మొదటి రోజు నుంచే నాకు ఎంతో నమ్మకాన్ని కలిగించింది. రామ్ అబ్బరాజు లాంటి డైరెక్టర్ ఇండస్ట్రీకి కావాలి. తను ప్రొడ్యూసర్ డైరెక్టర్. నాకు కథ ఎలా చెప్పాడో అంతకంటే అద్భుతంగా తీశాడు. చాలా రోజులుగా హిట్ కోసం ఎదురుచూస్తున్నాను.

# 'మిరాకిల్' ఫస్ట్ లుక్ విడుదల



రణధీర్ భీసు హెబ్బా పటేల్ జంటగా...సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రల్లో.....ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రమేష్ ఎగ్గిడి శ్రీకాంత్ మొగదాసు చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్టైనర్ "మిరాకిల్". "సత్య గ్యాంగ్, ఫైటర్ శివ" చిత్రాల దర్శకుడు ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ సంక్రాంతి కానుకగా ఈరోజు ( జనవరి 16న) విడుదల చేశారు. శ్రీమతి జ్యోత్స్న ఈ చిత్రానికి సహ నిర్మాత. పోరాట సన్నివేశాలతో మొదటి షెడ్యూల్ జరుపుకున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ ఈనెల 22 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరగనుంది!!రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బా పటేల్ హీరోయిన్. అక్షర నున్న సుజన మరో హీరోయిన్. సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నాయుడు పెంద్ర విలన్ గా పరిచయమవుతున్నాడు. సీనియర్ ఫిల్మ్ ఖజర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్ గా నటిస్తున్న ఈ చిత్రంలో జనార్దన్, యోగి కాత్రే, విజయ్ సూర్య, ఇంతియాజ్, సాయిబాబా, దిల్ రమేష్, ఝాన్సీ, సూర్యనారాయణ, శ్రీధర్, శ్రీకాంత్, శివ, ఆమని, హైమావతి, నవ్య (అమ్ము) బెజవాడ మస్తాన్, ఆర్. కుమార్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు!!

# 'స్లమ్ డాగ్' ఫస్ట్ లుక్ రిలీజ్



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్, పవర్ హౌస్ పెర్ఫార్మర్ విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా వెంచర్ పూరిసేతుపతి ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది, షూటింగ్ భాగం ఇప్పటికే పూర్తయింది. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాధ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా, మేకర్స్ ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'స్లమ్ డాగ్' అనే పవర్ ఫుల్ టైటిల్ తో, 33 టెంపుల్ రోడ్ అనే ట్యాగ్ లైన్ తో వస్తున్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో విజయ్ సేతుపతి వైల్డ్ అవతార్‌లో , ఇంటెన్స్ లుక్ లో కనిపించారు. పొగమంచుతో కప్పబడిన మురికివాడలో గజిబిజిగా ఎగురుతున్న డబ్బు కుప్పల మధ్య, పెద్ద కొడవలిని పట్టుకుని కనిపించడం అదిరిపోయింది. ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ కి టైటిల్, ఫస్ట్ లుక్ భారీ హైప్ ని క్రియేట్ చేశాయి. పూరి జగన్నాధ్ తన హీరోలను అద్భుతంగా మేకోవర్ లతో ప్రెజెంట్ చేయడంలో పాపులర్. స్లమ్ డాగ్ లో విజయ్ సేతుపతిని ఇంతకు ముందు ఎన్నడూ చూడని అవతార్ లో చూపించబోతు న్నారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, టబు, దునియా విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## హాకీ ఇండియా లీగ్‌లో రాంచీ రాయల్స్ మూడో విజయం



**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్, 2025-26లో రాంచీ రాయల్స్ తమ విజయ పరుగును కొనసాగించింది. ఈ సీజన్‌లో తమ చివరి హోమ్ మ్యాచ్‌లో సూర్మా హాకీ క్లబ్‌పై 4-1 తేడాతో విజయం సాధించి బౌన్స్‌పై మూడో విజయాన్ని నమోదు చేసింది. టామ్ బూన్ (20వ నిముషం, 22) చేసిన 2 గోల్స్, మన్దీప్ సింగ్ (47), మన్మీత్ సింగ్ రాయ్ (14) చేసిన గోల్స్ రాంచీ రాయల్స్ పాయింట్ల పట్టికలో మూడవ స్థానానికి ఎగబాకాయి. అలాగే జీత్పాల్ (52) సూర్మా తరపున ఆటలో ఏకైక గోల్ చేశాడు. సూర్మా మొదటి ఐదు నిమిషాల్లోనే తమ తొలి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించుకుంది. మొదటి క్వార్టర్‌లో మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించినప్పటికీ, రాంచీ రాయల్స్ తరపున గోల్ చేయడంలో సూరజ్ కర్కేరాను దాటలేకపోయింది. మొదటి పదిహేను నిమిషాల్లో రెండు జట్లకు ఎనిమిది సర్కిల్ ఎంట్రీలు వచ్చాయి. కానీ సామ్ లేన్ యొక్క తెలివైన రికోచెట్ మన్మీత్ సింగ్ రాయ్ (14) కు దారితీసిన తర్వాత రాయల్స్ ఆధిక్యంలోకి వెళ్ళింది. రెండవ అర్ధభాగంలో సూర్మా హాకీ క్లబ్ ఎక్కువ భాగం ఆధిక్యంలో ఉంది. చివరి క్వార్టర్ ప్రారంభంలోనే రాంచీ రాయల్స్ జట్టు ఫలితాన్ని అందించింది. సూర్మా గోల్ కీపర్‌ను చుట్టుముట్టి తన జట్టుకు నాల్గవ గోల్ చేశాడు. పోటీ ముగియడానికి ఎనిమిది నిమిషాలు మిగిలి ఉండగా, సూర్మా హాకీ క్లబ్ ముందుకు సాగి జీత్పాల్ వారి తరపున గోల్ సాధించింది. అయితే, రాంచీ రాయల్స్ ఆధిక్యంతో మూడవ విజయంతో ముగించింది.

## విజయ్ హజారే ట్రోఫీ.. ఫైనల్స్‌కు సౌరాష్ట్ర, విదర్భ



**న్యూఢిల్లీ:** విజయ్ హజారే వన్డే ట్రోఫీలో సౌరాష్ట్ర, విదర్భ జట్లు ఫైనల్ చేరుకున్నాయి. విశ్వరాజ్ జడేజా (165 నాటౌట్) భారీ సెంచరీతో విజృంభించడంతో రెండో సెమీఫైనల్లో సౌరాష్ట్ర 9 వికెట్ల తేడాతో పంజాబ్‌ను చిత్తు చేసింది. ఈ వన్‌సైడ్ పోరులో తొలుత పంజాబ్ 50 ఓవర్లలో 291 పరుగులకు ఆలౌటైంది. అన్మోల్ప్రీత్ సింగ్ (100) సెంచరీతో ఆకట్టుకోగా, కెప్టెన్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (87), రమణ్‌దీప్ సింగ్ (42) రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లలో చేతన్ సకారియా నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేజింగ్లో ఓపెనర్ విశ్వరాజ్ దంచికొట్టడంతో సౌరాష్ట్ర 39.3 ఓవర్లలోనే 293/1 స్కోరు చేసి సునాయాసంగా గెలిచింది. విశ్వరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. అంతకు ముందు జరిగిన తొలి సెమీస్‌లో విదర్భ 6 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ కర్నాటకకు షాకిచ్చింది. తొలుత కర్నాటక 49.4 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. కరుణ్ నాయర్ (76), శ్రీజిత్ (52) హాఫ్ సెంచరీలతో రాణించారు. విదర్భ పేసర్ దర్శన్ నల్కండే (5/48) ఐదు వికెట్లతో దెబ్బకొట్టాడు. అనంతరం ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అమన్ మోఖడే (138) సెంచరీతో చెలరేగడంతో విదర్భ 46.2 ఓవర్లలో 284/4 స్కోరు చేసి గెలిచింది. రవికుమార్ సమర్థ్ (76 నాటౌట్) కూడా సత్తా చాటాడు. ఆదివారం జరిగే ఫైనల్లో సౌరాష్ట్రతో విదర్భ పోటీపడనుంది.



## మహిళల ప్రీమియర్ లీగ్‌లో యుపి చేతిలో ముంబయి మళ్లీ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ 4వ సీజన్‌లో మరోసారి ముంబై ఇండియన్స్‌ను యూపీ వారియర్జ్ జట్టు ఓడించింది. 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులకే పరిమితమైంది. దీంతో యూపీ జట్టు 22 పరుగుల తేడాతో గెలుపొందింది. ముంబై బ్యాటర్లలో అమేలియా కెర్ (49 నాటౌట్: 28 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), అమన్‌జోత్ కౌర్ (41; 24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మాత్రమే రాణించారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (18), హేలీ మాథ్యూస్ (13) లు విఫలమయ్యారు. యూపీ బౌలర్లలో శిఖా పాండే రెండు వికెట్లు పడగొట్టింది. క్రాంతి గౌడ్, సోఫీ ఎకిల్‌స్టోన్, దీప్తి శర్మ, క్లో ట్రయాన్ తలా ఓ వికెట్ తీశారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్జ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు సాధించింది. యూపీ బ్యాటర్లలో మెగ్ లానింగ్ (70; 45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లు, ఫోబ్ లీచ్ ఫీల్డ్ (61; 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచికొట్టారు.హర్లీన్ డియోల్ (25), క్లో ట్రయాన్ (21) కూడా రాణించారు. ముంబై బౌలర్లలో అమేలియా కెర్ మూడు వికెట్లు పడగొట్టగా, నాట్ సైవర్‌బ్రంట్ రెండు వికెట్లు తీసింది. నికోలా కారీ, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్ తలా ఓ వికెట్ సాధించారు.



# న్యూజిలాండ్‌తో చావో రేవో
## నేడు టీమిండియాకు బిగ్ టెస్ట్





**న్యూఢిల్లీ:** భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ ప్రస్తుతం 1-1తో ఉత్కంఠభరితంగా మారింది. దీంతో ఈ నెల 18వ తేదీన జరిగే మ్యాచ్ రెండు జట్లకు కీలకమైంది. వడోదరలో భారత్ గెలవగా, రాజ్‌కోట్‌లో కివీస్ జెండా పాతడంతో ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం సిరీస్ విజేతను నిర్ణయించనుంది. ఈ నెల 18 న్యూజిలాండ్‌తో జరగనున్న ఈ మ్యాచ్‌లో టీమిండియా తన అత్యుత్తమ ప్లేయింగ్ 11తో బరిలోకి దిగనుంది. రాజ్‌కోట్ ఓటమి తర్వాత టీమ్ మేనేజ్‌మెంట్ కొన్ని కీలక మార్పులు చేసింది. సిరీస్‌లోని మొదటి మూడు మ్యాచ్‌లకు తిలక్ వర్మ స్థానంలో శ్రేయాస్ ఎంపిక కాగా, లెగ్ స్పిన్నర్ బిష్ణోయ్ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో జట్టులోకి వచ్చాడు. ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగే మూడవ, నిర్ణయాత్మక వన్డేలో కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ అనుభవజ్ఞుడైన ఓపెనర్ రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు.

ఓపెనింగ్ కాంబినేషన్‌లో ఎటువంటి మార్పు ఉండదు. విరాట్ కోహ్లీ 3వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. ఒకసారి అతను సెట్ అయ్యాక, ఏ జట్టు బౌలింగ్ దాడినైనా ఛిన్నాభిన్నం చేయగలడు. శ్రేయాస్ అయ్యర్ 4వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. అయ్యర్ చాలా నైపుణ్యం కలిగిన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్. న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి వన్డేలో అతను 49 పరుగులు, రెండవ వన్డేలో 8 పరుగులు చేశాడు. కేఎల్ రాహుల్ 5వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. అతను వికెట్ కీపర్‌గా కూడా వ్యవహరిస్తాడు.

రాహుల్ తన తుఫాన్ బ్యాటింగ్‌తో త్వరగా పరుగులు సాధించడంలో నిష్ణాతుడు. ఇప్పుడు, మూడవ వన్డేలో, కేఎల్ రాహుల్ టీం ఇండియాకు కీలకంగా మారనున్నాడు. ఆల్ రౌండర్ నితీష్ 6వ స్థానంలో బ్యాటింగ్ చేయగలడు. మిడిల్, డెత్ ఓవర్లలో సిక్సర్లు కొట్టడంలో అతనికి ప్రత్యేకమైన ప్రతిభ ఉంది. అతను లాంగ్ సిక్సర్లు, మీడియం పేస్ బౌలింగ్ కూడా చేస్తాడు. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా స్థానంలో ఆయుష్ బదోనీని ప్లేయింగ్ ఎలెవన్ జట్టులో చేర్చవచ్చు. బదోనీ తన తుఫాన్ బ్యాటింగ్‌తో పాటు, ఆఫ్‌స్పిన్ బౌలింగ్ కూడా చేస్తాడు. కుల్దీప్ యాదవ్ ప్రాణాంతక స్పిన్ వైవిధ్యాల కారణంగా అతను ప్లేయింగ్ 11 లోనే ఉండవచ్చు. మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలను ప్లేయింగ్ ఎలెవన్‌లో ఫాస్ట్ బౌలర్లుగా ఎంపిక చేయవచ్చు. నితీష్ రెడ్డి నాల్గవ ఫాస్ట్ బౌలర్ పాత్రను పోషించనున్నారు.



## ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో.. ఢిల్లీ, హర్యానా విజయం

**న్యూఢిల్లీ:** ప్రొ రెజ్లింగ్ లీగ్-2025 సీజన్ తొలి మ్యాచ్‌లో హర్యానా థండర్స్ ఆధిపత్య ఆల్ రౌండ్ ప్రదర్శనతో పంజాబ్ రాయల్స్‌ను 7-2 తేడాతో ఓడించింది. మహిళల 57 కిలోల బౌట్‌లో పంజాబ్ కెప్టెన్ రోక్సానా 8-0 తేడాతో జసినాపై విజయం సాధించింది. అలాగే అండర్23 ప్రపంచ, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో కాంస్య పతక విజేత ప్రియా మాలిక్ 76 కిలోల పోటీలో తన అద్భుతమైన ప్రదర్శనకు ఫైటర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది. 86 కిలోల విభాగంలో జరిగిన పోటీలో అషిరోవ్ అష్రఫ్ 6-5తో తరియల్ గఫ్రిందాష్విలిపై విజయం సాధించడంతో హర్యానా జట్టు తొలి పోరులో సత్తా చాటింది. 57 కిలోల మహిళల బౌట్‌లో నేహ సంగ్వాన్ రోక్సానా జసినాను 8-0తో క్లినికల్ షట్‌అవుట్ చేయడంతో హర్యానాకు అనుకూలంగా టైను తిరిగి ఇచ్చింది. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత ఇరినా కొలియాడెంకో 62 కిలోల విభాగంలో అనా గొడినెజ్‌పై 15-2 తేడాతో ఆధిపత్యం చెలాయించింది.

76 కిలోల మహిళల బౌట్‌లో ఫైటర్ ఆఫ్ ది మ్యాచ్ ప్రియా మాలిక్ కాజల్ ధోచక్‌ను గరిష్ట స్థాయికి నెట్టింది. స్కోరు 2-2తో ముగిసిన తరువాత, కాజల్ చివరి పాయింట్ సాధించి హర్యానాకు 6-1తో స్కోరును అందించింది. హర్యానా థండర్స్‌కు చెందిన మాజీ ఒలింపిక్ ఛాంపియన్ యుయి సుసాకి చివరి పోటీలో హన్షిక లాంబా చేతిలో ఓటమి పాలైంది, దీనితో థండర్స్ 7-2 తేడాతో ఆధిపత్య విజయాన్ని సాధించింది. ఢిల్లీ దంగల్ వారియర్స్ తమ తొలి మ్యాచ్‌లో మహారాష్ట్ర కేసరిపై 6-3 తేడాతో సునాయాసంగా విజయం సాధించింది. 17 ఏళ్ల సారికా పారిస్ 2024 రజత పతక విజేత గుజ్మాన్ లోపెజ్ యుస్నీలిస్‌పై 7-0 తేడాతో విజయం సాధించింది.

## బడ్జెట్ రోజున పనిచేయనున్న బిఎస్ఇ, ఎన్ఎస్ఇలు!



వాణిజ్యం

**ముంబయి, జనవరి 17:** కేంద్ర బడ్జెట్ 202627 నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెటు కూడా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టే రోజైన ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం అయినప్పటికీ, ఆ రోజున యథావిధిగా ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు బిఎస్ఇ ఎన్ఎస్ఇలు ప్రకటించాయి. ఈ మేరకు ప్రత్యేక సర్క్యులర్లు జారీ చేశాయి. ఫిబ్రవరి 1న ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు సాధారణ ట్రేడింగ్ సెషన్ జరుగుతుందని ఎన్ఎస్ఈ తన సర్క్యులర్‌లో పేర్కొంది.

ఈక్విటీ సెగ్మెంట్‌తో పాటు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఒ), కమొడిటీ డెరివేటివ్స్ విభాగాల్లోనూ ట్రేడింగ్ ఉంటుందని స్పష్టం చేసింది. అయితే, టి+0 సెటిల్‌మెంట్ సెషన్, ఆక్షన్ సెషన్ మాత్రం ఆ రోజు ఉండవని బీఎస్ఈ తెలిపింది. సాధారణంగా శని, ఆదివారాల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు ఉంటుంది. బడ్జెట్ వంటి కీలక ఘట్టం కారణంగా ఈ ప్రత్యేక ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరం తర్వాత బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. గతంలో 2015, 2025 బడ్జెట్‌లను శనివారాల్లో ప్రవేశపెట్టినప్పుడు కూడా మార్కెట్లను తెరిచే ఉంచారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు రెండు విడతలుగా కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. జనవరి 30న ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించిన ప్రకారం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.



## హెచ్‌డిఎఫ్‌సి నికరలాభం రూ.19,807 కోట్లు

**ముంబయి, జనవరి 17:** దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బలమైన పనితీరు కనబరిచింది. డిసెంబర్‌తో ముగిసిన ఈ త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 12.17 శాతం పెరిగి రూ.19,806.63 కోట్లకు చేరినట్లు శనివారం ప్రకటించింది. గతేడాది ఇదే కాలంలో బ్యాంక్ లాభం రూ.17,656.61 కోట్లుగా ఉంది. బ్యాంక్ కీలక ఆదాయమైన నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) కూడా 6.4 శాతం పెరిగి రూ.32,615 కోట్లకు చేరుకుంది. ఆస్తుల నాణ్యత విషయంలో బ్యాంక్ పనితీరు మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత ఏడాదితో పోలిస్తే 1.42 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గింది. నికర ఎన్పీఏల నిష్పత్తి కూడా 0.46 శాతం నుంచి 0.42 శాతానికి మెరుగుపడింది. ఈ త్రైమాసికంలో కేటాయింపులు (ప్రొవిజన్స్) 10 శాతం తగ్గి రూ.2,837.9 కోట్లకు పరిమితం కావడం లాభాల పెరుగుదలకు దోహదపడింది. 2025 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 12.2 శాతం వృద్ధితో రూ.27,524 బిలియన్లకు, ఇచ్చిన రుణాలు (అడ్వాన్సులు) 11.9 శాతం వృద్ధితో రూ.28,446 బిలియన్లకు చేరాయని బ్యాంక్ తన ఎక్స్చేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. మొత్తం మీద ఆదాయం, లాభాలతో పాటు కీలక వ్యాపార కార్యకలాపాల్లోనూ బ్యాంక్ స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది.

# భారతీయ కుటుంబాల్లో రూ.350 లక్షలకోట్ల పసిడి!

### హెచ్‌డిఎఫ్‌సి ఎంఎఫ్ ఇయర్‌బుక్ నివేదిక

**ముంబయి, జనవరి 17:** అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, యుద్ధాలు, అనిశ్చితి నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారానికి విపరీతంగా డిమాండ్ పెరిగింది. రికార్డు స్థాయిలో పసిడిధరలు60నుంచి 70 శాతం వరకు పెరిగింది. ఈ క్రమంలోనే బంగారం కలిగి ఉన్న వారికి వారి సంపద విలువ పెరిగిందనే చెప్పొచ్చు. ఇక బంగారాన్ని అధికంగా వినియోగించే దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంటుంది. భారతీయుల దగ్గర ఉన్న బంగారం విలువ దాదాపు దేశ జీడీపీతోనే పోటీపడుతుండటం విశేషం. 2025 సంవత్సరంలో బంగారం ధర భారీగా పెరిగిన క్రమంలో భారతీయ కుటుంబాల సంపద కూడా ఏకంగా రూ. 117 లక్షల కోట్లు పెరిగింది. ఇది 1.3 ట్రిలియన్ డాలర్లకు సమానం. భారతీయుల దగ్గర ఉన్న బంగారం విలువ ఇలా పెరిగిందని చెప్పొచ్చు. ఈ మేరకు హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఇయర్ బుక్ 2026 పేరిట ఒక రిపోర్ట్ విడుదల చేసింది. అంటే 2025 సంవత్సరం భారతీయ కుటుంబాలకు బంగారు పంట పండించిందని చెప్పొచ్చు. స్టాక్ మార్కెట్లు గతేడాది తీవ్ర ఒడుదొడుకులకు లోనైనప్పటికీ పసిడి ధరలు ఆకాశాన్నంటడంతో భారతీయుల సంపద అనూహ్యంగా పెరిగిందని రిపోర్ట్ పేర్కొంది. ఇక గత పాతికేళ్లలో ఎన్నడూ లేనంతగా బంగారం ధరలు 2025లో పెరిగాయని.. ఇదే స్థాయిలో సంపద వృద్ధి చెందిందని తెలిపింది. 2025 ఏడాదిలో డిసెంబర్ 15 వరకు చూస్తేనే ఏడాదిలోనే 10 గ్రాముల బంగారం ధర రూ. 57 వేలకుపైగా పెరిగింది. 20 24లో రూ. 14 వేల మేర పెరిగింది. ఇక భారతీయుల వద్ద ఉన్న మొత్తం బంగారం విలువ రూ.3.8 ట్రిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 350 లక్షల కోట్లకుపైగా ఉందని అంచనా. ఇది దాదాపు




భారతదేశ జీడీపీతో సమానంగా ఉన్నట్లు చెబుతున్నారు. భారతీయుల దగ్గర సుమారు 34,600 టన్నుల మేర బంగారం నిల్వలు ఉన్నట్లు ఇటీవల మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ఇక గతేడాది బంగారం ఎలా రాణించిందో ఈక్విటీ మార్కెట్లు మాత్రం అంతగా వెనుకబడ్డాయి. గ్లోబల్ మార్కెట్లతో పోలిస్తే ఇండియాకు చెందిన నిఫ్టీ 50 ఇండెక్స్ సుమారు 25 శాతం తక్కువ పనితీరు కనబర్చింది. గత 3 దశాబ్దాల్లో ఇదే అత్యంత కనిష్టస్థాయి ప్రదర్శనగా చెబుతున్నారు. అద్భుత లాభాలు అందించిన స్మాల్, మిడ్ క్యాప్ షేర్లు గతేడాది డీలా పడ్డాయి. దాదాపు 30 శాతం వరకు స్మాల్ క్యాప్ స్టాక్స్ తమ 52 వారాల గరిష్ఠాల నుంచి 30 శాతం కంటే ఎక్కువగా పతనం అయ్యాయి. మొత్తంగాచూస్తే యూరప్ మార్కెట్లు, ఎమర్జింగ్ మార్కెట్లు టాప్‌లో ఉండగా ఆయిల్, బిట్ కాయిన్, అమెరికన్ డాలర్ వంటివి వెనుకబడ్డాయి.



## ఎస్‌బ్యాంకు నికరలాభం 55% వృద్ధి

**న్యూఢిల్లీ,జనవరి 17:** ప్రైవేటురంగంలోని ఎస్‌బ్యాంకు మూడోత్రైమాసిక లాభాలు 55శాతంపెరిగాయి. స్థిరాస్థిప్రమాణాలు వృద్ధిచెందినట్లు బ్యాంకు ప్రకటించింది. మూడో త్రైమాసికంలో నికరలాభాలు 55.4శాతం పెరిగి రూ.952కోట్లకు చేరాయి. నికరవడ్డీ ఆదాయం కూడా రూ.2466 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయవనరులు రూ.1633కోట్లుగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది. మొత్తం రాబడులు 9.7శాతం పెరిగి రూ.4098 కోట్లుగా ఉన్నాయి. వ్యయాలపరంగా నిర్వహణ ఖర్చులు 7.8శాతంపెరిగి రూ.2865 కోట్లకు చేరాయి. దీనిలో లేబర్‌కోడ్‌ల అమలువల్ల వేతన వ్యత్యాసం రూ.155కోట్ల భారం పడింది. నిర్వహణలాభం మూడోత్రైమాసికంలో రూ.1234కోట్లుగా ఉంది. బ్యాంకు కేటాయింపులు కూడా రూ.22కోట్లకు గణనీయంగా తగ్గాయి. దీనితో నిర్వహణ లాభంకూడా 47.7శాతానికి పెరిగింది. ఇక పన్నులభారం బ్యాంకుపై రూ.260 కోట్లవరకూ ఉంది. బ్యాంకు మార్జిన్లు కూడా మెరుగయ్యాయి. నికరవడ్డీ మార్జిన్ 2.6శాతంగా ఉంది. కాసా డిపాజిట్లు 8.5శాతంపెరిగి రూ.99,483కోట్లవరకూ ఉన్నాయి. నికర లడ్వాన్సులు రూ.2,57,451కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. మొత్తం రుణపంపిణీలు ఏడుశాతంపెరిగి ఈ త్రైమాసికంలో రూ.26, 982కోట్లుగా ఉన్నాయి. స్థూల ఎన్పీయేలు 1.5శాతానికి తగ్గాయి. నికరనిరర్థక ఆస్తులు కూడా 0.3శాతానికి వచ్చాయి. కేటాయింపులపరంగా కూడా 83.3శాతంగా ఉన్నట్లు ప్రకటించింది. 33 కొత్తశాఖలు ప్రారంభించింది. దీనితో మొత్తం బ్యాంకుశాఖలు తొమ్మిదినెలల్లో 76శాఖాలుప్రారంభించినట్లయింది. బ్యాంకు మొత్తం రుణాలు రూ.2.57 లక్షలకోట్లుగా ఉన్నాయి. బ్యాంకు షేర్లు 2.22శాతంపెరిగి రూ.23.46గా బిఎస్ఇలో కొనసాగాయి.



## ఐదురెట్లు పెరిగిన ఆర్బీఎల్‌బ్యాంకు నికరలాభాలు

### మూడో త్రైమాసికంలో రూ.214కోట్లకు వృద్ధి

**ముంబయి, జనవరి 17:** ప్రైవేటురంగంలోని ఆర్బీఎల్ బ్యాంకు మూడోత్రైమాసికంలో నికరలాభాలు ఐదురెట్లుపెరిగి రూ.214 కోట్లకు చేరినట్లుప్రకటించింది. 555.47 శాతం నికరలాభాలుపెరిగాయని వెల్లడించింది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.32.63కోట్లు మాత్రమే ఆర్జించగలిగినట్లు తెలిపింది. బ్యాంకు రాబడులు కూడా 2.33శాతం పెరిగి రూ.4,71,700 కోట్లకు పెరిగాయి. కొత్తలేబర్‌కోడ్‌లు అమలుతో రూ.32 కోట్లు అదనపు వ్యయం భరించాల్సివచ్చిందని వెల్లడించింది. నిర్వహణ లాభం కూడా ఏడుశాతంపెరిగింది. త్రైమాసికం వారీగా అయితే 25శాతంపెరిగి రూ. 912 కోట్లకు చేరినట్లు తేల్చింది. మొత్తం డిపాజిట్లు 12శాతంపెరిగి 1,19, 721కోట్లకు చేరాయి. అడ్వాన్సులు కూడా మొత్తం 14శాతంపెరిగి రూ.1,03,086 కోట్లవరకూ ఉన్నాయి. కాసా డిపాజిట్లు ఆరుశాతంపెరిగి 36,972 కోట్లకు చేరినట్లు బ్యాంకువెల్లడించింది. రిటైల్ అడ్వాన్సులు 10శాతంపెరిగి రూ.60,611కోట్లకు చేరాయి. టోకు అడ్వాన్సులపరంగాచూస్తే 21శాతంపెరిగి రూ.42,475 కోట్లుగా ఉనాననయి. స్థూల నిరర్థక ఆస్తులు డిసెంబరు చివరినాటికి 1.88శాతం పెరిగాయి. అలాగేనికర ఎన్పీఎ నిష్పత్తికూడా 0.55వాతానికి దిగిరావడం బ్యాంకుకు కలిసొచ్చింది. దీనితో కేటాయింపుల కవరేజి రేషియో 93.2శాతానికి పెరిగింది. మొత్తం కేపిటల్ అడక్వసీ రేషియో 14.94శాతంగా ఉంది. బ్యాంకు ఎండి సిఇఒ సుబ్రహన్యకుమార్‌మాట్లాడుతూ రానున్న కాలంలోకూడా పటిష్టమైన వృద్ధిని సాధిస్తామని విశ్వాసం ప్రకటించారు. రిటైల్ అడ్వాన్సులు, కమర్షియల్ బ్యాంకింగ్‌వైపు ఫోకస్ మరింతపెరుగుతుందని చెప్పారు. మొత్తం బ్యాంకు టచ్‌పాయింట్లు 1921కి పెరిగాయి. బ్యాంకు శాఖలు 580కి చేరుకోగా మొత్తం 1341 బిజినెస్ కరస్పాండెంట్ శాఖలు కూడా ఉన్నాయి. వీటిలో 291 బ్యాంకింగ్ ఔట్‌లెట్లు ఉన్నాయి. ఆర్బిఎల్‌ఫిన్‌సెర్వ్ నూరుశాతం అనుబంధంగా పనిచేస్తోంది. ఈ సంస్థలో కూడా 1084 బిజినెస్ కరస్పాండెంట్ శాఖలున్నాయి. బ్యాంకు షేర్లు వారాంతంలో బిఎస్ఇలో 4.28శాతంపెరిగి 325.10కి చేరాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.